


# చైతన్యరథం




సమాజమే దేవాలయం. ప్రజలే దేవుళ్ళు






# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు






## ఢిల్లీకి లోకేష్

స్వాగతం పలికిన టీడీపీ ఎంపీలు
నేడు పుస్తకావిష్కరణకు హాజరు

- వివరాలు 6 లో..

## ప్రపంచ విపణికి ఎంఎస్ఎంఈ ఉత్పత్తులు



- దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి
- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు
- సైనింగ్, గ్రౌండింగ్, ఓపెనింగ్ మా విధానం
- ప్రతీ రంగంలోనూ వాటికి పెట్టుబడి అవకాశాలు
- జెన్-జీ కలల సాకారానికి కార్యాచరణ ప్రణాళిక
- ఏపీ నుంచి 100 యూనికార్న్ కంపెనీలు లక్ష్యం
- ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 38 పారిశ్రామిక పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన
- రూ.200 కోట్లతో ఏపీ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్
- మెటా, అమెజాన్ సహా వివిధ సంస్థలతో ఒప్పందాలు
- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదిక ప్రారంభం

2

*దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి ఎంఎస్ఎంఈ రంగం. భారీ పరిశ్రమలు దేశానికి ప్రతిష్ఠ తీసుకువస్తే.. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు లక్షల మందికి జీవనోపాధి కలిగిస్తాయి. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటైన ఎంఎస్ఎంఈల ద్వారా తయారైన ఉత్పత్తులు ప్రపంచ విపణికి చేర్చేందుకు ప్రయత్నిస్తు న్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విజయవాడ అంబేద్కర్ కళావేదికలో ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026కు సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 38 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా మెటా, అమెజాన్, జోహో సహ వివిధ సంస్థలతో ఏపీ ఎంఎస్ ఎంఈడీసీ ఒప్పందం కుదుర్చుకుంది.*

## సులభతరంగా ప్రభుత్వ సేవలు

- నిబంధనల పేరుతో జాప్యం సరికాదు
- బిజినెస్ రూల్స్ మార్పునకు కార్యాచరణ
- రొటీన్‌కు స్వస్తి.. వినూత్నంగా ఆలోచించాలి
- కుల పత్రాల జారీలో ఇబ్బందులు తొలగించాలి
- పరిష్కారం కాని సమస్యలపై ఫోకస్ పెట్టండి
- సైబర్ మోసాలను అరికట్టేలా పటిష్ట వ్యవస్థ
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం

5



### పేదల సేవలో
## కూటమి ప్రభుత్వం

- పెన్షన్ల పంపిణీలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమం
- రెండేళ్లలో సుమారు రూ.65 వేల కోట్లు పైనే లబ్ధి
- ఐదేళ్లలో గత ప్రభుత్వం ఖర్చు పెట్టిన మొత్తంలో
- 71.5 శాతం రెండేళ్లలో అందజేసి రికార్డ్
- ప్రతినెలా పాల్గొంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

3



## కాలుష్యరహిత గోదావరి



- వ్యర్థాల శుద్ధిప్లాంట్లను పక్కాగా నిర్వహించాలి
- పుష్కరాల నిర్వహణలో సామాజిక బాధ్యత చూపండి
- పుష్కరాల నిర్వహణపై డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

10

### కష్టపడి చదివి ఉద్యోగాలు సాధిస్తే
## టీచర్లనే అవమానిస్తారా?





- అందరూ మీలా దొంగ అనుకోవడం నేరం
- లెంపలేసుకుని వారికి క్షమాపణలు చెప్పాలి
- ఐదేళ్ల మీ పాలనలో ఒక్క టీచర్ పోస్టు లేదు
- జాబ్ క్యాలెండర్ ఊసే అసలు లేదు
- మేం 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం
- త్వరలోనే మరో డీఎస్సీ ఇవ్వబోతున్నాం
- ఏడవటానికి సిద్ధంగా ఉండండి
- జగన్‌రెడ్డికి మంత్రి నారా లోకేష్ స్ట్రాంగ్ కౌంటర్

5

*మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ దుష్ప్రచారం చేస్తున్న జగన్‌రెడ్డికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కష్టపడి చదివి ప్రతిభతో ఉద్యోగాలు సాధిం చిన 16 వేల మందిని మీరు అనుమానిస్తున్నారు.. టెన్త్ పేపర్లు ఎత్తుకెళ్లిన దొంగ అని అందరూ అలాగే ఉంటారనుకోవడం చాలా పెద్ద నేరం. మెగా డీఎస్సీలో ఎంపికైన టీచర్లకు జగన్ లెంపలేసుకుని క్షమాపణలు చెప్పాలని కోరారు. త్వరలోనే మరో డీఎస్సీ ఇవ్వబోతున్నాం. మరింత బిగ్గరగా ఏడవడానికి సిద్ధంగా ఉండాలని హితవుపలికారు.*
*పేదల సేవలో అగ్రభాగాన కూటమి ప్రభుత్వం.*

## పారదర్శకంగా మెగా డీఎస్సీ

- పేపర్ లీక్.. డేటా డిలీట్ అవాస్తవం
- కోర్టు ఆదేశాల ఉల్లంఘన పూర్తిగా అబద్ధం
- దుష్ప్రచారంపై పాఠశాల విద్యాశాఖ ఖండన

*ఇటీవల కొన్ని ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో మెగా డీఎస్సీ-2025 నిర్వహణ, ప్రశ్నాపత్రాల లీకేజీ, అభ్యర్థుల ఎంపికపై వస్తున్న కథనాలు పూర్తిగా అవాస్తవమని పాఠశాల విద్యాశాఖ ఖండించింది. ఆ కథనాలకు సంబంధించిన వాస్తవాలను వివరించింది.*

5






## ఎక్సైజ్ విధానాలపై మంత్రివర్గ ఉపసంఘం సమీక్ష

15

- మద్యం విధానం, బీరు సరఫరాపై కీలక చర్చలు
- ఎక్సైజ్ రంగ సంస్కరణలపై లోతైన చర్చ


హైబ్రిడ్ మహానాడు కౌంట్ డౌన్- 1

## గిన్నిస్ రికార్డు దిశగా మహానాడు

**మహిళామణులకు ప్రాధాన్యమే లక్ష్యం - ఎన్టీఆర్‌కు నివాళితో తొలిరోజు ప్రారంభం - 20 తీర్మానాలు, 65 మంది ప్రసంగం**

*హైబ్రిడ్ విధానంలో ఈ నెల 27, 28 తేదీల్లో మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించే హైబ్రిడ్ మహానాడు మహిళామణులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పించటమే లక్ష్యంగా జరగనుంది. హైబ్రిడ్ విధానంలో 1875 క్లస్టర్లలో మహానాడు జరగనుండగా ఇప్పటికే 1851 క్లస్టర్లలో మ్యాపింగ్ పూర్తయింది. క్షేత్రస్థాయిలో భవిష్యత్తు నాయకులను గుర్తించి ప్రోత్సహించటమే లక్ష్యంగా క్లస్టర్ విధానం. మహానాడు తొలిరోజు కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరుగుతుంది. ఎన్టీఆర్‌కు నివాళి, తెలుగుతల్లి పాటతో మహానాడు ప్రారంభమవుతుంది. గంటన్నర పాటు తొలి సెషన్ జగిగాక 15 నిమిషాలు స్వల్ప విరామం ఉంటుంది. మరో గంటన్నర రెండో సెషన్ తర్వాత భోజన విరామం ఉంటుంది. మొత్తం 20 తీర్మానాలకు సంబంధించి 65 మంది వక్తలు మాట్లాడనున్నారు. ఈసారి హైబ్రిడ్ విధానంలో నిర్వహించే మహానాడు గిన్నీస్ రికార్డు సృష్టించనుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు.*

# ప్రపంచ విపణికి ఎంఎస్ఎంఈ ఉత్పత్తులు



- దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి
- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు
- సైనింగ్-గ్రౌండింగ్-ఓపెనింగ్ విధానం అమలు
- ప్రతీ రంగంలోనూ వాటికి పెట్టుబడి అవకాశాలు
- జెన్-జీ కలల సాకారానికి కార్యాచరణ ప్రణాళిక
- ఏపీ నుంచి 100 యూనికార్న్ కంపెనీలు లక్ష్యం
- ఆధునిక టెక్నాలజీ ఎకోసిస్టమ్‌తో
- గ్లోబల్ స్థాయిలో యువతకు అవకాశాలు
- ఎంస్ఎంఈ గ్రోత్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 38 పారిశ్రామిక పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన
- రూ.200 కోట్లతో ఏపీ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్
- మెటా, అమెజాన్ సహా వివిధ సంస్థలతో ఒప్పందాలు
- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదిక ప్రారంభం

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటైన ఎంఎస్ఎంఈల ద్వారా తయారైన ఉత్పత్తులు ప్రపంచ విపణికి చేర్చేందుకు ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిగా ఎంఎస్ఎంఈ రంగం ఉంది. భారీ పరిశ్రమలు దేశానికి ప్రతిష్ఠ తీసుకువస్తే.. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు లక్షల మందికి జీవనోపాధిని కలిగిస్తాయని తెలిపారు. విజయవాడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026కు ముఖ్యమంత్రి హాజరయ్యారు. అంతకుముందు 4.4 ఎకరాల్లో 1.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన అంబేద్కర్ కళావేదికను ముఖ్యమంత్రి ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఒకేసారి 1500 మంది హాజరై కార్యక్రమాలు నిర్వహించుకునేలా కన్వెన్షన్ సెంటర్ నిర్మించటం సంతోషమన్నారు. అమరావతిలోనూ ఈ తరహా కన్వెన్షన్ సెంటర్లను నిర్మించనున్నట్టు వెల్లడించారు. అంత ర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రాష్ట్రంలో మరో ఐదు కన్వెన్షన్ సెంటర్లు నిర్మించనున్నట్టు తెలిపారు. ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ సందర్భంగా రాష్ట్రంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వం ఇస్తున్న వెసులు బాట్లను, చేయూతను ముఖ్యమంత్రి వివరించారు.

## కొత్త పరిశ్రమలకు శ్రీకారం చుట్టాలి

ఓ చిన్న ఆలోచనను పెద్ద పరిశ్రమగా మార్చే అవకాశం ఎంఎస్ఎంఈలకు మాత్రమే ఉంది. యువత కలలకు, మహిళ ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా ఉన్న ఈ రంగం వ్యవసాయం తర్వాత ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తోంది. ఏపీలో వనరులకు, అవకాశాలకు కొదవ లేదు. వీటిని వినియోగించుకునేలా ఎంఎస్ఎంఈలకు అవకాశాలు కల్పిస్తున్నాం. పోర్టులు,ఎయిర్ పోర్టులు, హైవేలు, రైల్వే లాంటి లాజిస్టిక్స్ కూడా ఏపీలో అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ, ఎంట్రప్రెన్యూర్ డెవలప్మెంట్ పాలసీ, ప్రైవేటు పారిశ్రామిక పార్కుల పాలసీలు తెచ్చి ఈ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఎంఎస్ఎంఈ సమ్మిట్ కొత్త ఆవిష్కరణలకు వేదికకావాలి. కొత్త పరిశ్రమలకు శ్రీకారం చుట్టాలి. పారిశ్రామిక యూనిట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గంలోనూ 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 100పార్కులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఇవాళ మరో 38 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేశాం. త్వరలో ఈ138 పారిశ్రామిక పార్కులు సిద్ధం అవుతాయి. మిగిలిన వాటిని జూలై నాటికి శంకు స్థాపనలు చేసి అన్ని మౌలికవసతులూ కల్పిస్తాం. ఈ పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు భూములిచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఏపీసీఎంఈపీకు రూ.300 కోట్లు

ఈ సమ్మిట్ ద్వారా స్టార్టప్ కంపెనీలు, పారిశ్రామి క సంస్థలు, నిపుణులు, బ్యాంకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, లబ్ధిదారులు ఒకే వేదికపైకి వచ్చారు. వన్ ఫ్యామిలీ – వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కింద పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు కావాలి. రాష్ట్రంలో 20.77 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉన్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.558కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చాం. పీఎంఈజీపీ, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్, పీఎం విశ్వకర్మ లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను సమన్వయం చేస్తూ ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తున్నాం. వీటితోపాటు ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టర్స్ ఎంటర్‌ప్రెన్యూర్ ప్రోగ్రామ్ కింద రూ.300 కోట్లను కేటాయిస్తున్నాం. రూ.200 కోట్లతో ఏపీ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నాం. ఏపీఐఐసీలో ఎంఎస్ఎంఈ యూనిట్లు స్థాపించే ఎస్సీ,ఎస్టీలకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నాం. 2024జూన్ నుంచి ఇప్పటివరకూ 2953 ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటు అయ్యాయి. వీటి ద్వారా రూ.4.68లక్షల కోట్ల పెట్టుబడులు సమకూరాయి. ప్రైవేటు పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసేందుకు ముందుకువచ్చిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తాం. ప్రైవేటు రంగంలో శ్రీసిటీ ఓ విజయవంతమైన పారిశ్రామిక పార్కు అని పేర్కొన్నారు.

## ఏపీ నుంచి 100 యూనికార్న్ కంపెనీలు లక్ష్యం

రాష్ట్రంలో మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. త్వరలో 5లక్షల మంది డ్వాక్రా మహిళలను ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దుతాం. మహిళా సంఘాల వద్ద ప్రస్తుతం రూ.28 వేల కోట్ల కార్పస్ ఉంది. ఏపీ నుంచి 100 యూనికార్న్ కంపెనీలు ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్ కంపెనీ లను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఏపీని ఇన్నోవేషన్ డ్రివెన్ ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నాం. విలేజ్ టు గ్లోబల్ మార్కెట్ అనేది ప్రభుత్వ నినాదం. గ్రామీణ ప్రాంతాలకు టెక్నాలజీ తీసుకు వెళ్లాలనే లక్ష్యంతో స్మార్ట్ విలేజ్ సెంటర్లను ప్రారంభిస్తున్నాం. ఓ పరిశ్రమ వ్యర్థాలు మరో పరిశ్రమకు ముడి సరుకుగా మారుతుంది. సర్క్యులర్ ఎకానమీపై ఎంఎస్ఎంఈలు దృష్టి పెట్టాలి. ఎంఎస్ ఎంఈలు ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలన్న లక్ష్యంతో మెటా, అమెజాన్, జోహో లాంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చు కున్నా మని ముఖ్యమంత్రి తెలిపారు.

## జెన్ జీ వర్గం యువత కలలు సాకారం చేస్తాం

మెటా, అమెజాన్ లాంటి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలు యువత భవిష్యత్తుకు ఉపాధికి, నైపుణ్యాలకు కొత్తదారులు సృష్టిస్తాయి. మారుతున్న టెక్నాలజీ... ఉద్యోగాల స్వరూపాన్ని మారుస్తోంది. అందుకే టెక్నాలజీ స్కిల్ బిజినెస్ ఇంటిగ్రేషన్ మోడల్‌ను అనుసరిస్తున్నాం. పరిశ్రమలకు అనువైన స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి పెట్టాం. ఆధునిక టెక్నాలజీ ఎకోసిస్టమ్ ద్వారా రాష్ట్ర యువతకు గ్లోబల్ స్థాయిలో అవకాశాలు అందుబా టులోకి వస్తాయి. ఏఐ, మెటలర్జీ, లాజిస్టిక్స్, క్లీన్ ఎనర్జీ ఏవియే షన్ లాంటి ఫంక్షనల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్నాం... పరిశ్రమలకు నైపుణ్యాలు అందించే కేంద్రాలుగా ఇవి మారబో తున్నాయి. జెన్- జీ, జెన్- ఆల్ఫా, టీనేజర్లకు మేలు కలిగేలా వారి భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టెక్నాలజీతో పాటు ఆధ్యాత్మికత కూడా కీలకమైన అంశం. యువశక్తి, టెక్నాలజీ, పరిశ్రమల భాగస్వా మ్యంతో స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధిస్తామని పేర్కొన్నారు.

## వివిధ సంస్థలతో ఏపీఎంఎస్ఎంఈడీసీ ఒప్పందాలు

విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లతో ఏపీ అభివృద్ధి చేస్తున్నాం. ప్రతీ రంగంలోనూ ఎంఎస్ఎంఈలు పెట్టుబడులు పెట్టేందుకు ఆస్కారం ఉంది. ప్రధాని మోదీ ఇచ్చిన చిప్ టు షిప్ అన్న నినాదాన్ని నిజం చేసేలా తయారీ రంగంపై దృష్టి పెట్టాం. సైనింగ్, గ్రౌండింగ్, ఓపెనింగ్ అన్నది ప్రభుత్వ విధానమని వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా సీఎం సమక్షంలో మెటా, అమెజాన్, జోహో సహా వివిధ సంస్థలతో ఏపీ ఎంఎస్ఎంఈడీసీ ఒప్పందం కుదుర్చుకుంది. డీప్ టెక్ స్టార్టప్ కంపెనీలకు రూ.20 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసేందుకు సిడ్బీ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఒప్పందం చేసుకుంది. ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నేతృత్వంలోని స్టార్టప్ కంపెనీలు తయారు చేసిన టెక్నాల జీ ఎనేబుల్డ్ హ్యాండ్ ఇతర ఐటీ, టెక్ ఉత్పత్తులు, డిఫెన్స్ ఉత్పత్తులు, బీహెచ్ఈఎల్ తయారు చేసిన ఎలక్ట్రికల్ ఉత్పత్తులు, ప్రైవేట్ సంస్థలు రూపొందించిన డ్రోన్ బోట్లు, వివిధ రకాల గిరిజన ఉత్పత్తులను సీఎం తిలకించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.



చైతన్యరథం

# సముద్ర తీరం అభివృద్ధికి విజన్ ప్లాన్





- తీర సంపద అందిపుచ్చుకునేలా కార్యాచరణ
- కోతకు గురి కాకుండా రక్షణ చర్యలు
- నిపుణులతో సీఎం చంద్రబాబు సమావేశం

అమరావతి(చైతన్యరథం):రాష్ట్రంలో సముద్ర తీరం అభివృద్ధికి సమగ్ర విజన్ ప్లాన్ తయారుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా కోస్తాంధ్ర తీరం మారేలా ఈ ప్రణాళికలు ఉండాలని సీఎం సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సముద్ర తీర అభివృద్ధికి సంబంధించి నిపుణులు, అధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఏపీలో ఉన్న వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతంలో అభివృద్ధి ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మత్స్యకారులకు కలిగే ప్రయోజనాలపై పూర్తి స్థాయి అధ్యయనం నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా బ్లూ ఎకానమీలో భాగంగా సము ద్ర ఆర్థిక వ్యవస్థ గురించే చర్చ జరుగుతోందని.. అపారమైన వనరులను వెలికి తీస్తే విస్తృత ప్రయోజనాలు దక్కే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఏపీలో ఆక్వా కల్చర్ అభివృద్ధి చేశామని.. రొయ్యలు, చేపల సాగు, ఎగుమతుల్లో ఏపీ నెంబర్‌వన్ స్థానం లో ఉందన్నారు. ఆక్వా కల్చర్‌లో వాల్యూ అడిషన్ జరగాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీంతోపాటు ఆక్వా వ్యర్థాలు కాలుష్య కారకంగా మారి పర్యావరణా నికి హాని కలిగిస్తున్నాయని తెలిపారు. ఈ సవాళ్లను పరిష్కరించేలా పూర్తిస్థాయి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే మెరైన్ బయో డైవర్సిటీని కాపాడేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సముద్రాలతో పాటు తీరప్రాంతాల్లో దొరికే రేర్ ఎర్త్ మినరల్స్ పై కూడా ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టి పెట్టామని.. ఆ వనరులను అందిపుచ్చుకోవాలన్నారు. తీరప్రాంత రక్షణ పైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. తుపాన్ల లాంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా సముద్ర తీరాల్లో మడ అడవులు, తాటి చెట్లు లాంటి మూడంచెల సహజ రక్షణ కవచం ఏర్పాటు చేసేలా చూడాలని స్పష్టం చేశారు. పర్యావరణ అనుకూల విధానాలతో పాటు పర్యాటకం, ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా సముద్ర తీరప్రాంతాలు తయారు కావాలని దిశానిర్దేశం చేశారు.అలాగే సీ వీడ్ అభివృద్ధి, మార్కెటింగ్ లాంటి అంశాలపై కూడా పరిశీలించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్ నాయక్, రైతు సాధికార సంస్థ వైస్ ఛైర్మన్ విజయ్‌కుమార్, మెరైన్ డైవర్సిటీ సంస్థ వోయసీ సంస్థ ప్రతినిధి ఫిలిప్ తదితరులు హాజరయ్యారు.

# పేదల సేవలో అగ్రభాగాన కూటమి ప్రభుత్వం

- పెన్షన్ల పంపిణీలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమం
- రెండేళ్లలో సుమారు రూ.65 వేల కోట్లు పైనే లబ్ధి
- ఐదేళ్లలో గత ప్రభుత్వం ఖర్చు పెట్టిన మొత్తంలో 71.5 శాతం రెండేళ్లలో అందజేసి రికార్డ్
- ప్రతినెలా పాల్గొంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు





అమరావతి(చైతన్యరథం): సామాజిక పింఛన్ అంటే కేవలం రూ.500, రూ.1000 చేతిలో పెట్టే తూతూమంత్రపు ప్రక్రియ కాదు.. అది ఒక నిరుపేద కుటుంబానికి కొండంత అండ, ఆత్మగౌరవ ప్రతీక అనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ విధానం. సమాజంలోని అట్టడు గు వర్గాలు, వృద్ధులు, చేరదీసే దిక్కులేని అభాగ్యులు గౌరవప్ర దమైన జీవనం సాగించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం సరికొత్త చరిత్రను లిఖిస్తోంది. రెండేళ్ల పాలనలో రికార్డు స్థాయిలో సుమారు రూ.65 వేల కోట్లకు పైగా నిధులను లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం పంపిణీ చేసింది. దేశంలోని మరే ఇతర రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో పెన్షన్ల పంపిణీ చేపట్టడం లేదు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో రూ.91 వేల కోట్ల నిధులను పెన్షన్ల రూపంలో ఖర్చు పెడితే.. అందులో 71.5 శాతం మేర నిధులను రెండేళ్ల కాలంలోనే కూటమి ప్రభుత్వం పంపిణీ చేపట్టింది. ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీన జీతాలు ఇస్తున్నట్టే..సామాజిక భద్రతా పెన్షన్లను అందుకుంటున్న ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులకు ఠంచనుగా పెన్షన్ డబ్బులను ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఉండే స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాలకు చెందిన సిబ్బంది ఉదయం 8-9 గంటల్లోనే సుమారు 75 నుంచి 80 శాతం మేర పెన్షన్ల పంపిణీ పూర్తి చేస్తున్నారు. ఏదైనా నెలలో ఒకటో తేదీ ఆదివారం.. సెలవు దినం వస్తే.. ముందు నెలలోని లాస్ట్ వర్కింగ్ డే రోజునే పెన్షన్ అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది కూటమి ప్రభుత్వం. ప్రభుత్వం ఆర్థికంగా ఎంతో ఇబ్బందులు ఉన్నా ఇప్పటివరకు ఒక్కరోజు కూడా జాప్యం చేయకుండా పెన్షన్ల పంపిణీని చేపట్టింది. అలాగే ముఖ్యమంత్రి ప్రతినెలా క్రమం తప్పకుండా పేదల సేవలో పేరు తో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

## పెన్షన్లల్లో ట్రెండ్ సెట్టర్

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థిక రక్షణ కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం వేస్తున్న అడుగులు నేడు లక్షలాది మంది జీవితాల్లో సరికొత్త కాంతులు నింపుతున్నాయి. తొలి నుంచి తెలుగుదేశమే పెన్షన్ల విషయంలో ట్రెండ్ సెట్ చేసింది. రాష్ట్రంలో సామాజిక పింఛన్ల పెంపునకు, తెలుగుదేశం పార్టీ భావజాలానికి విడదీయ రాని అనుబంధం ఉంది. ఎన్టీఆర్ హయాం నుంచి ఇప్పటివరకు లబ్ధిదారుల చేతికి అందే మొత్తాన్ని భారీగా పెంచుతూ వచ్చిన ఘనత ముమ్మాటికీ తెలుగుదేశం ప్రభుత్వం ఘనతే. గత ప్రభుత్వంలో రూ.1000 పెంచడానికి ఐదేళ్ల సమయం తీసుకుం టే..కూటమి ప్రభుత్వం వచ్చి రావడంతోనే ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. బాధ్యతలు స్వీకరించిన తక్షణమే వృద్ధులు, చేనేత, కల్లుగీత కార్మికులు, జానపద కళాకారులకు గతంలో ఉన్న రూ. 3 వేల పింఛన్‌ను రూ.4 వేలకు పెంచారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి నెలలోనే అంతకుముందు పెరిగిన మూడు నెలల బకాయిల ను కలుపుకుని ఏకంగా రూ.7 వేలను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే అందించి మానవతా దృక్పథాన్ని చాటుకుంది. ఇంతటి భారీ పెంపుదల దేశ సామాజిక సంక్షేమ చరిత్రలోనే అపూర్వమైన ఘట్టమనే చెప్పాలి.

## పేద కుటుంబాలకు పెద్ద దిక్కు

శాశ్వత వికలాంగులకు, మంచానికే పరిమితమైన వారికి రూ. 15 వేల పెన్షన్ కొండంత అండగా నిలుస్తోంది. శారీరక వైకల్యం తో బాధపడుతున్న దివ్యాంగుల పట్ల ప్రస్తుత కూటమి ప్రభుత్వం చూపిన శ్రద్ధ చూపెడుతోందనే ప్రశంసలు కూటమి ప్రభుత్వానికి అందుతున్నాయి. దివ్యాంగుల పింఛన్ మొత్తాన్ని గతంలో ఉన్న రూ.3 వేల నుంచి రెట్టింపు చేసి నెలకు రూ.6 వేలకు పెంచడం ద్వారా వారి కుటుంబాలకు ప్రభుత్వం పెద్ద దిక్కుగా నిలిచింది. అదేవిధంగా కిడ్నీ, లివర్, హార్ట్ మార్పిడి చేయించుకుని నిరంతరం ఖరీదైన మందులపై ఆధారపడే దీర్ఘకాలిక రోగుల పింఛన్‌ను సైతం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు రెట్టింపు చేసి ప్రభుత్వం వారి ప్రాణాలకు భరోసా కల్పించింది.

## పెండింగ్ లేకుండా స్పౌజ్ పెన్షన్లు

మరణించిన పెన్షనర్ జీవిత భాగస్వామికి రూ.4 వేల వితంతు పింఛన్‌ను కొత్తగా మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇప్పటివరకు 2,14,113 మందికి కొత్తగా లబ్ధి చేకూర్చింది. ఇందుకోసం నెలకు సుమారు రూ.85 కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. అలాగే, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరుసగా మూడు నెలలు వివిధ కారణాలతో పెన్షన్ తీసుకోకున్నా ఆ మొత్తాలను ఒకేసారి తీసుకునే వెసులుబాటు కలిగిస్తోంది ప్రభుత్వం. దీనిద్వారా నవంబరు 2024 నుంచి మే 2026 వరకు 20.23 లక్షల మంది రూ.1,712.92 కోట్ల బకాయిలను సులభంగా పొందగలిగారు. గత ప్రభుత్వ పాలనలో రకరకాల నిబంధనలు, రాజకీయ ఆంక్షల పేరుతో నిర్దాక్షిణ్యంగా పెన్షన్లల్లో ఎప్పటికప్పుడు కోతలు విధించేది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులైన 2.50 లక్షల మంది కి కొత్త పింఛన్లు మంజూరు చేసి లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం నింపారు. అంతేకాకుండా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పింఛన్ స్థితిగతులు, ఫిర్యాదుల పరిష్కారానికి అత్యాధునిక డిజిట ల్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి లబ్ధిదారుల మొబైల్‌కే నేరుగా సమాధానం పంపే పారదర్శక విధానాన్ని అమలు చేస్తున్నారు.

చైతన్యరథం




# అంబేద్కర్ కళావేదిక ప్రారంభం

విజయవాడ(చైతన్యరథం): ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ కళా వేదికను సోమవారం ప్రారంభించారు. అంబేద్కర్ చిత్రపటానికి సీఎం చంద్రబాబు నివాళులర్పించి కళావేదికను పరిశీలించారు.

అనంతరం వివిధ స్టార్టప్ సంస్థలు రూపొందించిన టెక్నాలజీ ఎనేబుల్డ్ హ్యాండ్, వీరపనేనిగూడెంలో తయారవుతున్న డిఫెన్స్ ఉత్పత్తులు, మచిలీ పట్నంలోని బీహెచ్ఈఎల్ తయారు చేసిన ఎలక్ట్రికల్ ఉత్పత్తు లను సీఎం తిలకించారు. డ్రోన్ బోట్స్‌తో పాటు గిరిజనులు సాగు చేస్తున్న కొండ చీపురు గడ్డి ఉత్పత్తులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.








# గ్రోత్ సమ్మిట్‌లో కీలక ఒప్పందాలు

- ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహమే లక్ష్యం
- మెటా, అమెజాన్, జోహో వంటి సంస్థలతో డీల్
- డీప్ టెక్‌కు రూ.20 కోట్ల సిడ్బీ సీడ్ ఫండ్
- ఆర్‌టీఐహెచ్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం

అమరావతి(చైతన్యరథం): ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026 లో ఏపీ సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేష న్ కీలకమైన ఒప్పందాలు కుదుర్చుకుంది. కొత్తగా 38 ఎంఎస్ ఎంఈ పార్కులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశా రు. అనంతరం రాష్ట్రంలో స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలను ప్రోత్స హించేందుకు వివిధ సంస్థలు ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందా లు కుదుర్చుకున్నాయి. ఆర్టీఐహెచ్ ఆధ్వర్యంలో నడిచే రూరల్ అవుట్ పోస్టులను కూడా సీఎం ఆవిష్కరించారు. మంగళగిరి, పిఠాపురం, కుప్పంలో రుటాగ్ ఈ స్మార్ట్ విలేజ్ సెంటర్లను పైలట్‌గా ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంక్యుబేషన్ కేం ద్రాలుగా ఈ ఆర్ఎస్వీ కేంద్రాలు పనిచేయనున్నాయి. ఆర్టీఐహెచ్ తో కలిసి కియా ఇండియా సంస్థ అడ్వాన్స్డ్ ప్రోటో టైపింగ్ ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. వివిధ స్టార్టప్‌లకు చేయూత ఇచ్చేలా హైఎండ్ ప్రెసిషన్ మాన్యుఫాక్చరింగ్ ప్రోటో టైపింగ్ ఫెసిలిటీని కియా ఏర్పాటు చేయనుంది. డీప్ టెక్ స్టార్టప్ లకు ఆర్థిక సహకారం అందించేలా ఆర్టీఐహెచ్‌తో కలిసి సిడ్బీ రూ.20 కోట్ల సీడ్ ఫండ్ ప్రోగ్రామ్‌ను కూడా ప్రారంభించనుంది. దీనికి సంబంధించి సిడ్బీ బ్యాంక్ ముందుకు వచ్చింది. రాష్ట్రంలో లక్ష మంది ఎంఎస్ఎంఈ డిజిటల్ మెచ్యూరిటీ అసెస్‌మెంట్‌లో భాగంగా వివిధ కళాశాలల్లో 50 డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఫెసిలి టేషన్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ఎంఎస్ఎంఈ డెవలప్ మెంట్ కార్పొరేషన్ – ఐటీ శాఖల మధ్య ఒప్పందం కుదిరింది. వీటితో పాటు వెయ్యి ఎంఎస్ఎంఈ ఎనర్జీ, వాటర్ ఆడిట్స్, ఎంఎస్ఎంఈ క్లస్టర్స్‌లో డయాగ్నోస్టిక్స్ నిర్వహించేందుకు ఎస్సెల్ సంస్థ ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలోని 750 ఎంఎస్ఎంఈలతో పాటు 3,125 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా రూ.200 కోట్ల వ్యయంతో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం చేపట్టాలని నిర్ణ యించారు. దివ్యాంగ యువతకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ట్రైనింగ్ ఇచ్చేలా కార్యాచరణ చేపట్టనున్నారు.

అంతర్జాతీయ మార్కెట్లకు ఎంస్ఎంఈ ఉత్పత్తులు

రాష్ట్రంలోని 10 ఎంఎస్ఎంఈ క్లస్టర్లలో ఆయా రంగాల్లో జరిగే వృద్ధిని అధ్యయనం చేసేందుకు ఇండియా ఎస్ఎంఈ ఫోరంతో ఎంఎస్ఎంఈ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఒప్పందం చేసుకుంది. లక్ష ఎంఎస్ఎంఈలకు టెక్నాలజీ అడాప్షన్‌తో పాటు డిజిటల్ రెడీనెస్‌పై శిక్షణ కోసం వోడాఫోన్ ఐడీయా బిజినెస్‌తో ఒప్పందం కుదిరింది. ఎంఎస్ఎంఈల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం జోహో సంస్థతోనూ ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ లు తయారుచేసిన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కె ట్లలో విక్రయాలకు, ఎగుమతులకు చేయూతనిచ్చేలా అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్‌తో ఒప్పందం కుదిరింది. లాజిస్టిక్స్ సపోర్టుతో పాటు క్రాస్ బోర్డర్ ట్రేడ్, ఎగు మతుల సామర్థ్యం పెంచేలా ఆరామెక్స్ సంస్థ ముం దుకు వచ్చింది. ఈ మేరకు ఎంఎస్ఎంఈ డెవలప్ మెంట్ కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. లక్ష మంది మైక్రో ఎంటర్‌ప్రైజెస్ సామర్థ్యాలను పెంచేలా మెటా సంస్థ చేయూత అందించేందుకు ఒప్పందం చేసుకుంది. తయారవుతున్న ఉత్పత్తుల నాణ్యత సర్టి ఫికేషన్, గ్లోబల్ ప్రమాణాలతో ఉత్పత్తి తదితర అంశాల్లో సహకారం అందించేందుకు క్యూసీఐ ముం దుకు వచ్చిం ది. ఎంఎస్ఎంఈ సంస్థల్లో నేషనల్ పెన్షన్ వ్యవస్థ అమలు, ఆర్థిక వ్యవహారాలు, సామా జిక భద్రత అంశాల్లో తోడ్పడేందుకు పీఎఫ్ ఆర్డీఏ ఒప్పందం చేసుకుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్, డీబీవీ స్వామి సహా ప్రజాప్రతి నిధులు, ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ సహా ఉన్నతాధికారులు హాజరయ్యారు.


















# సులభతరంగా ప్రభుత్వ సేవలు

- నిబంధనల పేరుతో జాప్యం సరికాదు
- బిజినెస్ రూల్స్ మార్పునకు కార్యాచరణ
- రోటీన్‌కు స్వస్తి..వినూత్నంగా ఆలోచించాలి
- కుల పత్రాల జారీలో ఇబ్బందులు తొలగించాలి
- పరిష్కారం కాని సమస్యలపై ఫోకస్ పెట్టండి
- సైబర్ మోసాలను అరికట్టేలా పటిష్ట వ్యవస్థ
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం



అమరావతి(చైతన్యరథం): టెక్నాలజీ పూర్తిస్థాయిలో అందు బాటులోకి వచ్చింది..ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా ఉండాలి కానీ.. నిబంధనలు అడ్డుకాకూడదని ముఖ్య మంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేవిధంగా అవసరమైన మేరకు బిజినెస్ రూల్స్ సవరించాలని..దానికి సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేయా లని ఆదేశించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఆర్టీజీఎస్ పనితీరు, వివిధ శాఖల కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అమలవు తున్న తీరుపై సమీక్షించారు. ప్రజల కోసం అధికారులు, ఉద్యో గులు, క్షేత్రస్థాయి సిబ్బంది పని చేయడం ఎంతముఖ్యమో... దానికి అనుగుణంగా ఫలితాలు చూపించడం కూడా అంతే ముఖ్యం. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు, ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నాం. ఆ సమాచారం ఆధారంగా అధికారులు, ఉద్యోగుల పనితీరును అంచనా వేయాలి. బాగా పనిచేస్తున్న అధికారులను అభినంది ద్దాం.. సరిగా పనిచేయని అధికారులకు ఓరియేంటేషన్ క్లాసులు తీసుకుందాం. రోటీన్ పద్ధతుల్లో పనిచేయడం కాకుండా వినూ త్నంగా ఆలోచించాలి. సేవలను సులభతరం చేయాలి. రోటీన్ పద్ధతుల్లో చేసే పనివిధానానికి కాలం చెల్లింది. ప్రతి నియోజక వర్గానికి ప్రణాళిక శాఖ నుంచి నోడల్ అధికారులను నియమించాం. వారి సేవలను పూర్తిగా వినియోగించుకోవాలి. ప్రజలకు సేవలను త్వరితగతిన చేరవేసేందుకు బిజినెస్ రూల్స్ మార్చాలని గతంలోనే అనుకున్నాం. దీనికి సంబంధించిన కార్యాచరణను సిద్ధం చేయాలని ఆదేశించారు.

కన్విన్స్ చేయాలి.. సమస్యలు పరిష్కరించాలి

రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారంపై మరింత శ్రద్ధ పెట్టాలి. ఏడాదిలోగా రెవెన్యూ సమస్యలను తీరుస్తామని హామీ ఇచ్చాం. నిర్దేశించుకున్న ఏడాది గడువులో ఇప్పటికే కొంతకాలం ముగిసింది. పరిష్కారం కాని సమస్యలపై ఫోకస్ పెట్టండి. ముఖ్యంగా కుటుంబ తగాదాలతో ఉత్పన్నమయ్యే రెవెన్యూ సమ స్యల పరిష్కారానికి సంబంధిత వ్యక్తులతో అధికారులు, ఉద్యోగు లు మాట్లాడాలి. వారిని కన్విన్స్ చేయాలి. గొడవలు పడితే నష్టమే తప్ప లాభం ఉండదని వివరించాలి. వీలైనంత మేరకు సమస్యను పరిష్కరించేందుకు మానవీయ కోణంలో ఆలోచించి పనిచేయాలి. ఇక కుల ధృవీకరణ పత్రాల జారీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి. ఆన్‌లైన్‌లోనే డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించేలా చూడాలి. అన్నిస్థాయిల్లోని ఆస్పత్రుల్లో సేవలందించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దు. ఆర్టీజీఎస్ విభాగానికి అన్ని శాఖల సమాచారం పూర్తిగా అందించాలి. దీన్ని సమన్వయం చేసుకునేలా ప్రతి శాఖ నుంచి ఓ అధికారిని డిజిగ్నేట్ చేయాలి. సైబర్ ఫ్రాడ్స్ అరికట్టేలా పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతా ధికారులు పాల్గొన్నారు.

### కష్టపడి చదివి ఉద్యోగాలు సాధిస్తే

## టీచర్లనే అవమానిస్తారా?

- అందరూ మీలా దొంగ అనుకోవడం నేరం
- లెంపలేసుకుని వారికి క్షమాపణలు చెప్పాలి
- ఐదేళ్ల మీ పాలనలో ఒక్క టీచర్ పోస్టు లేదు
- జాబ్ క్యాలెండర్ ఊసే అసలు లేదు
- మేం 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం
- త్వరలోనే మరో డీఎస్సీ ఇవ్వబోతున్నాం
- మరింత బిగ్గరగా ఏడవటానికి సిద్ధంగా ఉండండి
- జగన్‌రెడ్డికి మంత్రి నారా లోకేష్ స్ట్రాంగ్ కౌంటర్



అమరావతి(చైతన్యరథం): మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగా యంటూ దుష్ప్రచారం చేస్తున్న జగన్‌రెడ్డికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మీ బాధ, ఆక్రోశం నేను అర్థం చేసుకోగలను. మీ ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేదు.. జాబ్ క్యాలెండర్ ఊసేలేదు. మేం 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చాం. త్వరలోనే మరో డీఎస్సీ కూడా ఇవ్వబోతున్నాం. మరింత బిగ్గరగా ఏడవడానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

మీరు టెన్త్ పేపర్లు ఎత్తుకెళ్లిన దొంగ అని అందరూ అలాగే ఉంటారనుకోవ డం చాలా పెద్ద నేరం. అత్యంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీలో నిద్రాహారాలు మాని కష్టపడి చదివి ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన 16 వేల మందిని మీరు అనుమానిస్తున్నా రు..అవమానిస్తున్నారు. మెగా డీఎస్సీలో ఎంపికైన టీచర్లు అందరి కీ జగన్ లెంపలు వేసుకుని క్షమాపణలు చెప్పాలని కోరారు. మెగా డీఎస్సీ ఆపాలని 200 కేసులు, గూగుల్, టీసీఎస్ రాకుండా కోర్టులో కేసులు వేయించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా, యువతకు ఉద్యోగాలు లేకుండా వారి భవిష్యత్తు నాశనం చేయా లని చూస్తున్న మిమ్మల్ని రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ క్షమించరని హితవుపలికారు.

## పారదర్శకంగా మెగా డీఎస్సీ

- పేపర్ లీక్.. డేటా డిలీట్ అవాస్తవం
- కోర్టు ఆదేశాల ఉల్లంఘన పూర్తిగా అబద్ధం
- దుష్ప్రచారంపై పాఠశాల విద్యాశాఖ ఖండన




అమరావతి(చైతన్యరథం): ఇటీవల కొన్ని ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో మెగా డీఎస్సీ-2025 నిర్వహణ, ప్రశ్నాపత్రాల లీకేజీ, అభ్యర్థుల ఎంపికపై వస్తున్న కథనాలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమైనవి, దురుద్దేశపూర్వకమైనవని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఒక ప్రకటనలో ఖండించారు. నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆందోళన కలిగించేందుకు, ప్రజల్లో ప్రభుత్వ నియామ క వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీసేందుకు జరుగు తున్న ఈతప్పుడు ప్రచారాలను పాఠశాల విద్యాశాఖ తీవ్రంగా ఖండించారు. ఆ కథనాలకు సంబంధించిన వాస్తవాలను వివరించారు. మెగా డీఎస్సీ పరీక్షలను అత్యంత పారదర్శకమైన కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ పద్ధతిలో, అత్యున్నత స్థాయి డిజిటల్ భద్రతా ప్రమాణాలతో నిర్వ హించడం జరిగింది.మల్టీ-సెషన్ పద్ధతి లో వేర్వేరు ప్రశ్న పత్రాలతో నిర్వహిం చిన ఈ పరీక్షలలో ప్రశ్నాపత్రం లీకేజ్ అవ్వడం సాంకేతికంగా అసాధ్యం. దీని పై ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదులు కూడా అందలేదు. ఇక పి.నవీన్ అనర్హత అంశానికి సంబంధించి నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా పరీక్ష రాయడం మరియు సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు గైర్హాజరు కావడంతో రూల్ 20(vi) ప్రకారం ఆయన అభ్యర్థిత్వం రద్దు చేయబడిందని విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈ నిర్ణయంపై ఆయన కోర్టును ఆశ్రయించగా, హైకోర్టు ఉత్తర్వుల మేరకు గ్రీవెన్స్ రెడ్రెస్సల్ కమిటీ, రాష్ట్ర స్థాయి అప్పీల్ కమిటీలు నిబంధనల ప్రకారం విచారణ జరిపి కేసును పరిష్కరించామని ప్రభుత్వం వివరించింది. మెగా డీఎస్సీ-2025 నోటిఫికేషన్ విడుదలైన కేవలం 148 రోజుల్లోనే ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను రికార్డు స్థాయిలో పూర్తి చేశారు. పరీక్షలు ముగిసిన తర్వాత 22.08.2025న అభ్యర్థుల పూర్తి వివరాలు, మార్కులు మరియు ర్యాంకులతో కూడిన అధికారిక మెరిట్ జాబితాలను పారదర్శకంగా వెబ్‌సైట్‌లో విడుదల చేసిన తర్వాతే సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఎటువంటి డేటా డిలీట్ కాలేదని, డిజిటల్ రికార్డులన్నీ మల్టీ-లెవెల్ వెరిఫికేషన్ సిస్టమ్స్ ద్వారా భద్రంగా ఉన్నాయని విద్యాశాఖ వెల్లడించింది. రిజర్వేషన్లు, ఎంపికలు పూర్తిగా నిబంధనల ప్రకారమే జరిగాయని, ముఖ్యంగా మహిళలు, దివ్యాంగులు, ఇతర కోటాలకు 'హారిజాంటల్ రిజర్వేషన్' అమలు చేయడం వల్ల వారు రోస్టర్ పాయింట్ల ప్రకారం ఎంపికయ్యారని వివరణ ఇచ్చింది.

అభ్యర్థులు దరఖాస్తు సమయంలో స్వయంగా ఇచ్చిన 'పోస్ట్ ప్రిఫరెన్స్' ఆధారంగానే ఆటోమేటెడ్ కంప్యూటర్ వ్యవస్థ ద్వారా పోస్టుల కేటాయింపు జరిగిందని, ఇందులో ఎటువంటి నిబంధనల ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేసింది. కన్వీనర్ నియామకం కూడా ప్రభుత్వ ఉత్తర్వులకు, సేవా నిబంధనలకు అనుగుణంగానే అత్యంత పారదర్శకంగా, చట్టబద్ధంగా జరిగిందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పేర్కొన్నారు. ఇంత పకడ్బందీగా జరిగిన మెగా డీఎస్సీ-2025పై తప్పుడు కథనాలు ప్రచారం చేయడం సబబు కాదని ఒక ప్రకటనలో ఖండించింది.









# ఢిల్లీకి విద్యాశాఖ మంత్రి లోకేష్

***స్వాగతం పలికిన టీడీపీ ఎంపీలు***

***నేడు పుస్తకావిష్కరణకు హాజరు***

అమరావతి(చైతన్యరథం): విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం రాత్రి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. మంగళవారం ఉదయం 11 గంటలకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన "అప్నాపన్: మై ఎక్స్ పీరియెన్సెస్ విత్ నరేంద్ర మోదీ" పుస్తకావిష్కరణ కార్యక్రమంలో లోకేష్ పాల్గొననున్నారు. కాగా ఢిల్లీకి చేరుకున్న లోకేష్‌కు టీడీపీ ఎంపీలు బైరెడ్డి శబరి, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, సానా సతీష్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

## జనం నవ్వుతున్నా..

# మావిగన్‌ను వదలరా?

- **అమరావతిపై వైసీపీ అనుచిత వ్యాఖ్యలపై మంత్రి నారాయణ ఫైర్**
- **'అమరావతి' నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని వెల్లడి**

అమరావతి (చైతన్య రథం): జనం పగలబడి నవ్వుకుంటున్నా.... వైసీపీ 'మావిగన్'ను పట్టుకుని వేలాడుతోందంటూ మున్సిపల్ మంత్రి నారాయణ ఎద్దేవా చేశారు. అమరావతి నిర్మాణంపై అబద్ధాల ప్రచారం సాగిస్తోన్న వైసీపీ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సెక్రటేరియట్, పార్లమెంట్ నిర్మాణ లెక్కలను తప్పుగా చెబుతూ అమరావతి విషయంలో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాత్రివేళల్లో సైతం శరవేగంగా జరుగుతున్న అమరావతి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి నారాయణ.. ఆలిండియా సర్వీస్ అధికారుల నివాసాలు, ఐకానిక్ టవర్స్ నిర్మాణాలను సోమవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడతూ



"అమరావతిలో అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్స్, అధికారుల భవనాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఐఏఎస్ అధికారుల కోసం నిర్మిస్తున్న 6 టవర్స్‌లో చాలావరకు పనులు పూర్తయ్యాయి. జూన్‌నుంచి దశలవారీగా భవనాలను జీఏడీకి హ్యాండోవర్ చేస్తాం' అని తెలిపారు. "మొత్తం 30,760మంది రైతులు 35,059 ఎకరాలు భూములిచ్చారు. అందులో 30,079 మంది రైతులకు ఇప్పటికే ప్లాట్లు అలాట్ చేశారు. ఇంకా కేవలం 681మంది రైతులకు చెందిన 524 ఎకరాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం 63,342 కమర్షియల్, రెసిడెన్షియల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తయింది. 7,482 రిజిస్ట్రేషన్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదు. అమరావతి పనులు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఇలాగే మాట్లాడితే ఉన్న 11 సీట్లు కాస్తా సున్నా అవుతాయని జగన్ గ్రహించాలి. హైదరాబాద్ సెక్రటేరియట్, పార్లమెంట్ నిర్మాణ వ్యయాలపై పూర్తి డేటాతో మాట్లాడాలి. హైదరాబాద్‌లో సచివాలయం చదరపు అడుగుకు 13,768 ఖర్చు అయ్యింది. పార్లమెంట్ నిర్మాణానికి చదరపు అడుగుకు 16,916 ఖర్చు అయింది. అమరావతి ఐకానిక్ టవర్స్‌కు చదరపు అడుగుకు 15,000 నుంచి 16,000 ఖర్చవుతుంది. భవిష్యత్తులో అమరావతి ద్వారా ఏడాదికి 12,000 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. అమరావతిలో మిగిలే 5000 ఎకరాలతో లోన్లు తీరుస్తాము" అని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

## సబ్ స్టేషన్ నిర్మాణాల్లో జాప్యంపై

# మంత్రి గొట్టిపాటి ఆగ్రహం

- **విద్యుత్ అంతరాయాల సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియాల్సిందే**
- **1912 కాల్ సెంటర్లను పూర్తిస్థాయిలో యాక్టివేట్ చేయాలి**
- **విధి నిర్వహణలో ఉన్నతాధికారులు బాధ్యతగా వ్యవహరించాలి**
- **విద్యుత్ శాఖ ప్రజలకు జవాబుదారీగా ఉండేలా పని చేయాలి**
- **ఉన్నతాధికారుల సమీక్షలో మంత్రి గొట్టిపాటి**



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత సమర్ధ ంతంగా మార్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవా లని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహిం చారు. ఈ సమావేశానికి మూడు డిస్కంల సీఎండీలు, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు వర్చువల్ గా హాజరయ్యారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 132, 220, 400 కేవీ సబ్ స్టేషన్ల పనుల్లో జరు గుతున్న జాప్యాలపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలస్యాలకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయా లని స్పష్టం చేశారు. విద్యుత్ అంతరాయాలపై కూడా మంత్రి అధికారులను ప్రశ్నించారు. విని యోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించేం దుకు మూడు డిస్కంల పరిధిలోని 1912 కాల్ సెంటర్లను పూర్తి స్థాయిలో యాక్టివేట్ చేయాలని ఆదేశించారు. కాల్ సెంటర్లలో అవసరమైన లైన్లు, సిబ్బందిని ఏర్పాటు చేసి వినియోగదారులకు జవాబుదారీగా సేవలు అందించాలని సూచిం చారు. కాల్ సెంటర్ల పనితీరుపై సీఎండీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ అంతరాయాలు లేకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు. మరమ్మతులు లేదా ఇతర కారణా లతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగే పరిస్థితుల్లో ప్రజలకు ముందస్తుగా సమాచారం అందించా ల్సిన బాధ్యత అధికారులదేనని తెలి పారు. ముఖ్యంగా ఈదురుగాలులు, వర్షాల కారణంగా చెట్లు లేదా హోర్డింగులు విద్యుత్ లైన్ల పై పడిన సందర్భాల్లో పునరుద్ధరణకు పట్టే సమయాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచిం చారు. విధి నిర్వహణలో ఉన్నతాధికారు లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విద్యుత్ శాఖ ప్రజలకు మరింత జవాబుదారీగా ఉండేలా పని చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఆసుపత్రులు, ఇతర అత్యవసర సేవలందించే విభాగాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని మూడు డిస్కంల సీఎండీలకు ఆదేశించారు.

## లోకేష్ గురించి మాట్లాడేస్థాయి

# ఆదిమూలపు సురేష్‌కి లేదు

### మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



అమరావతి (చైతన్య రథం): మంత్రి నారా లోకేష్ గురించి మాట్లాడేస్థాయి వైసీపీ నేత ఆదిమూలపు సురేష్‌కి లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మంత్రి స్వామి "గత ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్ట్ భర్తీ చేయని వైసీపీకి డీఎస్సీ గురించి మాట్లాడే అర్హత ఉందా? అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల కుటుంబాల్లో మంత్రి లోకేష్ వెలుగులు నింపారు. వైసీపీ హయాంలో గ్రూప్-1 ఉద్యోగాల భర్తీలో అక్రమాలకు పాల్పడి యువత జీవితాలతో చెలగాటమాడింది జగన్ కాదా? గత ఐదేళ్లు జగన్ చేసిన అరాచకాలు, అక్రమాలకు నేడు అధికారులు జైళ్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఆదిమూలపు సురేష్‌ను జగన్, సొంత పార్టీ కార్యకర్తలే నమ్మడం లేదు. అందుకే జగన్ మెప్పు పొందేందుకు లోకేష్‌పై సురేష్ అసత్య ఆరోపణలు చేస్తున్నాడు. ఇది సరైన పద్ధతి కాదు" అని మంత్రి డోలా పేర్కొన్నారు.

చైతన్యరథం

# అభివృద్ధిపై అభాండాలా?

- తప్పుడు ప్రచారం చేస్తే తోలు తీస్తాం
- నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి
- రెండున్నరేళ్ల కూటమి అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- మీలా ఎవరినీ వేధించలేదు... రౌడీ షీట్లు తెరవలేదు
- నరుకుతామంటే ఎవరూ భయపడరు..
- వైసీపీ నాయకులకు మంత్రి సవిత హెచ్చరిక
- నెరవేరిన 50 ఏళ్ల ఉప్పరపల్ల వాసుల కల...
- రూ.3 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం



రొద్దం/ శ్రీసత్యసాయి (చైతన్య రథం): 'కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి చేశాం. గ్రామాలు, పంచాయతీలు, మండలాలు, నియోజక వర్గాలు, రాష్ట్రం వారీగా ఏ స్థాయిలో అభివృద్ధిపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నాం. అభివృద్ధికి సహకరిస్తే సహృదయంతో స్వీకరిస్తాం. నోరు అదుపులో పెట్టుకోకుండా అబద్ధాలు ప్రచారం చేస్తే తోలుస్తాం. ఖబడ్దార్' అని వైసీపీ నాయకులను రాష్ట్ర చేనేత జౌళిశాఖా మంత్రి సవిత హెచ్చరించారు. వైసీపీ నాయకులకు అభివృద్ధి చేతకాక ఐదేళ్లపాటు రాష్ట్రంలో అంధకారాన్ని నింపారన్నారు. కూటమి ప్రభుత్వం సాధిస్తోన్న అభివృద్ధికి ఓర్వలేకపోతున్నార న్నారు. రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం అభి వృద్ధితోపాటు సంక్షేమం అమలు చేస్తోందని, ప్రజలకు ఓటు అడిగే హక్కు తమకే ఉందని స్పష్టంచేశారు. కూటమి నాయకులు ఐక్యంగా పనిచేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని అందించి, పార్టీకి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. రూ. 1.47కోట్లతో రొద్దం మండలం పెద్ద మంతురు జిల్లా పరిషత్ హైస్కూల్‌నుంచి ఎల్ తిమ్మా పురం వరకు, చెరుకూరు నుంచి ఉప్పరపల్లి గ్రామా నికి మరో రూ. 1.6కోట్లతో వేసిన బీటీ రోడ్లను సోమ వారం ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన సభల్లో ఆమె మాట్లాడారు. గత సాధారణ ఎన్నికల్లో తాను పూర్తిస్థాయిలో ప్రచారంచేయకపోయినా ఉప్పర పల్లి వాసులు అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. పెద్దమంతురు, ఉప్పరపల్లి గ్రామాలకు రోడ్డు వేస్తానని ఆనాడే మాటిచ్చానని, ఇచ్చిన మాటలకు కట్టుబడి రోడ్లు నిర్మించిన తరవాత గ్రామాలకు వచ్చానన్నారు. ఇవేకాక త్వరలో మరో మూడు రోడ్లు నిర్మించనున్నా మన్నారు. రూ. 13కోట్లతో కోగిరి ఎత్తిలపోతల పథకం ప్రాజెక్టుకు భూమి పూజ చేయనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో రూ. 6.30కోట్లతో తాగునీటి కల్పన కు ఓవర్ హెడ్‌ట్యాంకులు నిర్మించబోతున్నామన్నారు. ఈ రెండు గ్రామాల్లోనూ 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, తరవాత వచ్చిన జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి సవిత మండిపడ్డారు.

### పంచాయతీల్లో గెలుపే నాకు రిటర్న్ గిఫ్ట్ ..

అభివృద్ధిని, సంక్షేమాన్ని సమపాళ్లలో సీఎం చంద్ర బాబునాయుడు పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు. సూపర్ సిక్స్ పథకాలతో మహి ళలకు ఉచిత గ్యాస్‌సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, తల్లికి వందనం సహా ఎన్నో పథకాలు అమ లు చేస్తున్నామన్నారు. రహదారులు, ఆసుపత్రుల నిర్మాణం, ఓవర్ హెడ్ ట్యాంకుల ఏర్పాటు చేపడుతు న్నామన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, సీఎం చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారన్నా రు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు కేవలం కూటమి ప్రభుత్వానికి మాత్రమే ఉంద న్నారు. కూటమి నాయకులు ఐక్యం పనిచేసి, స్థానిక సంస్థల్లో పసుపు జెండా ఎగురవేసి, తనకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు.

### నోరుజారితే తోలు తీస్తా...

అయిదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పనులకు నోచుకోలేదని మంత్రి సవిత మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో గతంలో ఎన్న డూ జరగలేనంత అభివృద్ధి జరిగిందని వివరించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ సహా ఎన్నో పథకాలను అర్హులకు అంద జేస్తున్నామన్నారు. త్వరలో కొత్త పెన్షన్లతోపాటు ఇళ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రం లో జరుగుతున్న అభివృద్ధిచూసి వైసీపీ వలస పక్షులు, ఆపార్టీ నేతలుసహించలేకపోతున్నారని విమర్శించారు. వారు అభివృద్ధిపై సూచనలు చేస్తే సహృదయంతో స్వీకరిస్తామని, తప్పుడు ప్రచారాలు చేస్తే మాత్రం ఊరుకునేది లేదని, తోలుస్తాం... ఖబడ్దార్ అని మంత్రి సవిత హెచ్చరించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఏ స్థాయిలోనైనా అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే రావాలని మంత్రి సవిత సవాల్ విసిరారు.

### మీలా రౌడీ షీట్లు తెరవలేదు...

జగన్ అయిదేళ్ల పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యానికి గురైందని మంత్రి సవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు ప్రభుత్వ వైఫల్యాన్ని నిలదీస్తే, తమపై తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు పాల్పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత వైసీపీలా ఏనాడూ రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు పెట్టడం, రౌడీ షీట్లు ఒపెన్ చేయడం వంటి దిగజారుడు చర్యలకు పాల్పడలేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమంటూ ఆ పార్టీ నాయకులు చేస్తున్న ధర్నాలను, ఆందోళన కార్యక్రమాలను అడ్డుకోలేదన్నారు. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సవిత స్పష్టంచేశారు.

### నరుకుతామంటే ఎవ్వరూ భయపడరు...

రప్పా...రప్పా...అని నరుకుతామంటే గొడ్డలి పార్టీ నాయకులు బెదిరింపులకు ఎవరూ భయపడరని మంత్రి సవిత స్పష్టంచేశారు. రప్పా రప్పా నరికితే తప్పేంటని జగన్ అనలేదా... ప్లెక్సీలు పెట్టించి గొడ్డళ్లతో బెదిరింపులకు పాల్పడలేదా..? అని ప్రశ్నించారు. ఓటు అనే ఆయుధం కలిగిన ప్రజలు ఎవరికీ భయపడరన్నారు. వారు బాగు కోసం పనిచేసేవారికే ఓట్లేసి గెలిపిస్తారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రజలకే తాము తలొగ్గుతామని, మరెవ్వరికీ భయపడే ప్రసక్తే లేదని మంత్రి సవిత తేల్చి చెప్పారు.

### నెరవేరిన 50 ఏళ్ల కల...

రొద్దం మండలం ఉప్పరపల్లి గ్రామానికి 50 ఏళ్ల నుంచి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆ గ్రామ స్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు. గత సాధారణ ఎన్నికల ముందు ఎన్నికల ప్రచారానికి మంత్రి సవిత దృష్టికి ఉప్పరపల్లి గ్రామస్తులు తమ అవస్థలను వివరించారు. రహదారి సౌకర్యం లేకపోవ డం వల్ల తమ బిడ్డలు విద్యకు దూరమవుతున్నారని, పండిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించు కోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. చివరికి తమ ఊరి బిడ్డలకు పిల్లనివ్వడానికి ముందుకు రావ డానికి సందేహిస్తున్నారని వాపోయారు. ఉప్పరపల్లి వాసుల కష్టాలు విన్న మంత్రి సవిత... రోడ్డు నిర్మిం చిన తరవాతే గ్రామానికి వస్తానని ఆనాడు మాటిచ్చా రు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, బీటీ రోడ్డు నిర్మిం చడంపై ఆ గ్రామస్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. మాట నిలబెట్టుకున్న మంత్రి సవితకు ఘనస్వాగతం పలికి తమఆనందాన్ని తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే

# ఆరోగ్యవంతమైన సమాజం

- మచిలీపట్నంలో రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదు
- పరిశుభ్ర బందరు సాకారంలో ప్రజాభాగస్వామ్యం అవసరం
- కార్పొరేషన్ పరిధిలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ నిర్వహించిన మంత్రి కొల్లు



మచిలీపట్నం (చైతన్య రథం): మచిలీపట్నం నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా మార్చేందుకు చేస్తున్న ప్రయత్నంలో ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ఈమేరకు మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణతో కలిసి ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మే 23 నుండి జూన్ 20 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రతి పౌరుడూ బాధ్యతతో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం కోనేరు సెంటర్లో రోడ్లపై పేరుకున్న చెత్తను చీపుర్లతో ఊడ్చారు. డివైడర్ మధ్యలో పేరుకున్న చెత్తను తొలగించారు.

ఈ సందర్భంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. "రాష్ట్రవ్యాప్తంగా 123 మున్సిపాలిటీలు, మన్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని చేపట్టి చెత్త, మురుగు మొత్తం శుభ్రం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సూచించారు. ఆమేరకు చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా పరిశుభ్రమైన వాతావరణాన్ని సాకారం చేసుకునే అవకాశం ఉంటుంది. స్వచ్ఛ మున్సిపాలిటీలను సాధించుకునేందుకు సచివాలయాలవారీగా అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలి. నాయకులు ముందుండి బాధ్యత తీసుకోవాలి. సచివాలయాలవారీగా కమిటీలు ఏర్పాటు చేసి స్వచ్ఛతను పాటించాలి. ట్రీ గార్డులు ఏర్పాటు చేసి చెట్లను పరిరక్షించుకుందాం. శ్మశానాలు, పార్కుల్లో కూడా చెత్త లేకుండా అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలి. అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇచ్చే నిధులకు ప్రజలు, కార్పొరేట్ వ్యవస్థల భాగస్వామ్యం అత్యంత అవసరం. మచిలీపట్నం మెయిన్ రోడ్డులో గల శ్మశాన వాటికలో ఫీనిక్స్ సంస్థ రూ.కోటి వ్యయంతో అభివృద్ధి పనులు చేస్తున్నారు. నెలపాటు జరిగే కార్యక్రమాలతో వర్షాకాలంలో ఎలాంటి వ్యాధులు రాకుండా చూసుకోవడానికి అవకాశం ఉంటుంది" అన్నారు.

"మచిలీపట్నం కోనేరు సెంటర్లో ఒక స్వచ్ఛంద సంస్థ రూ. 10 లక్షల వ్యయంతో మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ, తర్వాత నిర్వహణ లేకపోవడంతో మరుగున పడ్డాయి. త్వరలోనే వాటిని తెరిపిస్తాం. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ప్లాస్టిక్ నిర్మూలన కోసం ప్రజల సహకారం అత్యంత అవసరం. రోడ్లపై పశువులు తిరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపై తిరిగే పశువుల్ని ఇతర ప్రాంతాలకు తరలించి, రోడ్లపై ప్రమాదాలు జరగకుండా అడ్డుకుంటుంటే ఉద్దేశ్యపూర్వకంగా కసులు వేస్తున్నారు. అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాలను ఫణంగా పెట్టాలనుకుంటున్నారు. గేదెలు రోడ్లపై ఉంటే తప్పకుండా వాటిని సురక్షిత ప్రాంతానికి తరలిస్తాం. మచిలీపట్నం మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. సరఫరా చేసే చోట చిన్న చిన్న ఇబ్బందులున్నాయి. 2014-19 మధ్య కాలంలో 8 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించాం. తర్వాత వాటిని నిర్వహణ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శివారు ప్రాంతాల్లో ఎదురవుతున్న తాగునీటి ఇబ్బందులు కూడా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. 24 గంటల పాటు నీటి సరఫరా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని" మంత్రి కొల్లు స్పష్టం చేశారు.

"మచిలీపట్నం తీర ప్రాంతంలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవిశంకర్ హామీ ఇచ్చారు. అదే సమయంలో అక్కడి స్కిల్ డెవలప్మెంట్ పరిశీలించాను. అదే స్థాయి కేంద్రాన్ని బందరులో ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నాం. విద్యా వ్యవస్థలో మార్పులకు కొంతమంది ప్రైవేటు సంస్థలు ముందుకొస్తున్నారు. 20 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు కూడా ఏర్పాటు చేస్తున్నాం. బందరు పోర్టు పూర్తైతే అనేక సంస్థలు వస్తాయి. ఇక్కడి యువతకు ఇక్కడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డి.కె.బాలాజీ, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బాబాప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ తదితర నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో సాగునీటి రంగానికి పూర్వ వైభవం

- సాగునీటి కాలువల పర్యవేక్షణ బాధ్యత రైతులు తీసుకోవాలి
- గత ఐదేళ్లు సాగునీటి రంగాన్ని, వ్యవసాయాన్ని గాలికి వదిలేశారు
- సాగునీటి రంగం కాపాడుకుంటే రైతాంగం బలోపేతమైనట్లే
- పంటకాల్వ పూడికతీత ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్య రథం): వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడం ద్వారా మాత్రమే మానవ మనుగడను కాపాడుకోగలుగుతామని ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం నియోజకవర్గం చిట్టిపాలెంలో కాలువ పూడికతీత పనులను ప్రారంభించారు. కలెక్టర్ డి.కె.బాలాజీ, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణతో కలిసి పనులకు భూమిపూజ చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. రైతాంగానికి అవసరమైన సాగునీటి వ్యవస్థలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మంత్రివర్గ ఆమోదంతో ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ కింద కాలువల మరమ్మతులు, నిర్వహణ పనుల కోసం భారీగా నిధులు మంజూరు చేశారు. సాగునీటి కాలువల మరమ్మతులకు రూ.1.75 కోట్లు, డ్రైనేజీల మరమ్మతులకు రూ.1.75 కోట్లు, అరిసేపల్లి కాలువ పనులకు రూ.6 లక్షలు కేటాయించారు. బందరు సెక్షన్ పరిధిలో 17 పనులకు రూ.99.36 లక్షలు, 9వ ఛానల్ పరిధిలో 11 పనులకు రూ.75 లక్షలు, మురుగునీటి కాలువల 32 పనులకు రూ.1.75 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు.

అదేవిధంగా బందరు పరిధిలో మొత్తం రూ.25 కోట్లలో భాగంగా ఇరిగేషన్ పనుల కోసం రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. జొన్నలవారి మోడి సైఫన్‌కు రూ.1 కోటి, సాధారణ మరమ్మతులకు రూ.1 కోటి 50 లక్షలు, సముద్రపు నీరు రాకుండా డ్రైనేజ్ అవుట్ ఫాల్ స్లూయిస్ పనులకు రూ.1 కోటి, లంకపల్లి డ్రైన్ తవ్వకానికి రూ.20 లక్షలు, స్ట్రక్చర్ల మరమ్మతులకు రూ.1 కోటి 30 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో తాళ్లపాలెం డ్రైన్, శివగంగ డ్రైన్, పోతిరెడ్డిపల్లె తదితర ప్రాంతాల్లో అవసరాలను గుర్తించి అంచనాలు సిద్ధం చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఎండాకాలంలోనే కాలువల పనులను పూర్తి చేసి, సాగునీరు విడుదల చేసే సమయానికి పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంచేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందన్నారు. గత ఐదు సంవత్సరాలు రాష్ట్రంలో సాగునీటి సంఘాలే లేవు. సాగునీటి ప్రాజెక్టు పనులు చేపట్టలేదు. కానీ బిల్లులు చేసుకుని జేబులు నింపుకున్నారు. కానీ నేడు వర్షాలు రావడానికి ముందే సాగునీటి కాలువలు శుభ్రం చేసే పనులు చేపట్టాం. ప్రభుత్వం చేపట్టే పనుల్ని క్షేత్రస్థాయిలో రైతులు, ప్రజలు పర్యవేక్షించాలి. ఎక్కడైనా ఏదైనా ఇబ్బంది కలిగినా, పనులు సరిగా జరగడం లేదని అనిపించినా రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి మెరుగ్గా చేయించుకోవాలి అని సూచించారు.

గత ప్రభుత్వ హయాంలో ధాన్యం డబ్బుల కోసం రైతులు నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో పంట కోత అనంతరం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో ధాన్యం చెల్లింపులు జమ అవుతున్నాయన్నారు. పనుల నాణ్యత పర్యవేక్షణ కోసం రైతులు నీటి సంఘాలను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ పనుల్లో భాగస్వాములు కావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. యూరియా అధిక వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, దాని వాడకాన్ని తగ్గించాలని సూచించారు. రైతులకు అవసరమైన యూరియా, విత్తనాలు వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల ద్వారా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. వైసీపీ నేతలు అధికారంలో ఉన్నపుడు రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకున్నారు. రాజధాని అమరావతిపై విషం చిమ్మి మూడు రాజధానులంటూ డ్రామాలాడారు. ఇప్పుడు మావిగన్ అంటూ విచిత్ర ప్రతిపాదనలు తెచ్చి అబాసుపాలయ్యారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో.. అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చాం. రాయలసీమకు గతంలో కియా తీసుకొచ్చాం. ఇప్పుడు ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్ తీసుకొస్తున్నాం. డ్రోన్ ట్రైనింగ్ సెంటర్, డిఫెన్స్ యుద్ధ విమానాల తయారీ యూనిట్, రాయల్ ఎన్ ఫీల్డ్ వాహనాల తయారీ లాంటి అనేక కంపెనీలొచ్చాయి. ఉత్తరాంధ్రలో అర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, భోగాపురం విమానాశ్రయం, షిప్ యార్డు, గూగుల్ లాంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు వస్తున్నాయి. మచిలీపట్నం పోర్టును త్వరలోనే పూర్తి చేయబోతున్నాం. ఈ ప్రాంతంలో అనేక సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయి. రేపల్లె-మచిలీపట్నం రైల్వే ప్రాజెక్టు పూర్తి చేయబోతున్నాం. తద్వారా పోర్టు కనెక్టివిటీ పెంచాలని ప్రతిపాదించాం. తెలంగాణ ప్రభుత్వం కూడా బందరు పోర్టును అనుసంధానిస్తూ 12 వరుసల రోడ్డు కావాలని అడుగుతున్నారు. విజయవాడ-మచిలీపట్నం రోడ్డు కూడా మనమే పూర్తి చేశాం. దాన్ని విస్తరించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. 216 రోడ్డును కూడా నాలుగు వరుసలుగా అభివృద్ధి చేస్తున్నాం. అమరావతి పనులు పూర్తవుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేశామని వివరించారు.

అనంతరం జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను సబ్సిడీతో రైతులకు అందించారు. దిగుబడులు పెంచడానికి యూరియా లాంటి కెమికల్స్ వినియోగం తగ్గించాలని సూచించారు. గతంలో పంజాబ్‌లో పంట దిగుబడుల కోసం రసాయనాల వినియోగం పెంచారు. ఇప్పుడు ప్రతి రోజు ఒక రైలు కేన్సర్ బాధితుల కోసం ఢిల్లీకి వెళ్తోంది. అలాంటి పరిస్థితులు ఎక్కడా రాకుండా చూసుకోవల్సిన బాధ్యత రైతులపైనే ఉంది. దిగుబడుల కోసం ఏం వాడాలి, ఎంత మోతాదులో వాడాలో వ్యవసాయ అధికారుల్ని అడిగి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ బండి రామకృష్ణ, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, ఇరిగేషన్ శాఖ అధికారులు, కూటమి నాయకులు లంకె శేషగిరిరావు, మధు, కాగిత గోపాలరావు తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

---

# రూ.6వేల కోట్లతో సబ్ స్టేషన్లు

- ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకే ప్రణాళిక
- ఛార్జీలు పెంచకుండా సేవలు అందించాలని సర్కారు కృషి
- గత రెండేళ్లలో ఒక్కరూపాయి విద్యుత్ చార్జీలు పెంచలేదు
- సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశాం
- విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి



ఆచంట (చైతన్య రథం): రూ.6 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా సబ్ స్టేషన్ల నిర్మాణాలను చేపట్టామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడిం చారు. విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి,ప్రతిగ్రామం నుంచి పట్టణం వరకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించే లక్ష్యంతో ఈపనులు కొన సాగుతున్నాయని తెలిపారు.సోమవారం నాడు పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గ పరిధిలోని పెనుమంట్ర, పెనుగొండ మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి, పశ్చిమ గోదావరిజిల్లా ఇంచార్జిమంత్రి గొట్టిపాటి రవికుమార్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కలిసి ప్రారంభించారు. ముందుగా పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని, రూ.20.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ - విలేజ్ హెల్త్ క్లినిక్‌ను మంత్రులు ప్రారం భించారు.అనంతరం గడువు గ్రామంలో రూ.30 లక్ష లతో నిర్మించిన సీసీ రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థలను ప్రారం భించారు. నౌడూరు సెంటర్ నుంచి బ్రహ్మణ చెరువు వరకు రూ.2.50 కోట్లతో నిర్మించిన రహదారిని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. నెగ్గిపూడి గ్రామంలోని ఎస్సీ/ఎస్టీ కాలనీలో ఏర్పాటుచేసిన సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను కూడా ప్రారంభించా రు.తదనంతరం పెనుగొండ మండలంలోని 132/33 కెవి సబ్‌స్టేషన్‌లో నూతన 50 ఎంవిఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభించారు. అదేవిధంగా వడలి నుంచి జాతీయ రహదారి-16 వరకు రూ.50లక్షల వ్యయం తో నిర్మించిన డబ్ల్యూబీఎం రహదారిని కూడా ప్రారం భించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. విద్యుత్ ఛార్జీలు పెంచకుండా సేవలు అందించాలనే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి వెల్లడించారు. గత రెండు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచకుండా ప్రజలపై అదనపు భారం పడకుండా చూసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. వినియోగదారులు ఎదు ర్కొనే సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు అధి కారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదు లపై అధికారులు త్వరితగతిన స్పందించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలను మరింత సమర్ధవంతంగా అందించేందుకు విద్యుత్‌శాఖ అప్ర మత్తంగా పనిచేస్తోందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా విద్యుత్ అవసరాలు గణనీయంగా పెరిగాయని, ఇందుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతు న్నాయని తెలిపారు. గృహ,వాణిజ్య అవసరాల దృష్ట్యా పశ్చిమగోదావరి జిల్లాలో మరిన్ని సబ్ స్టేషన్లు అవసర మని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని విమర్శించారు.

ఆచంట ఎమ్మెల్యే, ఏపీ అసెంబ్లీ ప్రివిలేజెస్ కమిటీ ఛైర్మన్ పితాని సత్యనారాయణ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీవర్గాల గృహాలకు ఉచిత సోలార్ విద్యుత్ ప్యానెళ్లు ఏర్పాటు చేయనున్న ట్లు తెలిపారు. బీసీ వర్గాలకు సబ్సిడీతోపాటు అదనం గా రూ.20వేల ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. మిగతా వర్గాలకు సబ్సిడీతో సోలార్ విద్యుత్ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్ వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. నియోజకవర్గంలో అవసర మైన కండెన్సర్ల మంజూరుకు ఇప్పటికే ఇంధన శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

# వైకాపాను శాశ్వతంగా పాతాళానికి పంపుతాం

- రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- గత వైకాపా పాలనలో కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తల వేధింపు
- రాష్ట్రంలో 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి
- యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ ధ్యేయం
- చంద్రబాబు రాష్ట్రానికి, దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తున్నారు
- చీపుర్లపాడులో రూ.10.51 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన



కోటబొమ్మాళి (చైతన్య రథం): గత వైకాపా పాలనలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే వారిని కమీషన్ల పేరుతో వేధించి భయభ్రాంతులకు గురిచేశారని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "నాకెంత.. నీకెంత" అంటూ పారిశ్రామికవేత్తలను భయపెట్టడంవల్లే వారు ఈ రాష్ట్రానికి దండం పెట్టి వెనుదిరిగారని మండిపడ్డారు. టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు గ్రామ పరిధిలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం రూ.10.51 కోట్ల వ్యయంతో 12.22 ఎకరాల విస్తీర్ణంలో 74 ప్లాట్లతో నూతనంగా అభివృద్ధి చేయనున్న ఎంఎస్ఎంఈ (ఎంఎస్ఎంఈ) పార్కుకు ఆయన శంకుస్థాపన చేశారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఎంఎస్ఎంఈ పార్కులు విప్లవాత్మక సోపానాలుగా నిలుస్తాయని మంత్రి కింజరాపు ఉద్ఘాటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా 38 పార్కులకు వర్చువల్ విధానంలో శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు గత ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

### ప్రజాస్వామ్యంలో 'గొడ్డలి పార్టీ'కి స్థానం లేదు

ప్రజాస్వామ్యంలో 'గొడ్డలి పార్టీ'కి ఎలాంటి స్థానం లేదని, అధికారం కోసం సొంత బాబాయినే అడ్డంగా నరికేసే వారిని ప్రజలు పాతాళానికి పంపారని అన్నారు. 2019-2024 మధ్య కాలంలో గ్రామాల్లో కనీసం గుప్పెడు మట్టి కూడా పోయకుండా అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు.

### యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

ప్రతి ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రధాన లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో 'సీబీఎన్' అంటేనే ఒక బ్రాండ్ అని, ఆయన నాయకత్వంపట్ల పెట్టుబడిదారుల్లో అపారమైన నమ్మకం ఉందన్నారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో పారిశ్రామికవేత్తలను విశేషంగా ఆకర్షిస్తున్నామని, గూగుల్, రిలయన్స్, మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రం వైపు చూస్తున్నాయని వివరించారు. ఎన్నికల హామీ మేరకు యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం

శ్రీకాకుళం జిల్లాలో వలసలను అరికట్టి, యువతకు, మహిళా సంఘాలకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే ఈ ఎంఎస్ఎంఈ పార్కుల ముఖ్య ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. స్థానిక ఉత్పత్తుల విక్రయాలకు ఇవి అద్భుత వేదికలుగా మారనున్నాయన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రజలు, యువత పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. అలాగే నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం రూ. 620 కోట్లు మంజూరు చేసిందని, 2029 నాటికి ఆ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజల దాహార్తి తీరుస్తామని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

### జిల్లా ప్రగతికి పరిశ్రమలే ప్రాణం.. అడ్డుకునే వారిని సహించం

"మన జిల్లా అభివృద్ధి పథంలో పరుగులు పెట్టాలంటే పారిశ్రామికీకరణే మన ముందున్న ఏకైక మార్గం. పరిశ్రమలు వస్తేనే మన జిల్లా రూపురేఖలు మారతాయి. రైతన్నలు పెద్ద మనసు చేసుకుని పరిశ్రమల స్థాపనకు తమ భూములను అందిస్తే.. మన జిల్లాలోకి భారీ పెట్టుబడులు వస్తాయి. తద్వారా మన యువతకు, మన బిడ్డలకు ఇక్కడే లక్షలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఉపాధి కోసం మన యువత పొట్టచేతపట్టుకుని వేరే ప్రాంతాలకు వలసపోయే దుస్థితి తప్పుతుంది. కానీ... నేడు మన జిల్లాలో జరుగుతున్న పరిస్థితులు చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది. ఒక పక్క జిల్లాను అభివృద్ధి చేయాలని మనం అహర్నిశలు శ్రమిస్తుంటే.. అభివృద్ధిని ఓర్వలేని కొందరు స్వార్థపరులు, పరిశ్రమలు వస్తుంటే అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారు. జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి సహకరించాలి" అని అచ్చెన్నాయుడు మనస్ఫూర్తిగా కోరారు.

### 60 ఏళ్ల నిరీక్షణకు తెర... 2029నాటికి నేరడి బ్యారేజీ పూర్తి

జిల్లా ప్రజల 60 ఏళ్ల సుదీర్ఘ కలకు త్వరలోనే మోక్షం కలగనుందని, నేరడి బ్యారేజీ నిర్మాణంతో జిల్లా సస్యశ్యామలం కాబోతోందని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టుదల, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారం వల్లే ఇది సాధ్యమైందన్నారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న బృహత్తర ప్రాజెక్టును పూర్తి చేసే సువర్ణ అవకాశం... రాష్ట్ర మంత్రిగా తనకు, జిల్లా ఎమ్మెల్యేలకు, అధికారులకు దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 2029నాటికి నేరడి బ్యారేజీ నిర్మాణాన్ని వందశాతం పూర్తి చేసి జాతికి అంకితం చేయాలన్న దృఢ నిశ్చయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారన్నారు. ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలోని ప్రతి బీడు భూమికీ సాగునీరు అందుతుందని, రైతన్నలు ఏడాదికి మూడు పంటలు పండించుకుంటూ సిరులు పండించే సువర్ణ అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతున్నామని మంత్రి ఉద్ఘాటించారు.

### ఉక్కు భూములను ఆక్రమించాలని చూసిన జగన్

అధికారం కోసం జగన్‌రెడ్డి ఎవరినీ వదలరని మంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "స్వార్థం కోసం ఎవరినైనా సరే బలిచేసే నైజం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిది. ఇలాంటి విచ్ఛిన్నకర పార్టీకి మన రాష్ట్రంలో మనుగడ సాగించే అర్హత లేదు. రాబోయే రోజుల్లో ఆ పార్టీని శాశ్వతంగా పాతాళానికి తొక్కేయడం ఖాయం" అన్నారు. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అన్న నినాదంతో, ఎంతోమంది అమరుల ప్రాణత్యాగాల పునాదులమీద వెలసిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూసింది. ఉక్కు పరిశ్రమను కాపాడటం చేతకాకపోగా, దాన్ని ప్రైవేటీకరించి ఆ విలువైన భూములను సైతం ఆక్రమించుకోవాలని జగన్ అండ్ కో కుట్రలు పన్నారు. కానీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిస్థితులు మారాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖ ఉక్కు పరిరక్షణకు నడుంబిగించారు. కేంద్రంతో అలుపెరగని కృషి చేసి, ఉక్కు పరిశ్రమకు ఏకంగా రూ.15 వేల కోట్లు మంజూరు చేయించారు. అంతేకాకుండా, ఆ పరిశ్రమపై పడే విద్యుత్ భారాన్ని సైతం రాష్ట్ర ప్రభుత్వమే భరించేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ గారు, అధికారులు, తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# కొత్త ఆవిష్కరణలకు ఎంఎస్ఎంఈలు మూలం

- యువతకు ఉపాధి, బందరు అభివృద్ధికి ఇది కీలక అడుగు
- కరగ్రహారంలో ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపలో మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్య రథం): సరికొత్త ఆలోచనలు.. ఆవిష్కరణలకు ఎంఎస్ఎంఈ పార్కులే మెరుగైన మార్గమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం పోర్టుకు సమీపంలోని కరగ్రహారంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజితో కలిసి ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "మచిలీపట్నం పోర్టుకు సమీపంలో సుమారు 20నుంచి 21 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయడం హర్షణీయం. ఇందులో దాదాపు 82 పారిశ్రామిక ప్లాట్లు ఏర్పాటు చేయనున్నాం. ఒక్కో ప్లాట్ 600నుంచి 1000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుంది. పార్కులో అవసరమైన అన్ని మౌలిక వసతులను ఎంఎస్ఎంఈ శాఖ ద్వారా అభివృద్ధి చేయనున్నాం. పోర్టు ఆధారిత సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు ఈ పార్కు కేంద్రంగా మారుతుంది" అని మంత్రి తెలిపారు. పారిశ్రామికవేత్తలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు, ప్రభుత్వ రాయితీలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోతేపల్లి ఆటోనగర్, గోల్డ్ కవరింగ్ ఇమిటేషన్ జ్యువెలరీ పార్కుల అభివృద్ధిని ఉదాహరణగా ప్రస్తావిస్తూ, అక్కడ వేలాదిమందికి ఉపాధి లభిస్తోందని, ఇదేవిధంగా కొత్త ఎంఎస్ఎంఈ పార్కు కూడా ఈ ప్రాంతానికి మరింత అభివృద్ధి తీసుకువస్తుందన్నారు. 2014-19 కాలంలో ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు భూసేకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంవల్లే బందరు పోర్టు పనులు వేగవంతమయ్యాయి. అప్పట్లో భూసేకరణకు దాదాపు రూ.200 కోట్లు కేటాయించాం. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి బందరు పోర్టు పేరుతో డ్రామాలాడడం తప్ప పైసా పని చేయలేదు. కేంద్రం నుండి వచ్చిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు తప్ప రూపాయి కూడా రాష్ట్రం నుండి ఖర్చు చేయలేదు. ఐదేళ్లు మాటలతో కాలం గడిపి.. ఎన్నికల ముందు ఓట్ల కోసం మరోసారి శంకుస్థాపన చేశారు అని దుయ్యబట్టారు.

"ఏది ఏమైనా.. 2026 డిసెంబర్ లేదా 2027 జనవరి నాటికి బందరు పోర్టును ప్రారంభించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. పోర్టు ప్రారంభానికి ముందే పరిసర ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే కొన్ని కంపెనీలు పోర్టు అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చాయి. షిప్ బిల్డింగ్ కంపెనీలు కూడా వస్తున్నాయి. బందరుని అభివృద్ధి, ఉద్యోగ ఉపాధి అవకాశాల విషయంలో కేంద్రంగా మలిచేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అని పేర్కొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి హెచ్చరించారు. అనుమతులు లేకుండా మట్టి, ఇసుక అక్రమ రవాణా చేస్తే యంత్రాలు, ట్రాక్టర్లను సీజ్ చేయడమే కాకుండా సహకరించే అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టబద్ధంగా అనుమతులు తీసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ దీవెన్, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కూటమి నాయకులు లంకె శేషగిరిరావు, తలారి సోమశేఖర్, తిరుమలరావు, కే.సుశీల, కాగిత గోపాలరావు తదితర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జీవ నదులను చేతులారా చంపేస్తున్నాం

- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆవేదన
- గోదావరి కాలుష్య నివారణకు అంతర్ శాఖల టాస్క్ ఫోర్స్
- రూ.100 కోట్ల బడ్జెట్
- ఆరు నెలల్లో మార్పు కనిపించాలని ఆదేశం



రాజమహేంద్రవరం (చైతన్య రథం): "మన దాహం తీర్చి, మనకు జీవితాన్ని ఇచ్చే పవిత్రమైన జీవ నదులను మనమే చేతులారా చంపేస్తూ, వాటిని మృత నదులుగా మారుస్తున్నాం" అని ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ-అటవీ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నదులపట్ల నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే భవిష్యత్తు తరాలకు తాగునీరు దొరకడమే కష్టమవుతుందని హెచ్చరించారు. భగవంతుడు ప్రసాదించిన నీటిని ఇష్టారాజ్యంగా కలుషితం చేస్తూ, మళ్లీ అదే తాగునీటి కోసం జలజీవన్ మిషన్ పేరిట కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే విచిత్ర పరిస్థితికి స్వస్తి చెప్పాలని పిలుపిచ్చారు. సోమవారం ఉదయం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో గోదావరి నది కాలుష్యం, పుష్కరాల సన్నద్ధతపై పీసీబీ, అటవీ-పర్యావరణ శాఖ, పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### కాలుష్య నియంత్రణకు అంతర్ శాఖల టాస్క్ ఫోర్స్

గోదావరి పరివాహక ప్రాంతాల్లోని కాలుష్యాన్ని నివారించడానికి ప్రత్యేకంగా అంతర్ జిల్లా టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారాలను సూచించే విధంగా ఈ టాస్క్ ఫోర్స్ పని చేయాలని, దాని సూచనలు వేగంగా అమలు జరిగేలా పర్యవేక్షణ కమిటీ కూడా ఉండాలని స్పష్టం చేశారు. ఇవాళ్టి నుంచే యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని, వచ్చే ఆరు నెలల్లో నదిలో స్పష్టమైన మార్పు కనిపించాలని ఆదేశించారు. నది ఎక్కడెక్కడ కలుషితమవుతోంది, ఏయే కాలువలు, ఉపనదులు వ్యర్థాలను మోసుకొచ్చి నదిలో కలుస్తున్నాయి అనే విషయాలపై తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని ఆదేశించారు. నది తీవ్రంగా కలుషితమవుతున్న ప్రధాన కేంద్రాలను గుర్తించి 'పొల్యూషన్ ఆడిట్' నిర్వహించాలని, నీటి నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపాలని సూచించారు.

### రూ.100 కోట్ల ప్రత్యేక బడ్జెట్

గోదావరి ప్రవహించే ఆరు జిల్లాల పరిధిలో కాలుష్య నియంత్రణ చర్యల కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా రూ.100 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. పీసీబీ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న పటిష్ట అంతర్ శాఖల టాస్క్ ఫోర్స్‌లో ఆరు జిల్లాలకు చెందిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు భాగస్వాములుగా కలిసి పని చేస్తారు. కొన్ని పరిశ్రమల రసాయన వ్యర్థాలు నేరుగా గోదావరి నదీపాయల్లో కలుస్తున్న నేపథ్యంలో ఈ టాస్క్ ఫోర్స్ ప్రత్యేకంగా నిఘా పెట్టి క్షేత్రస్థాయి పరిశీలన చేపడుతుందని తెలిపారు.

### హడావుడి పనులతో భక్తుల ప్రాణాలతో చెలగాటమొద్దు

పుష్కరాలు సమీపిస్తే హడావుడిగా టెండర్లు పిలిచి నాణ్యత లేకుండా తాత్కాలిక ఘాట్లు, కట్టడాలు నిర్మిస్తే అవి కూలిపోయి భక్తులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదంఉందని పవన్‌కళ్యాణ్ హెచ్చరించారు. గతంలో అలాంటి దుర్ఘటనలు చూశామని, ఆ తరహా నిర్లక్ష్యానికి తావు ఇవ్వరాదని స్పష్టంచేశారు. ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా, చిత్తశుద్ధితో పనులు చేయాలని అధికారులను కోరారు. "మిషన్ ఫర్ క్లీన్ గోదావరి కేవలం బోర్డులకే పరిమితం కాకూడదు. గోదావరిలోకి మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు కలవకుండా దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేయాలి" అని ఆదేశించారు.

### 285 గ్రామ పంచాయతీలు భాగస్వాములు

గత పుష్కరాలకు 4.6 కోట్ల మంది భక్తులు వస్తే, ఈసారి దాదాపు 10 కోట్ల మంది వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ భారీ రద్దీని తట్టుకోవడానికి పుష్కరాలు కేవలం రాజమహేంద్రవరానికే పరిమితం కాకుండా గోదావరి ప్రవహించే ఆరు జిల్లాల్లోని 285 గ్రామ పంచాయతీలను అధికారులు గుర్తించారు. ఆయా పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించి ఘాట్లను అభివృద్ధి చేస్తారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం గ్రామాల్లో 'హోం స్టే' సౌకర్యాలు కల్పించడంతోపాటు స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### దేశం గర్వపడేలా ప్లాస్టిక్ రహిత పుష్కరాలు

గోదావరి పుష్కరాలను దేశమంతటా ప్రతిష్టాత్మకంగా నిలిపేందుకు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా అరికట్టాలని పవన్ కళ్యాణ్ పిలుపిచ్చారు. గోదావరి ప్రవహించే ఆరు జిల్లాల్లో ఏడాదిపాటు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, పుష్కరాల నాటికి నదీ తీరాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కనిపించకూడదని ఆదేశించారు. ఇందుకోసం ఎన్విరాన్‌మెంటల్ టాస్క్‌ఫోర్స్ కఠినమైన చర్యలు చేపట్టాలని, ప్రత్యామ్నాయాలు అందుబాటులోకి తేవాలని సూచించారు. "జీవ నది మన తల్లి లాంటిది. దాన్ని కలుషితం చేస్తే మన భవిష్యత్తుని మనమే పాడుచేసుకున్నట్లు అవుతుంది" అని హెచ్చరించారు. పుష్కరాలు వచ్చే వరకు ప్రతి రెండు వారాలకు ఒకసారి కాలుష్యంతోపాటు అభివృద్ధి పనులపైనా సమీక్ష నిర్వహిస్తామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.



## లక్ష్యం.. కాలుష్యరహిత గోదావరి

**పుష్కరాల నిర్వహణపై డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష**

రాజమహేంద్రవరం (చైతన్య రథం): "కాలుష్యరహిత గోదావరి" అనే లక్ష్యంతో రాబోయే పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.రాజమహేంద్రవరం పుష్కరాల ఘాట్ నుంచి పడవపై బయలుదేరిన ఆయన గోదావరి తీర ప్రాంతంలో కాలుష్య పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. పుష్కరాల పనుల పురోగతిని అంచనా వేసిన ఉప ముఖ్యమంత్రి, నల్లా ఛానల్ నుంచి గోదావరిలోకి నేరుగా కలుస్తున్న కాలుష్య కారక వ్యర్థాలపై అధికారులను నిలదీశారు. గోదావరి పేపర్ మిల్ వ్యర్థ జలాలు ఎక్కడ శుద్ధి అవుతున్నాయని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చైర్మన్ కృష్ణయ్యను ప్రత్యేకంగా ప్రశ్నించారు. నల్లా ఛానల్ డ్రైనేజీ పంపింగ్ స్టేషన్‌ను సందర్శించిన పవన్‌కళ్యాణ్, రోజువారీ వ్యర్థా లను వేరు చేసే విధానం, మురికి నీటి శుద్ధి పద్ధతి, శాస్త్రీయ ప్రమాణాలు పాటిస్తున్నారా? అన్న విషయాలపై సవివరమైన వివ రణ కోరారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, రాజ మహేంద్రవరంలో గృహాలనుంచి రోజూ సుమారు 55 మిలియన్ లీటర్ల మురుగునీరు విడుదల అవుతోందని, అందులో కేవలం 15 శాతం మాత్రమే సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి అవుతోందని తెలిసింది. ఈ సమాచారం తీవ్రంగా పరిగణించిన ఉప ముఖ్యమంత్రి, కేంద్రంనుంచి అందే నిధులను పారదర్శకంగా వినియోగించుకుని, మురుగు నీటిని పూర్తిస్థాయిలో శుద్ధి చేసిన తర్వాతే గోదావరిలోకి వదలాలని స్పష్టమైన సూచన చేశారు.

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పుష్కరాల పనుల వివరాలను డిప్యూటీ సీఎంకు నివేదించారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజమండ్రి నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు గోదావరి జల కాలు ష్య నియంత్రణ, గట్టు సుందరీకరణ, గట్లు పటిష్ఠీకరణ పనులకు సంబంధించిన వివరాలు పవన్ కళ్యాణ్‌కు తెలిపారు. గోదావరి నదిని పరిశుద్ధంగా కాపాడటం కూటమి ప్రభుత్వ ప్రాధాన్యాంశ మని, పుష్కరాల నిర్వహణలో పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాముఖ్యత ఇస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# స్వచ్ఛ గోదావరికి సహకరించండి

- కాలుష్య వ్యర్థాల శుద్ధిప్లాంట్లను పక్కాగా నిర్వహించాలి
- పుష్కరాల నిర్వహణలో సామాజిక బాధ్యత చూపండి
- పరిశ్రమల యాజమాన్యాలతో డిప్యూటీ సీఎం భేటీ

రాజమహేంద్రవరం (చైతన్య రథం): గోదావరి నదిలో పెరిగిపోతున్న కాలుష్యాన్ని నివారించేందుకు పారిశ్రామికవేత్తలు కూడా తగిన విధంగా సహకరించాలని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్పష్టంచేశారు. రాబోయే గోదావరి పుష్కరాలకు పారిశ్రామికవేత్తలు సామాజిక బాధ్యతతో సహకరించాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక ప్రగతికి కూటమి ప్రభుత్వం అడ్డుపడబోదన్నారు. అదే సమయంలో పరిశ్రమల యాజమాన్యాలూ కాలుష్య కారకాలను నివారించి, శుద్ధిచేసే ప్లాంట్లను పద్ధతులను పకడ్బందీగా అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా గోదావరి పుష్కరాల ప్రత్యేక సమీక్ష అనంతరం పారిశ్రామికవేత్తలతో ఉప ముఖ్యమంత్రివర్యులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా పవన్ మాట్లాడుతూ "పరిశ్రమలనుంచే వ్యర్థాలు నేరుగా నదీ జలాల్లో కలపకూడదనే నిబంధన ఉంది. ప్రతి పరిశ్రమ శుద్ధి ప్లాంటు నిర్వహణ తప్పనిసరి చేసుకోవాలి. వ్యర్థాలను ఆధునిక పద్ధతులను ఉపయోగించి పూర్తిస్థాయిలో శుద్ధి చేసిన తర్వాత మాత్రమే విడుదల చేయాలి. ప్రజలకు తాగు, సాగునీటికి వినియోగించే నీటిలో కాలుష్యకారక వ్యర్థాలు కలపడంవల్ల తీవ్రమైన సమస్యలు వస్తాయి. భవిష్యత్తు తరాలకు కొత్త ఆరోగ్య సమస్యలు పుడతాయి. వీటిని పూర్తిస్థాయిలో దృష్టిలో పెట్టుకొని కాలుష్య వ్యర్థాలను పూర్తిస్థాయిలో శుద్ధి



చేయాలి. పరిశ్రమల్లో శుద్ధిప్లాంట్ల నిర్వహణ వ్యయాన్ని ఏమాత్రం భారం అనుకోకుండా శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించండి. ఇకనుంచి తప్పనిసరిగా ప్రతి మూడు నెలలకు ఒకసారి కాలుష్యంత్రణ మండలి ప్రతి పరిశ్రమను ఆడిట్ చేసి, ఆ పరిశ్రమ పరిస్థితిని రెడ్, ఎల్లో, గ్రీన్ విభాగాలుగా గుర్తిస్తుంది. మన సంస్కృతి సంప్రదాయం, నదుల్లో ఇమిడి ఉంటుంది. వాటిని రక్షించుకోవడం మన బాధ్యతగా భావిద్దాం" అని పిలుపునిచ్చారు.

### పుష్కరాల విజయవంతానికి కలిసి రావాలి

"వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాలు దేశమంతా ఆసక్తిగా మాట్లాడుకునేంత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ పుష్కరాలకు గోదావరి జిల్లాల నుంచి పారిశ్రామికవేత్తల సహకారం అవసరం. తగిన చొరవ తీసుకొని పుష్కరాల నిర్వహణలో పారిశ్రామికవేత్తలు కూడా తగిన సహాయ సహకారాలు అందించాలి. పుష్కరాల విజయవంతానికి పరిశ్రమల నిర్వాహకుల చొరవ చాలా అవసరం. ప్రభుత్వానికి తగిన విధంగా సహకరించాలి" అని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఆహార పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య, అధికారులు పాల్గొన్నారు.

# పంచాయతీ వనంతో గ్రామాలకు హరిత హారం

- వుడ్ బ్యాంక్ కోసం గ్రామాల్లో ప్రత్యేక వనాలు
- మొక్కల పెంపకం భావితరాలకు నేర్పించాలి
- అటవీశాఖ ప్రాంతీయ పరిశోధన కేంద్రాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం

రాజమహేంద్రవరం (చైతన్య రథం): 'ప్రతి గ్రామ పంచాయతీలోనూ దేశవాళి జాతి మొక్కలతో ప్రత్యేక వనాన్ని తయారు చేయాలి. మొక్కలను పెంచే బాధ్యతను గ్రామస్తులు తీసుకోవాలి. గ్రామీణ ప్రజలను భాగస్వామ్యం చేస్తేనే మొక్కల ఎదుగుదల సాఫీగా సాగుతుంది. పర్యావరణ పరిరక్షణతోపాటు దేశీయ మొక్కలను ఎక్కువగా పెంచితే ప్రకృతి సమతుల్యత సాధ్యమవుతుంది. వెంటనే దీనిపై దృష్టి సారించి పంచాయతీరాజ్ అధికారులు, అటవీశాఖ అధికారుల సంయుక్తంగా ఎంఓయు కుదుర్చుకొని వనయజ్ఞం చేపట్టాల'ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా సోమవారం మధ్యాహ్నం రాజనగరంలోని ప్రాంతీయ అటవీ అభివృద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ పెంచుతున్న దేశీయ జాతి మొక్కలను, వాటి



వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఎన్ని మొక్కలు ఉన్నాయి..? వాటి ప్రత్యేకతలు ఏమిటి? ఆ మొక్కలను పెంచడంవల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటన్న విషయాలను అటవీ అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. ఈ మొక్కలను సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అప్పటికప్పుడు పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజను ఆదేశించారు. అటవీ అధికారులతో ప్రత్యేక ఎమ్ఓయు కుదుర్చుకొని విశిష్టమైన మొక్కలను ప్రతి పంచాయతీలో నాటేలా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. పనులు వెంటనే జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. "దేశీయ మొక్కలను నాటడంవల్ల పండ్లు, ఫలాలతోపాటు మన నాగరికత పరిఢవిల్లుతుంది. దీనికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. వచ్చే తరాలకు సైతం దేశీ మొక్కల వల్ల ప్రయోజనాన్ని తెలియజేయాలి" అని సూచించారు.

### పంచాయతీలు ఆదాయ మార్గంగా ఉపయోగించుకోవచ్చు

"మొక్కలు పెంపకాన్ని పంచాయతీలు మంచి ఆదాయ మార్గంగా ఎంచుకోవచ్చు. కలప అతి తక్కువ సమయంలోనే లభించే మొక్కలు చాలా ఉన్నాయి. వాటిని బహిరంగ మార్కెట్ ద్వారా విక్రయించడం వల్ల పంచాయతీలు మంచి ఆదాయాన్ని సంపాదించవచ్చు. చాలా దేశాల్లో కలప కొరత ఉంది. పంచాయతీల్లో ప్రత్యేక వనాల ద్వారా ఆదాయాన్ని తెచ్చే మొక్కలను పెంచడం వల్ల మంచి ఫలితాలను సాధించవచ్చు. గ్రామాల్లో కూడా దేశీయ మొక్కలు నాటడాన్ని వాటిని సంరక్షించడాన్ని పిల్లలకు బాధ్యతగా నేర్పించాలి. ఇది వచ్చే తరాలకు చాలా ఉపయోగం" అని పవన్ సూచించారు.

# ఎంఎస్ఎంఈతో ఏపీలో పారిశ్రామిక విప్లవం

## ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026లో మంత్రి కొండపల్లి



విజయవాడ (చైతన్య రథం): ఎంఎస్ఎంఈతో ఏపీలో సరికొత్త ఔత్సాహిక, సరికొత్త పారిశ్రామిక విప్లవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాంది పలికారని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026 కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి మాట్లాడుతూ.. 1995 -2004 మధ్య ముఖ్యమంత్రి ఆలోచనతో తనలాంటి ఎంతోమంది ఐటీ రంగంలో ఉన్నతస్థానాల్లోకి ఎదిగే అవకాశం వచ్చిందన్నారు. 2014 రాష్ట్ర విభజన తర్వాత ఏపీని పారిశ్రామికంగా పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి కొనియాడారు. గత ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను వెళ్లగొట్టడమే తప్పా ఏ ఒక్కరినీ రాష్ట్రంలోకి రానివ్వలేదు... పెట్టుబడులు పెట్టనీయలేదని మంత్రి విమర్శించారు. ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త ఉంటే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తిరుగుండదన్న ఆలోచనతోనే ముఖ్యమంత్రి ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి తెలిపారు. ఈ క్రమంలోనే ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 19 పార్కులు ప్రారంభమవ్వగా.. సోమవారం 38 పార్కులకు ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేయటం రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవానికి నాందిగా అభివర్ణించారు. క్లస్టర్ డవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద సీఎం రు.200 కోట్లను విడుదల చేస్తున్నారని.. అలాగే సెక్టార్ బేస్డ్ ఇండస్ట్రీయల్ పార్క్‌లో కామన్ పెసిలిటీస్ కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. రెండేళ్లలో ఎంఎస్ఎంఈలకు 2,11,894 కోట్ల రుణాలిచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని మంత్రి కొనియాడారు. ప్రధానమంత్రి ముద్రయోజనా పథకం కింద రు.39,941 కోట్ల రుణ సౌకర్యం కల్పించామన్నారు. పీఎంఎఫ్ఎం ఈ కింద సబ్సిడీతో 3387 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించేలా చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తల కోసం 28,758 కొత్త వ్యాపారాలు స్టాండప్ ఇండియా కింద స్థాపించబడ్డాయని మంత్రి పేర్కొన్నారు. ఏపీ క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ ద్వారా రూ.5 వేల కోట్ల రుణాలు ఇచ్చేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని.. రాష్ట్రంలో ఉన్న 20.77 లక్షల ఎంఎస్ఎంఈల్లో చాలామంది రుణాలు దొరకక ఇబ్బందులు పడుతోన్న నేపథ్యంలో ఏపీ ఎస్ఎంఈ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేసేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీ కూడా నియమించామని మంత్రి తెలిపారు. స్వర్ణాంధ్ర నిర్మాణం కోసం ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త ఉండాలన్న నినాదంలో ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని మంత్రి కొండపల్లి ఆకాంక్షించారు.

# సింహవాహన సేవలో దేదీప్యమానమైన గోవిందరాజస్వామి

## గోవింద నామస్మరణలతో మార్మోగిన బ్రహ్మోత్సవ వైభవం

## రాత్రి ముత్యాల చల్లదనంలో భక్తులను ఆశీర్వదించనున్న గోవిందుడు



తిరుపతి (చైతన్య రథం): తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన సోమ వారం ఉదయం గోవిందరాజస్వామి సింహవాహనంపై అభయహస్తంతో భక్తులను అనుగ్రహిం చారు. ఉదయం 7 నుండి 9 గంటల వరకు జరిగిన దివ్య వాహనసేవలో మంగళవాయి ద్యాలు, కోలాటాలు, వేదఘోషలు, గోవిందనామస్మరణలతో తిరుపతి మాడవీధులు ఆధ్యాత్మిక కాంతులతో కళకళలాడాయి. వాహనం ముందు ఠీవిగా సాగిన గజరాజులు సేవకు మరింత మహోత్సవ శోభను చేకూ ర్చాయి. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామి వారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. మృగ రాజైన సింహం గాంభీర్యానికి, ధైర్యా నికి, శక్తికి ప్రతీకగా భావించ బడుతుంది. యోగశాస్త్రంలో సింహం వేగశక్తికి, ఆత్మవిశ్వాసానికి సంకేతం. భక్తునిలో సింహబలంలాంటి అచంచల భక్తి కలిగి నప్పుడు భగవంతుని కృప ప్రసాదమవు తుందని ఆధ్యాత్మిక వాం గ్మయం తెలియజేస్తోంది. అనంతతేజో మూర్తి అయినశ్రీనివాసుడు రాక్షసుల హృదయాల్లో సింహస్వరూపుడిగా ప్రత్యక్ష మవుతాడని పురాణాలు కీర్తిస్తు న్నాయి. అందుకే ధీరోదాత్తుడైన శ్రీహరి సింహ వాహనాన్ని అధిరోహించి భక్తుల కు దర్శనమిస్తాడు. అనంతరం ఉదయం 10నుండి 11గంటల వరకు స్వామి వారు, అమ్మవార్లకు స్నపన తిరు మంజనం వైభవంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు సమర్పించారు. సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ జరగనుండగా, రాత్రి 7 నుండి 9 గంట ల వరకు ముత్యపుపందిరి వాహనంపై గోవిందరాజస్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

### రాత్రికి ముత్యపు పందిరి వాహనంపై స్వామివారు

నిత్యాలంకార ప్రియుడైన శ్రీనివాసుడు ప్రతిరోజూ విభిన్న వస్త్రాభరణాలలో దేదీప్యమానంగా వెలుగొందుతుంటాడు. ముత్యపుపందిరిపై వెలసే స్వామివారి రూపం భక్తులకు మనోల్లాసాన్ని, ఆధ్యా త్మిక ప్రశాంతతను ప్రసాదిస్తుంది. జ్యోతి షశాస్త్రంలో చంద్రునికి ప్రతీకగా భావిం చే ముత్యాలు చల్లదనానికి సంకేతం. సముద్రగర్భం ప్రసాదించిన అమూల్య రత్నమైన ముత్యాల కింద వెలసిన శ్రీని వాసుని దర్శనం భక్తుల తాపత్రయాల ను తొలగించి, జీవితాల్లో శాంతి, చల్ల దనాన్ని నింపుతుందనే విశ్వాసం భక్తు ల్లో నెలకొంది. కార్య క్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ డిప్యూటీ ఈవో విఆర్ శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి పలు వురు అధికారులు, సేవకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మహానాడు.. టీడీపీకి ఒక పాలసీ పార్లమెంట్!

మహానాడు కేవలం తెలుగుదేశం పార్టీ వార్షిక ఉత్సవంగా కాకుండా, కోట్లాది తెలుగు ప్రజల ఆశలు, ఆకాంక్షలు ప్రతిబింబించే ఒక ప్రజా పార్లమెంట్‌గా ప్రత్యేక గుర్తింపు ఉంది. 1982లో విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారక రామారావు తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించిన నాటినుండి మహానాడు పార్టీకి దిక్సూచిగా నిలుస్తోంది. పసుపు రంగులో కళకళలాడే మహానాడు వేడుకను పార్టీ శ్రేణులు ప్రేమగా పసుపు పండుగగా పిలుస్తారు. పసుపు రంగు తెలుగుదేశం పార్టీ యొక్క ప్రతీక. ఈ రంగు ఆశ, అభివృద్ధి, సాంప్రదాయం, రైతు సంస్కృతి అనే భావనను ప్రతిబింబిస్తుంది. మహానాడు అనేది సాధారణ రాజకీయ సమావేశం కాదు. అది పార్టీకి చెందిన ఒక భావోద్వేగోత్సవం. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన కీలక తీర్మానాలను ఆమోదించే వేదిక. నిజమైన అర్థంలో టీడీపీకి మహానాడు ఒక పాలసీ పార్లమెంట్ అని కూడా చెప్పొచ్చు. ఇక్కడే ప్రజా సమస్యలపై చర్చ జరుగుతుంది. రాబోయే కాలానికి పార్టీ అనుసరించాల్సిన వ్యూహ ప్రతివ్యూహాలకు తుది రూపం లభిస్తుంది. సాధారణ కార్యకర్తలు కూడా తమ అభిప్రాయాలను పంచుకునే అవకాశం కల్పించే వేదిక. ప్రతి ఏడాది మే 27- 28 తేదీలలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మహానాడు నిర్వహించడం ఆనవాయితీ. ఆ వేదికపై పార్టీ సిద్ధాంతాలు పునరుద్ఘాటిస్తారు. రాజకీయ తీర్మానాలు ఆమోదిస్తారు. ప్రజా సమస్యలపై కార్యాచరణ ప్రకటిస్తారు. భవిష్యత్ ఎన్నికల వ్యూహాలను ఖరారు చేస్తారు. కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారు. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు, నేటి యువనేత లోకేష్ వరకు ఒక సిద్ధాంత యాత్ర. ప్రతి మహానాడులో ఆమోదించే తీర్మానాలు రాజకీయంగా కీలకం అవుతాయి. వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు, మహిళలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, యువత, ఉద్యోగాలు, పరిశ్రమలు, రాష్ట్ర హక్కులు ఇలా ప్రతి అంశంపై చర్చించి తీర్మానాలు చేస్తారు. తెలుగు రాష్ట్రాల ప్రగతికి బాటలు వేసిన ఎన్నో నిర్ణయాలు మహానాడు వేదిక నుంచే వెలువడ్డాయి. ఎన్టీఆర్ కలలు- చంద్రబాబు విజన్- ఇప్పుడు యువనేత నారా లోకేష్ కొత్త ఆశయాలతో ముందుకు వస్తున్న తరుణంలో మహానాడు మరింత కొత్త బలాన్ని సంతరించుకుంటోంది.

మహానాడు వేదికగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టడం అనేది తెలుగుదేశం పార్టీ చరిత్రలో ఒక కీలకమైన మైలురాయిగా, భవిష్యత్తు రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే పరిణామంగా చూడాలి. మూడుతరాల రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసే దిశగా లోకేష్ పాత్ర అత్యంత కీలకం కానుంది. వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో లోకేష్ పార్టీలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, క్రియాశీలక కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వడం ఆయన ప్రధాన బాధ్యత కానుంది. పార్టీ యంత్రాంగాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించడం, బూత్‌స్థాయి కమిటీల నుంచి రాష్ట్రస్థాయి వరకు సమన్వయాన్ని పర్యవేక్షించడంలో ఆయనది కీలక పాత్ర. యువగళం పాదయాత్ర ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయి క్యాడర్‌తో ఏర్పడిన ప్రత్యక్ష సంబంధాన్ని మరింత వ్యవస్థీకృతం చేయనున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి వెళ్లడం, అమరావతి నిర్మాణం, క్వాంటం వ్యాలీ, ఐటీరంగ అభివృద్ధి, పారిశ్రామికీకరణపై తనకున్న స్పష్టమైన విజన్‌ను ప్రజల్లోకి, ముఖ్యంగా విద్యావంతులైన యువతలోకి బలంగా తీసుకెళ్లడం, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడం, పార్టీని తదుపరి తరానికి సంసిద్ధం చేయడంలో లోకేష్ అత్యంత వ్యూహాత్మక పాత్ర పోషించనున్నారు.

కాలంతోపాటు మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందే ఉంటుందని మరోసారి నిరూపితమైంది. విపత్కర పరిస్థితులు ఎదురైనా, భౌతిక దూరాలు అడ్డువచ్చినా, పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపేందుకు వర్చువల్ మహానాడు పేరిట సరికొత్త డిజిటల్ ప్రయోగానికి శ్రీకారం చుట్టడం తెలుగు రాజకీయాల్లో ఒక చారిత్రాత్మకమైనది. గతంలో మహానాడు అంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకే పరిమితమయ్యేది. కానీ వర్చువల్ విధానం ఎప్పుడైతే అమల్లోకి వచ్చిందో, ఈ పసుపు పండుగ ప్రపంచవ్యాప్తమైంది. జూమ్, వెబినార్లు, యూట్యూబ్, ఫేస్‌బుక్‌వంటి సామాజిక మాధ్యమాల ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలలోని మారుమూల గ్రామాలను మొదలుకొని అమెరికా, యూరప్, గల్ఫ్ దేశాలలో ఉన్న ఎన్‌ఆర్‌ఐల వరకు కోట్లాది కార్యకర్తలు ఒకే వేదికపైకి రానున్నారు. భౌతికంగా దూరంగా ఉన్నా, సాంకేతికంగా అందరూ ఒకేచోట కలుసుకునే అద్భుతమైన అవకాశం వర్చువల్ మహానాడు. గతంలోనూ రెండుసార్లు ఆన్‌లైన్‌లో మహానాడు నిర్వహించారు. పార్టీ చరిత్రలో తొలిసారిగా 2020లో కొవిడ్ కారణంగా ఆన్‌లైన్‌లో నిర్వహించారు. 2021లో కొవిడ్ సెకండ్ వేవ్ కారణంగా వరుసగా రెండో ఏడాది కూడా ఆన్‌లైన్‌లోనే మహానాడు నిర్వహించడం జరిగింది. ఇప్పుడు ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా మూడోసారి ఆన్‌లైన్‌లో మహానాడు నిర్వహిస్తున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల నుండి కనీసం 10నుంచి12 వేల వాహనాల్లో మహానాడుకు కార్యకర్తలు, అభిమానులు తరలి రానున్నారు. ఇందుకు ఇంధన వ్యయమే దాదాపు రూ.6వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. మహానాడు మూడు రోజుల నిర్వహణకు మరో రూ.6 నుండి 7 వేల కోట్ల పైచిలుకు వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. అందుకే -మహానాడును ఆన్‌లైన్‌లో నిర్వహించడం ద్వారా సుమారు రూ.13 వేల కోట్ల వరకు ఆదా చెయ్యడమే కాకుండా, మన దేశం-మన బాధ్యత అని సియం చంద్రబాబు ఇచ్చిన పిలుపులో భాగస్వాములై, ఇంధన పొదుపుతో జాతీయస్థాయిలో సానుకూల సంకేతాలు పంపినట్లయింది. వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ ఆశయాల నుండి నేటితరం యువనేత నారా లోకేష్ రాకతో మహానాడులో సరికొత్త మార్పులు కనిపిస్తున్నాయి. యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత ఇవ్వడం, డిజిటల్ యుగానికి అనుగుణంగా పార్టీని నడిపించడంపై లోకేష్ దృష్టి పెట్టారు. ఎన్టీఆర్ ఆశయాలను గౌరవిస్తూ, చంద్రబాబు అనుభవాన్ని వాడుకుంటూ, లోకేష్ తనదైన శైలిలో పార్టీని ముందుకు తీసుకెళు _న్నారు. నాడు ఎన్టీఆర్ వేసిన పునాది నుంచి నేడు లోకేష్ చూపిస్తున్న చొరవ వరకు కాలానికి అనుగుణంగా మారుతూ, ప్రజా పక్షాన నిలబడటమే మహానాడు లక్ష్యం. తెలుగు రాష్ట్రాల రాజకీయ పరిణామాలను ప్రభావితం చేసే బలం పాలసీ పార్లమెంట్‌కు ఉంది. సాధారణ కార్యకర్త కూడా తన అభిప్రాయాన్ని మహానాడులో పంచుకునే వీలు కల్పించడం ఈ పాలసీ పార్లమెంట్ ప్రత్యేకత!

- నీరుకొండ ప్రసాద్

# పాపం పసివాడు!

"జగన్మోహన్‌రెడ్డి అనే వ్యక్తి చాలా మంచోడు, మంచి మనసున్నోడు. అందుకే మా తాతను చంపిన వాళ్లు కూడా ఈరోజు స్వేచ్ఛగా తిరగగల్గుతున్నారు" ఇవి రెండు రోజులు క్రితం బెంగళూరు టూరిస్టు, మాజీ సీఎం జగన్‌రెడ్డి మీడియా ముందు చేసిన వ్యాఖ్యలు. శాంతి ప్రబోధకులకు ఏమాత్రం తీసిపోని విధంగా ఇంతటి శాంతి ప్రవచనాలు బోధిస్తున్న జగన్మోహన్‌రెడ్డి... తన తాత రాజారెడ్డి హత్య కేసులో నిందితుడుగా ఉన్న పేర్ల పార్థసారథిరెడ్డి ఆరోపణలకు ఇంత వరకు సమాధానం చెప్పకపోవడం బాధాకరం. వైఎస్సార్ మరణంలో రిలయన్స్ పాత్ర ఉందని చెప్పి తన అనుచరులతో ఆ సంస్థ కార్యకలాపాలపై దాడులు చేసి 2009లోనే సుమారు రూ.100 కోట్లపైగా ఆస్తి నష్టం చేకూర్చారు. మరల తాను అధికారంలోకి రాగానే 2020లో అదే సంస్థలకు చెందిన దగ్గరి బంధువు పరిమల్నత్వానీని రాజ్యసభ ఎంపీగా చేశారు. దీని వెనుక మర్మమేంటో జగన్ రెడ్డికే ఎరుక.

తండ్రి తరువాత తండ్రైన వైస్ వివేకానందా రెడ్డి 2019లో దారుణంగా హత్యకు గురయ్యారు. అనంతర ఎన్నికల్లో అదే సెంట్‌మెంట్‌తో ఎన్నికల్లో లబ్ధిపొందిన జగన్‌రెడ్డి మాత్రం ఆయన ఆత్మకు శాంతి చేకూర్చలేకపోయారు. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న వైఎస్ అవినాశ్‌రెడ్డిని చిన్న పిల్లాడు మాదిరి జగన్ చంక ఎక్కించుకున్నాడు. సాక్షులుగా ఉన్న శ్రీనివాస రెడ్డి, గంగాధర రెడ్డి, డ్రైవర్ నారాయణ, ఈ.సి గంగిరెడ్డి, వైఎస్ అభిషేక్ రెడ్డి, వాచ్‌మేన్ రంగన్నలాంటి వరుస అనుమానాస్పద మరణాల వెనుక అంతుచిక్కని రహస్యం ఇప్పటికీ మిస్టరీగానే మిగిలిపోయింది.



సందర్భం దొరికిన ప్రతిసారీ తాను ఒంటరివాడిని, అమాయకుడిని అని రాష్ట్ర ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్న జగన్.. తాను ఒంటరిగా మిగలడానికి తనకు తానే కారణం కాదా? పేగు బంధం పంచిన వైఎస్ విజయమ్మ, తోబుట్టువు షర్మిలను ఆస్తి కోసం ఇంటినుంచి గెంటేసి వారిపైనే కేసులు వేస్తే ఒంటరి వారు కాకా బలగం ఉన్నవాడు అవుతారా? తాను ప్రజల మనిషినని చెప్పుకుని తిరిగే జగన్.. అక్రమ మైనింగ్‌తో సుమారు రూ.32వేల కోట్ల ప్రజాధనం ఎందుకు లూటీ చేశారో రాష్ట్ర ప్రజలకు వివరించాలి. తండ్రి ముఖ్యమంత్రి అధికారం అడ్డం పెట్టుకొని "క్విడ్ ప్రో కో" అనే పదం సృష్టించి సరికొత్త కుంభకోణానికి ట్రెండ్‌గా నిలిచారు. ఈ కేసులో జగన్మోహన్ రెడ్డిపై 10 సీబీఐ కేసులు ఇప్పటికీ నడుస్తున్నాయి. ఈ కేసులు ఉండటం వలనే జగన్ విదేశాలకు వెళ్లాలంటే నేటికి కోర్టు అనుమతి తీసుకోవాల్సిందే. అంతే కాదు పరిటాల రవి హత్య కేసులో జగన్మోహన్ రెడ్డిని ఛార్జిషీట్ నుంచి తప్పించినట్టు ఇప్పటికీ ఆరోపణలున్నాయి. అలానే పరిటాల హత్యకు ప్రణాళికలు రచించి సూట్ కేసు బాంబు కేసులో ప్రథమ ముద్దాయిగా ఉన్న మంగలి కృష్ణ జగన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు. తన రాజకీయ ఎదుగుదలకు అడ్డుపడుతున్నాడని ఎరుకల సామాజిక వర్గానికి చెందిన మహేష్ వ్యక్తిని పక్కా ప్లాన్ ప్రకారం హత్య చేయించారు. ఆ తర్వాత మహేష్ కుటుంబానికి చెందిన ఉదయ్ (19), రామాంజనేయులు (20) అనే యువకులను దారుణంగా తుదముట్టించారు. ఇలా వైఎస్ ఫ్యామిలీనే నేర చరిత్ర కలిగిన డీఎన్‌ఏ ఉంది.

నాడు బీసీ వర్గానికి చెందిన వెంకట నర్సయ్య మైనింగ్ కంపెనీలో వాటాదారుగా చేరిన వైఎస్ రాజారెడ్డి ఆయన్నే హత్య చేసి ఆ సమాధిపై వ్యాపారవేత్తగా ఎదిగారు. అనంతరం ఆయన స్వార్థ రాజకీయాలు కోసం అనేక మందిని బలి తీసుకున్నారు. వైఎస్ రాజారెడ్డిపై కడప జిల్లాలో సుమారు 20 క్రిమినల్ కేసులున్నాయి. ఆయన వారసుడైన వైఎస్ రాజశేఖర్ రెడ్డి అనేక ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. లింగాల మండలంలో కృష్ణారెడ్డి, రఘురామరెడ్డిలాంటి వాళ్లను ప్రీప్లాన్డ్‌గా హత్య చేయించారు. వైఎస్సార్ హైదరాబాద్‌లో మిలటరీ అధికారితో గొడవ పెట్టుకుని అదే సమయంలో ఆ హత్యలు చేయించడం ఆయన ఎత్తుగడ. వైఎస్సార్‌పై కూడా సుమారు 15కిపైగానే క్రిమినల్ కేసులున్నాయి. ఆయన వారసుడు ప్రస్తుత పసి పిల్లవాడు జగన్‌రెడ్డిపై సీబీఐ ఛార్జ్‌షీటులో 10 కేసులు వరకూ ఉన్నాయి. అనేక హత్య కేసుల్లో ఆరోపణలు ఉన్నాయి. ఇంతటి నేర చరిత్ర ఉన్న జగన్‌రెడ్డి తాను చాలా మంచివాడిని, ఎదుటివారికి హాని తలపెట్టనని చెప్పుకోవడం నిజంగా హాస్యాస్పదం!!

# కత్తినుంచి గొడ్డలి వరకు..!!

## - మూడు తరాల కుటుంబ రక్త చరిత్ర

ఆంధ్రప్రదేశ్ రాజకీయ యవనికపై అధికారాన్ని, అపరిమితమైన సంపదను చేజిక్కించుకోవడానికి 'హింస'నే ఏకైక సాధనంగా మార్చుకున్న ఒక కుటుంబ ప్రస్థానాన్ని పరిశీలిస్తే ఎవరికైనా ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ప్రజాస్వామ్యానికి పట్టిన గ్రహణంగా, ఫ్యాక్షన్ సంస్కృతికి అసలైన నిఘంటువుగా నిలిచే "వైఎస్ కుటుంబం" నాడు తాత రాజారెడ్డి వేసిన రక్తం పారే పునాదిపై.. నేడు మనవడు జగన్‌రెడ్డి నిర్మించిన అవినీతి, అరాచక కోటలవరకు ఈ కుటుంబ చరిత్ర మొత్తం అమాయకుల శవాల దిబ్బలపైనే నిర్మించబడింది. రాష్ట్రాన్ని దశాబ్దాలపాటు వెనక్కి నెట్టి, ప్రగతికి అడ్డుగోడగా మారిన ఆ కుటుంబ అరాచక వారసత్వపు చీకటి కోణాల చరిత్ర అందరూ తెలుసుకోవాలి.

### బ్రిటిష్ వారికి ఊడిగం

ఈ కుటుంబ రక్తచరిత్ర ఒక ఘోరమైన నమ్మకద్రోహంతో, దేశద్రోహంతో మొదలైంది. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో దేశభక్తులు రక్తం చిందిస్తుంటే.. ఈ కుటుంబ పూర్వీకులు మాత్రం స్వార్థ లాభాల కోసం తెల్లదొరల కాళ్ల దగ్గర మోకరిల్లారు. బ్రిటిష్ వాళ్లకు తొత్తులుగా మారి సొంత దేశీయుల వెన్నుపోటు పొడిచిన కరడుగట్టిన దేశద్రోహ చరిత్ర వీరిది. నాడే పరాయి పాలకుల పంచన చేరిన ఈ వంశం, నేడు అధికార దాహంతో రాష్ట్ర ప్రజల గొంతు కోయడానికి కూడా వెనుకాడడం లేదు.

### బీసీ వ్యాపారవేత్తపై కిరాతకం

వైఎస్ జగన్ ముత్తాత, రాజారెడ్డి తండ్రి అయిన వెంకటరెడ్డి పులివెందుల గడ్డపై అతి సామాన్య రైతు. కేవలం కొన్ని సెంట్ల భూమితో, రెక్కాడితేగాని డొక్కాడని కటిక పేదరికంలో బతికిన కుటుంబం. నాటి రోజుల్లో వీరికి చెప్పుకోదగ్గ ఆస్తిపాస్తులు కానీ, సమాజంలో ఎలాంటి గౌరవ మర్యాదలు కానీ లేవు. రాజారెడ్డి ఫ్యాక్షన్ మార్గాన్ని ఎంచుకున్న తర్వాతే ఈ కుటుంబానికి ఆస్తులు సమకూరడం మొదలయింది. తమకు ఆశ్రయం ఇచ్చిన ఒక బీసీ వ్యాపారవేత్తను కిరాతకంగా హతమార్చి, అతని ఆస్తులను కబళించిన ఘటనతోనే రాజారెడ్డి సామ్రాజ్యం ప్రారంభమైంది.

### వార్డు మెంబర్‌గా గెలవలేని దౌర్భాగ్యం

ఈరోజు తాము తిరుగులేని నాయకులమంటూ సోషల్ మీడియాలో రంగురంగుల గ్రాఫిక్స్ వేసుకునే ఈ కుటుంబానికి, అసలైన ప్రజాస్వామ్య బలం ఎప్పుడూ లేదు. చరిత్ర తిరగేస్తే.. 1968 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అమ్మగారు వైఎస్ జయమ్మ.. గాడిచర్ల కృష్ణమూర్తి అనే వ్యక్తిపై ఓడిపోయారు. చివరకు కనీసం ఒక చిన్న పల్లెటూరి వార్డు మెంబర్ స్థానాన్ని కూడా గెలుచుకోలేక, ప్రజల చేతిలో ఛీత్కరించుకున్న దౌర్భాగ్య చరిత్ర వీరిది. ప్రజల మనసులు గెలిచి రాజ్యాధికారం సాధించలేమనే నైరాశ్యంతోనే, వీరు ప్రజలపై 'రౌడీయిజం' అనే ఆయుధాన్ని ప్రయోగించడం మొదలుపెట్టారు.

### రాజారెడ్డి -ఫ్యాక్షన్ సంస్కృతి వ్యవస్థీకరణ

గతంలో కేవలం కొన్ని వర్గాలు, కుటుంబాలకు మాత్రమే పరిమితమైన వ్యక్తిగత కక్షలను, ఫ్యాక్షనిజాన్ని వ్యవస్థీకృతం చేసి రాజకీయాల్లోకి విస్తరింపజేసిన ఘనత జగన్ తాత రాజారెడ్డిదే. పల్లెల్లో బాంబుల సంస్కృతిని, డైనమైట్ల బీభత్సాన్ని ఒక సిస్టమ్‌లా ప్రవేశపెట్టింది ఈ రాజారెడ్డే. రాజారెడ్డిపై 1966లోనే రౌడీ షీట్ నెంబర్ 95 ఓపెన్ అయింది. అప్పుడు తెలుగుదేశం పార్టీ లేదు. చంద్రబాబు నాయుడు అసలు రాజకీయాల్లోనే లేరు.

### రాజారెడ్డి సాగించిన రక్తపాతం, క్రిమినల్ కేసులు:

పులివెందుల, ఓబులపల్లె, కోడూరు, పెద్దమాణ్యం, ముద్దనూరు, వల్లూరు, బద్వేలు, కడప రకరకాల పోలీస్ స్టేషన్లలో రాజారెడ్డిపైన కుప్పలు కుప్పలుగా కేసులుండేవి. మంగంపేట బైరటీస్ గనుల్లో బీసీ వర్గానికి చెందిన వెంకట నరసయ్య, లక్ష్మీ మినరల్ ట్రేడింగ్ కంపెనీ మైన్స్ యజమాని దగ్గర గుమస్తాగా చేరారు. పెట్టుబడి లేకుండా ఆయన తన వ్యాపారంలోకి రాజారెడ్డిని తీసుకుంటే, చివరికి 15 జూలై 1975 కోడూరులో ఆయన్నే హత్య చేశారు. ఆ హత్యా రాజకీయ పునాదిపైనే రాజారెడ్డి ఎదిగారు. ఆ హత్యకు సహకరించిన పౌలిరెడ్డి అనే వ్యక్తి కూడా తర్వాత అనుమానాస్పదంగా మృతి చెందారు. అనంతరం త్రివేణి స్టీల్ యజమాని మురళిరెడ్డిని హత్య చేశారు. ఆ హత్య జరిగిన తరువాతే కొళ్లం గంగిరెడ్డి కుటుంబంతో వీరికి బంధం ఏర్పడింది. పులివెందులలో ఊసన్న అనే ఎస్టీని కిరోసిన్ పోసి బతికుండగానే తగలబెట్టిన ఘోర చరిత్ర రాజారెడ్డిది. అప్పట్లో అత్యంత శక్తివంతమైన 'మీసా' చట్టం కింద ఆయన నిర్బంధంలోకి వెళ్ళారు. 1985లో లింగాల మండల టీడీపీ నేత కృష్ణారెడ్డిని పులివెందులలో పట్టపగలు హత్య చేశారు. 1987లో మేజర్ సోమనాథ్, ఆయన కుమారుడు భాస్కర్‌పై దాడి చేశారు. 1989 ఎన్నికలకు ముందురోజు ఇండిపెండెంట్ అభ్యర్థి ఆవుల సుబ్బారెడ్డిని హత్య చేసి ఎన్నికలను ఆపేయడానికి చూశారు. 1989 ఎంపీ ఎన్నికల్లో రాయచోటిలో ఐదుగురిని హత్య చేశారు. పెనికలపాడులో బ్యాలెట్ బాక్స్‌లను దహనం చేశారు. కర్ణపాపాయపల్లిలో రఘురామరెడ్డిని హత్య చేశారు. 1994 ఎన్నికల్లో రిగ్గింగ్‌ని అడ్డుకున్న టీడిపి ఏజెంట్‌ను దారుణంగా చంపేసి, పార్నపల్లి పంచాయతీ ప్రెసిడెంట్ ఇంటిని డైనమిట్‌తో పేల్చేశారు. బైరైటీస్ గనులనుంచి 5 కోట్ల విలువైన ముగ్గురాళ్లు అక్రమంగా అమ్ముకున్న రాజారెడ్డి, ఫిర్యాదు చేసిన వ్యక్తిపై పాశవికంగా దాడి చేశారు. 1995లో కేవలం ఎకరన్నర భూమి కోసం రాజగోపాల శర్మ కాళ్లు చేతులు విరగ్గొట్టారు. రాజకీయాల్లో రాజారెడ్డికి వ్యతిరేకంగా పోటీచేసిన పేర్ల పార్థసారథి రెడ్డిపై కత్తులతో నరికి హత్యాయత్నం చేశారు. అయినా ఆయన బతికి బట్టకట్టారు. ఆ తర్వాత ప్రతీకార చర్యల్లో పార్థసారథి రెడ్డి వర్గీయులు రాజారెడ్డిని హత్య చేశారు. ఆ తర్వాత వాళ్ల సోదరుడు ఉమారెడ్డి కూడా హత్యకు గురయ్యారు. ఈ కేసులో వైఎస్ అవినాశ్‌రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డి, భారతీ రెడ్డి తండ్రి గంగిరెడ్డి తదితరులు ముద్దాయిలుగా ఉన్నారు.

### రాజశేఖర్ రెడ్డి -వైట్‌కాలర్ ఫ్యాక్షనిజం పితామహుడు

రాజారెడ్డి వారసుడిగా వచ్చిన రాజశేఖర్ రెడ్డి హయాంలో ఈ ఫ్యాక్షన్ అరాచకం మరింత వ్యవస్థీకృతమైంది. ముఖ్యమంత్రి కుర్చీని వాడుకుని ఫ్యాక్షన్ రాజకీయాలకు వైట్ కాలర్ కోటు వేశారు. పోలీసులను చేతిబొమ్మలుగా మార్చి, ప్రత్యర్థులపై అక్రమ కేసులు పెట్టించి, వ్యవస్థలను మేనేజ్ చేస్తూ ఫ్యాక్షనిజాన్ని రాష్ట్రవ్యాప్తం చేశారు. కడపలో రిగ్గింగ్ పాల్పడి గెలిచిన చరిత్ర వైఎస్సార్‌ది.

లింగాల మండలంలో పెద్దగూడల కృష్ణారెడ్డిని హత్య చేయించి, ముందుగా ఏర్పాటు చేసుకున్న ముద్దాయిలను పోలీస్ స్టేషన్‌లో ఉంచి.. తాను మాత్రం అదే సమయంలో హైదరాబాద్‌లో ఓ మిలటరీ అధికారితో గొడవపడి కృత్రిమ ఎలిబీ సృష్టించుకుని తప్పించుకున్నారు. రిగ్గింగ్ కోసం డైనమైట్లు పెట్టి భయాందోళనలు సృష్టించారు. తరువాత రఘురామిరెడ్డిని, విలేకరి నారాయణను, నంద్యాపల్లి శివరామిరెడ్డిని హత్య చేయించారు. ఈ హత్యలతో పులివెందుల టౌన్‌ను తమకు సరండర్ అయ్యేలా చేసుకున్నారు.

రాజారెడ్డి హత్య కేసులో ప్రతీకారంగా పార్థసాంథి రెడ్డి వర్గీయులకు జీవిత ఖైదు పడేలా చేశారు. వారి ఇళ్లను కూల్చివేసి, మైనింగ్ లైసెన్సులను రద్దు చేసి ఆర్థికంగా కోలుకోకుండా అణిచివేశారు. 1989 -1994 మధ్య కాలంలో మంగంపేటలో జరిగిన సుమారు లక్షన్నర కోట్ల రూపాయల అక్రమ మైనింగ్‌పై విచారణ జరిపిన కేవీ నటరాజన్ కమిషన్ ఈ అక్రమాలను నిర్ధారిస్తూ రిపోర్టు ఇచ్చింది. కొడుకు జగన్ కోసం వేల కోట్లు దోచిపెట్టడానికి 'క్విడ్ ప్రో కో' అనే సరికొత్త అవినీతి పద్ధతిని ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని నిలువునా లూటీ చేశారు.

### జగన్మోహన్‌రెడ్డి -నేర సామ్రాజ్యానికి అధిపతి

తాత కత్తిని, తండ్రి అవినీతిని పుణికిపుచ్చుకున్న జగన్మోహన్ రెడ్డి, విధ్వంసకర రాజకీయాల్లో మరో అడుగు ముందుకు వేశారు. హత్యలు చేయటంలోనూ, తరువాత 100శాతం నేరాన్ని 0శాతం సాక్ష్యంతో మాయం చేయటంలోనూ జగన్ రెడ్డి నిపుణుడు. అతని డీఎన్‌ఏలోనే క్రిమినల్ మైండ్ ఉందనడానికి గత రెండు దశాబ్దాల చరిత్రే సాక్ష్యం.

చదువుకునే రోజుల్లోనే పదవ తరగతి ప్రశ్నపత్రాల దొంగతనంతో జగన్ నేర ప్రవృత్తి మొదలైంది. క్రమంగా రోడ్డుమీద దొమ్మీలు, సెప్టెంబర్ 25న సింహాద్రిపురం ఎస్ఐ ప్రకాష్‌ను పోలీస్ స్టేషన్లోనే కొట్టేస్థాయికి ఎదిగింది. తుపాకులు సరఫరా చేస్తూ నేరాలకు పాల్పడే ఎం కృష్ణను పోలీసులు అరెస్టుచేస్తే ఆయన్ను విడుదల చేయాలని పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేసిన చరిత్ర ఇతనిది. తాత రాజారెడ్డి హత్య తర్వాత జగన్ ప్రతీకారం తీర్చుకోవాలని కత్తి పట్టుకుని తిరుగుతున్నాడని, దీనివల్ల తన రాజకీయ జీవితం దెబ్బతింటుందని నాడు వైఎస్సార్ స్వయంగా కాంగ్రెస్ సీనియర్ నేత 'కాకా' (వెంకటస్వామి) వద్ద వాపోతే.. జగన్‌ను పులివెందుల పరిసరాల్లో ఉండనివ్వొద్దని, బెంగుళూరు పంపేయమని కాకా సలహా ఇచ్చారు. ఈ విషయాన్ని విజయమ్మ స్వయంగా చెప్పిందని రోశయ్యే గతంలో వెల్లడించారు.

పరిటాల రవిని అత్యంత కిరాతకంగా హత్య చేయించి ఆ కేసులో నిందితులు మొద్దు శీను, అజీజ్ రెడ్డి, మద్దెలచెరు సూరిని వరుసగా హత్యలు చేయించారు. అలాగే సొంత బాబాయిని గొడ్డలి పోటు వేసిన కేసులో నిందితులు/ సాక్షులైన కసుమూరు శ్రీనివాసరెడ్డి, డ్రైవర్ నారాయణ, గంగాధర్ రెడ్డి, తాజాగా వైఎస్ అభిషేక్ రెడ్డి (2025), వాచ్మెన్ రంగన్న (2025) వరకు సాక్షులందరినీ మాయం చేస్తూ వస్తున్నారు.

### సొంత రక్తాన్నే బలిపీఠం ఎక్కించే 'శవ రాజకీయాలు'

జగన్మోహన్ రెడ్డి రాజకీయ జీవితం మొత్తం శవాలమీద పేలాలు ఏరుకునే చందంగా సాగింది. పదవి కోసం ఆయనకు సొంత కుటుంబం, పార్టీ నాయకులు, కన్నతండ్రి, బాబాయి, చివరకు కన్నతల్లి, చెల్లి కూడా లెక్కలోకి రారు.

*తండ్రి శవం దొరకకముందే సీఎం సీటు కోసం సంతకాలు:* వైఎస్ రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో అదృశ్యమై రాష్ట్రమంతా ఆందోళనలో ఉన్నప్పుడు, జగన్ మాత్రం పొరుగు రాష్ట్రంలో ఉంటూ తన తండ్రి క్షేమంకంటే ముఖ్యమంత్రి పీఠం కోసం సంతకాలు సేకరించడంలో బిజీగా ఉన్నాడు. తండ్రి శవం దొరకకముందే సీఎం పీఠం కోసం సంతకాలు సేకరించి అధిష్టానాన్ని బెదిరించిన తీరు చూసి యావత్ ఆంధ్రప్రదేశ్ నివ్వెరపోయింది. అంతేకాదు, వైఎస్సార్ చనిపోయిన రోజే వందల కోట్ల రూపాయల పోలవరం టెండర్ డాక్యుమెంట్లు అప్‌లోడ్ కావడం గమనార్హం. వైఎస్సార్ మృతి వెనుక జగన్ హస్తముందని నాడే వైసీపీ నేత బొత్స సత్యనారాయణ బహిరంగంగా ప్రకటించారు. వాతావరణం బాగోలేదని అధికారులు చెప్పినా జగన్ మనుషులు వందలసార్లు ఫోన్లు చేసి వైఎస్సార్ ప్రయాణించేలా చేశారని బొత్స చెప్పారు.

*సొంత బాబాయి వైఎస్ వివేకా హత్య:* 2019 ఎన్నికలకు ముందు సొంత బాబాయి వైఎస్ వివేకానంద రెడ్డిని గొడ్డలితో వేటాడి చంపించి, మొదట గుండెపోటు అని నమ్మించే ప్రయత్నం చేశారు. అది బెడిసి కొట్టడంతో 'నారాసుర రక్తచరిత్ర' అంటూ ప్రత్యర్థులపై అసత్య ప్రచారాలు చేసి ఓట్లు దండుకుని తొలి లబ్ధిదారుగా నిలిచారు. అధికారంలోకి రాగానే సీబీఐ విచారణ పిటిషన్ వెనక్కి తీసుకోవడం, సుప్రీంకోర్టు ద్వారా నిందితులను కాపాడటానికి అడుగడుగునా ప్రయత్నించడం ద్వారా తానే ప్రధాన లబ్ధిదారుడని స్పష్టం చేశారు.

*అధికార దాహానికి తల్లి, చెల్లి బహిష్కరణ:* అధికారం కోసం తల్లిని, చెల్లిని రోడ్లమీద తిప్పించుకున్న జగన్‌రెడ్డి, గద్దె నెక్కాక ఆస్తుల కోసం వారిని ఇల్లు దాటించి తరిమేశారు. ఇద్దరు బిడ్డలకు ఆస్తుల్లో సమాన వాటా ఇవ్వాలని వైఎస్ఆర్ కోరినా, ధన పిశాచిగా మారిన జగన్ అందుకు నిరాకరించారు. ఆస్తి అడిగినందుకు సొంత చెల్లి షర్మిల, సునీత పుట్టుకపై సోషల్ మీడియాలో నీచంగా పోస్టులు పెట్టించి 'అన్న' అనే పదానికే కళంకంగా నిలిచారు. కన్నతల్లి రోదిస్తున్నా కనీసం కనికరం చూపని సుపుత్రుడు జగన్.

*సొంత కార్యకర్తలపై పైశాచికత్వం:* కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం, తన బినామీ లావాదేవీలకు అడ్డు వస్తున్నాడని ఏళ్ల తరబడి జెండా మోసిన కడపలోని సొంత పార్టీ నాయకుడు, నమ్మకస్తుడైన పెద్ద దస్తగిరివంటి వారిని రూ.500 కోట్లకు పైగా విలువైన ఆస్తి సెటిల్మెంట్ల కోసం నిర్దాక్షిణ్యంగా హతమార్చారు. సొంతపార్టీ కార్యకర్తని కారు కింద నిమ్మకాయ తొక్కించినట్టు తొక్కించి చంపేసిన నీచ చరిత్ర ఇతనిది. "ఉపయోగం ఉన్నంతవరకే వ్యక్తులు. తర్వాత కారు కింద నిమ్మకాయ తొక్కినట్టు తొక్కేయాలి" అనేది జగన్ క్రిమినల్ నైజం.

*వ్యవస్థలను అతలాకుతలం చేసిన తీరు:* అవినీతి కేసుల్లో అడ్డంగా, పక్కా ఆధారాలతో సహా దొరికిపోయి 16 నెలలు జైలుకు వెళ్లినప్పుడు కూడా ఇతనిలో పశ్చాత్తాపం లేదు. పైగా, "తాను జైలుకువెళ్తే రాష్ట్రం అగ్నిగుండం అవుతుంది" అంటూ ఏకంగా వ్యవస్థలనే బెదిరించాడు.

*డ్రామాలు, రాజకీయ లబ్ధి:* ఓట్ల కోసం 2018లో 'కోడి కత్తి' డ్రామా ఆడి రక్తి కట్టించి, ఎన్నికల్లో లబ్ధి పొందాడు. అధికారం వచ్చాక కోర్టుకు కూడా హాజరు కాకుండా ఒక అమాయక దళిత వ్యక్తి జీవితాన్ని బలి పెట్టాడు. అలాగే 'గులకరాయి' వంటి డ్రామాలు ఆయన దిగజారిన రాజకీయ చతురతకు నిదర్శనాలు.

"ప్రకృతిలో పాము తాను పెట్టిన గుడ్లను తానేమింగేస్తుంది. కానీ జగన్‌రెడ్డి మనస్తత్వం ఆ విషసర్పంకంటే వందరెట్లు ప్రమాదకరమైనది. పాము కేవలం ఆకలి కోసమే అలా చేస్తే, జగన్ రెడ్డి తన అపరిమితమైన ధన దాహం, అధికార వ్యామోహం కోసం సొంత తండ్రి శవాన్ని, బాబాయి ప్రాణాన్ని, చివరకు కన్నతల్లి, చెల్లెళ్ల జీవితాలను కూడా బలిపీఠం ఎక్కించాడు. ఉపయోగం ఉన్నంతవరకు వాడుకుని, తర్వాత కారు కింద నిమ్మకాయలా తొక్కేసే ఇటువంటి 'వైఎస్ బ్రాండ్ శవ రాజకీయ సంస్కృతి' ప్రజాస్వామ్యానికే ఒక అరిష్టం!"

చైతన్యరథం

# భూదందాలపై గ్రీవెన్స్‌లో భారీగా అర్జీలు

- పరిష్కారానికి కృషి చేస్తామని నేతల హామీ
- గ్రీవెన్స్‌లో రవాణా మంత్రి మండిపల్లి, బొబ్బిలి యూడీఏ ఛైర్మన్ తెంటు

మంగళగిరి (చైతన్య రథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన పౌరులు తమ సమస్యలను రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ తెంటు లక్ష్మీనాయుడు దృష్టికి తీసుకొచ్చారు. భూ ఆక్రమణలు, రెవెన్యూ అక్రమాలు, పోలీస్ నిర్లక్ష్యం సహా పలు తీవ్రమైన ఫిర్యాదులు నమోదయ్యాయి.



**వైఎస్సార్‌సీపీ నేతల అండతో 80 ఎకరాల భూదందా**

విజయనగరానికి చెందిన లియోనీ అనే మహిళ తన తల్లి సర్వీస్ బెనిఫిట్స్ డబ్బుతో తండ్రి కొనుగోలు చేసిన సుమారు 50 ఎకరాల భూమిని అక్రమంగా కాజేశారని ఆరోపించారు. 2020లో తండ్రి మరణానంతరం అతని రెండో భార్య కుమార్తెలు తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకున్నారు. విచారణ జరిపిన ఎంఆర్వో ఆ సర్టిఫికెట్‌ను రద్దు చేసినప్పటికీ, స్థానిక రియల్టర్ అప్పలరాజు వైఎస్సార్‌సీపీ నేతల రాజకీయ అండతో ఖాళీ స్టాంప్ పేపర్లపై సంతకాలు ఫోర్జరీ చేసి 50ఎకరాలను అక్రమంగా హస్తగతం చేసుకున్నారని ఆరోపించారు. ఇక్కడితో ఆగకుండా ప్రభుత్వ భూములు, పంట కాలువలు, చిన్న చెరువులను కూడా కబ్జా చేసి వీఎంఆర్‌డీఏ అనుమతులు లేకుండా 80 ఎకరాల్లో చట్టవిరుద్ధంగా లేఅవుట్ వేశారని, దాదాపు రూ.700 కోట్ల విలువైన భూమిని దోచుకోవాలని స్కెచ్ వేశారని వివరించారు.

**తాతల కాలం నాటి భూమి ఆక్రమణ**

అనంతపురం జిల్లా యల్లనూరుకు చెందిన కుళ్లాయమ్మ, తమ పేరిట రిజిస్టర్ పత్రాలు ఉన్నప్పటికీ, సర్వే నంబర్లు 164/సి, 165/సిలో ఉన్న తమ భూమిని 8 సంవత్సరాల క్రితం మాసినేని రామయ్య అనే వ్యక్తి ఆక్రమించుకోవాలని ప్రయత్నించాడని తెలిపారు. స్థానిక తహసీల్దారు లంచం తీసుకుని ఆన్‌లైన్ రికార్డుల్లో తప్పుడు వివరాలు నమోదు చేశాడని ఆరోపించారు. గత 7 సంవత్సరాలుగా మండల రెవెన్యూ కార్యాలయం, కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదని వాపోయారు.

**స్కూల్ పేరుతో భూమి కబ్జా**

కాకినాడ జిల్లా రౌతులపూడికి చెందిన జగిరెడ్డి మహాలక్ష్మి నాయుడు, తమ ఒక ఎకరం భూమిని పాఠశాల నిర్వహణకు రిజిస్టర్డ్ లీజుకు ఇచ్చినట్లు తెలిపారు. యాజమాన్యం మారిన తర్వాత లీజు చట్టబద్ధంగా రద్దుచేసుకున్నా కొత్త యాజమాన్యం ఎలాంటి ఒప్పందం లేకుండా, అద్దె కూడా చెల్లించకుండా తన స్థలంలో స్కూలు నడుపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదని తెలిపారు.

**దొంగ పట్టాలతో భూ ఆక్రమణ, దాడి**

అనంతపురం జిల్లా కంబదూరు మండలం తిమ్మాపురానికి చెందిన రత్నమ్మ, 1967లో తమ మామ గారికి ప్రభుత్వం డి-పట్టాగా ఇచ్చిన 4.84 ఎకరాల భూమిలో తమ కుటుంబం 60 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తోందని తెలిపారు. కొందరు తహసీల్దారు కార్యాలయం అధికారులతో కుమ్మక్కై సర్వే నంబర్ 450/2లో 2.42ఎకరాలకు దొంగ పట్టాలు సృష్టించారని ఆరోపించారు.ఆపట్టాలను అడ్డంపెట్టుకుని భూమిలో సగభాగం వదలాలని దౌర్జన్యం చేసి,ఎదురు తిరిగితే కర్రలు, సైకిల్ చైన్లతో తనను, తన కుమారుడిని కొట్టారని వివరించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని విన్నవించారు.

**మోసపోయిన బంగారం కేసులో పోలీస్ నిష్క్రియాపరత్వం**

గుంటూరుకు చెందిన ఉమాసాయి ప్రియ, తల్లి అనారోగ్య సాకుతో తననునమ్మించిన బెజవాడ ప్రకాశ్ అనే వ్యక్తి తన 70 గ్రాముల బంగారు నగలను బ్రాడీపేట 'కల్పన ఫైనాన్స్'లో తాకట్టు పెట్టించి పరారయ్యాడని తెలిపారు. 2025 సెప్టెంబర్‌లో కేసు నమోదైనా 8 నెలలు గడుస్తున్నా నిందితుడిని అరెస్ట్ చేయకుండా గుంటూరు నగరపాలెం పోలీసులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

**వారసత్వ ఆస్తిలో మోసానికి కుట్ర**

ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన కుమారి, తల్లిదండ్రులు లేని తనను ఆసరాగా చేసుకుని సొంత అన్నయ్య, వదిన కలిసి తండ్రి ఆస్తిని పూర్తిగా తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కుట్ర పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నయ్య పేరిట జరగబోయే అక్రమ రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలని, తండ్రి మరణ ధృవీకరణ పత్రం కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా ఫలితం లేదని విన్నవించారు.

**పట్టా బదిలీలో కార్యాలయాల నిర్లక్ష్యం**

కర్నూలుకు చెందిన సల్కాపురం నరేంద్రబాబు, బీడీ కార్మికుల గృహ స్థల పట్టా బదిలీ కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదని వివరించారు. మరణించిన తల్లి పేరిట ఉన్న ప్లాట్ నెంబర్ 108ను తన పేరిట మార్చడానికి ఒరిజినల్ పట్టా అవసరమని, అది గృహనిర్మాణశాఖ వద్ద ఉందని, ఆ శాఖ అధికారులు పట్టా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫిర్యాదులతోపాటు పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల నిర్మాణం, ఆరోగ్య సహాయం వంటి పలు సమస్యలపై కూడా అర్జీలు నమోదయ్యాయి. అర్జీలు స్వీకరించిన నేతలు సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.





# నేడు ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థ- భాగస్వాముల సదస్సు

## 'మెడ్‌టెక్ ఛాలెంజ్ గ్రాండ్' విజేతల ఎంపిక కూడా...

విజయవాడ (చైతన్య రథం): ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థ– వ్యూహాత్మక భాగస్వాముల సదస్సు, 'మెడ్ టెక్ ఛాలెంజ్ గ్రాండ్ ఫైనల్' కార్యక్రమం మంగళవారం మంగళగిరిలో జరగనుంది. ఆరోగ్య రంగంలో భిన్న కార్యకలాపాలు నిర్వహిస్తున్న అంకుర సంస్థలు, ఏజెన్సీల ముఖ్య ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, ఇతర రంగాలకు చెందిన వారు కలిపి సుమారు 300మంది సదస్సు, మెడ్ టెక్ ఛాలెంజ్ గ్రాండ్ ఫైనల్ కార్యక్రమానికి హాజరుకాబోతున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఏఐ ఆధారిత సేవలు అందించిన అంకుర సంస్థల ప్రతినిధులు తమ అనుభవాలను సదస్సులో 'డెమో' ద్వారా సభికులకు వివరించనున్నారు. మెడ్ టెక్ ఛాలెంజ్ గ్రాండ్‌లో విజేతలుగా నిలిచే అంకుర సంస్థలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నగదు పారితోషికాలు అందచేస్తారు

**4 కేటగిరీల్లో 18 అంకుర సంస్థల నూతన ఆవిష్కరణలు**

ఏపీ మెడ్ టెక్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ ప్రకటనకు అనుగుణంగా డయాగ్నస్టిక్ టూల్స్ కేటగిరి, పోర్టబుల్ పాయింట్ ఆఫ్ కేర్ కేటగిరి, స్మార్ట్ మానిటరింగ్ అండ్ వేరియబుల్స్ కేటగిరి (శరీరానికి ఉప పరికరాలు అమర్చి), రిమోట్ కేర్ టెలిమెడిసిన్ కేటగిరీల్లో 18 అంకుర సంస్థలు ప్రభుత్వాసుపత్రుల్లో తమ సేవలను అందించాయి. మొత్తం 37 రోజుల వ్యవధిలో సుమారు 15 వేలమంది రోగులకు వైద్యుల సమక్షంలో సేవలు అందించాయి. టీబీ, ఐ స్క్రీనింగ్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్, నవజాత శిశువుల్లో శ్వాస సంబంధిత సమస్యలు, గుండె సంబంధిత సమస్యలు, రోగులతో వైద్యులు ఏఐ స్క్రైబ్ ద్వారా మాట్లాడడం, వంటి కొత్త ఆవిష్కరణల ద్వారా వైద్య సేవలు అందించడంలో పోటీపడ్డాయి. రోగులకు అందిశీచిన వైద్య సేవలు వాటి ఫలితాలను క్వాఫ్ కమిటీ (కమిటీ ఫర్ అప్లైడ్ టెక్నాలజీస్ ఇన్ హెల్త్) 4 కేటగిరీల్లో ప్రోత్సాహకాల్ని అందించేందుకు సంస్థల్ని మంగళవారం ఎంపిక చేయనున్నారు. ఈ కేటగిరీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వచ్చే అంకుర సంస్థలకు (మొత్తం 12) కూటమి ప్రభుత్వం రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షల చొప్పున కలిపి మొత్తం రూ.40 లక్షలను ప్రోత్సాహకాల కింద ప్రభుత్వం ఇవ్వనుంది. కార్యక్రమం మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో జరుగనుంది. సీఎం చంద్రబాబు విజన్ అనుసరించి.. ప్రయోగాత్మక విధానంలో జరిగిన ఏఐ ఆధారిత సేవలు మంచి ఫలితాలు ఇచ్చాయి

**వైద్య సేవల్లో ఏఐ వినియోగంపై ప్రత్యేక సదస్సు**

వైద్య సేవల్లో ఏఐ వినియోగంలో బెస్ట్ ప్రాక్టీసెస్ గురించి విడిగా జరిగే సదస్సులో పలువురు నిపుణులు వివరించనున్నారు. నేషనల్ హెల్త్ అథారిటీ జాయింట్ సెక్రటరీ కిరణ్ గోపాల్ వస్క, గోవిన్ క్యాపిటల్ (సింగపూర్) ఫౌండర్ సిఇఓ డాక్టర్ ఆనంద్ గోవిందలూరి, అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా డాక్టర్ వైవియస్ ప్రభాకర్, రెడిక్స్ ఇన్ఫినిట్ (టొరంటో, కెనడా) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస సుబ్రహ్మణ్యం, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ గణేషన్ వీరపాండియన్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధరబాబు సదస్సులో పాల్గొంటారు.

చైతన్యరథం

# ఇకనైనా హత్యారాజకీయాలు ఆపండి

- సీమ ప్రజల కష్టాన్ని దోచుకున్నది వైస్ కుటుంబమే
- అధోగతి పాల్జేసిన రాష్ట్రాన్ని నిలబెట్టింది సీఎం చంద్రబాబు
- రెండేళ్లలో సాధించిన ప్రగతిని చూసి ఓర్వలేకపోతున్నారు
- మీరు ప్రెస్‌మీట్లకే పరిమితమైన 'హనీమూన్ నాయకుడు'
- 50 ఏళ్లుగా హత్యా రాజకీయాలు మీ కుటుంబ పాపమే..
- మైన్ ఓనర్ వెంకట నరసయ్యను హతమార్చింది మీ తాతే..
- అక్రమ సంపాదనకు సాక్ష్యం సందూర్ పవర్, భారతీ సిమెంట్స్, సాక్షి
- చంద్రబాబుపై నిందలు వేసే ముందు మనస్సాక్షితో ఆలోచించు..
- వైఎస్ జగన్‌పై విరుచుకుపడిన మంత్రి మండిపల్లి



మంగళగిరి (చైతన్య రథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి నేతృత్వంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల సుభిక్షపాలన పూర్తి చేసు కుంటున్న తరుణంలో రాష్ట్ర ప్రలజకు రాష్ట్ర రవాణా, యువజన సంక్షేమ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భారత దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీకి దక్కని అఖండ గౌరవాన్ని, బాధ్యతను రాష్ట్ర ప్రజలు తమకు కట్టబెట్టా రని, దానికి తగ్గట్టుగానే రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నామన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఖరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "వైసీపీ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కేవలం 24 నెలల్లోనే మళ్లీ గాడిన పెట్టారన్నారు. సుమారు రూ.20లక్షల కోట్ల పెట్టుబడులు సాధించి.. యువత ఉపాధికి కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందన్నారు. "రాష్ట్రంలో తప్ప ఎక్కడాలేని విచిత్రమైన ప్రతిపక్ష నేత మనకున్నా రు. ఆయనను 'హనీమూన్ నాయకుడు' అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. గత 24 నెలల్లో ఆయన కేవలం 10నుంచి 15సార్లు మాత్రమే ప్రెస్‌మీట్లు పెట్టారు. ఎప్పుడు బయటికొచ్చినా, గత 40ఏళ్ల నాటి పాత విషయాలను ప్రజలపై రుద్దడమే పనిగా పెట్టు కున్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని జగన్ ఓర్వలేకపోవడమే దీనికి కారణం" అని విమర్శించారు. "నాలుగు రోజుల క్రితం లండన్ టూర్ ముగించుకుని రాగానే జగన్ ప్రెస్‌మీట్ పెట్టా రు. అందులో 'మా తాతను, మా తండ్రిని, మా చిన్నా న్నను చంపింది ఎవరో మీకుతెలుసా?'అంటూ చంద్ర బాబుపై బురదజల్లే ప్రయత్నం చేశారు. చంద్రబాబు శాంతికాముకుడని, నేరాలకు ఆమడదూరంలో ఉంటారని తెలుగు ప్రజలకు తెలుసు. ఆయనకు అభివృద్ధి, ప్రజా సంక్షేమం తప్ప మరొకటి తెలీదు కనుకే, ప్రజలు నాలుగోసారి ఆయనను సీఎంని చేశారు. గతంలో జరిగిన హత్యలకు, తెలుగుదేశం పార్టీకి ఏం సంబంధమని సూటిగా అడుగుతున్నాను" అని మంత్రి దుయ్యబట్టారు.

"బలపనూరు నుంచి ప్రస్థానం మొదలుపెట్టి మీ తండ్రి, మీరు రాష్ట్రానికి సీఎంలయ్యారు. ఆనాటి మీ ఆర్థిక పరిస్థితి ఏంటి? ఈ రోజు ఏంటి? లక్షల కోట్లు ఎక్కడినుంచి వచ్చాయి? ప్రపంచంలో మీరు పెట్టు బడులు పెట్టని రంగం,వ్యాపారం చేయని దేశమేదైనా ఉందా? గత 50ఏళ్లుగా రాష్ట్రంలో హత్యా రాజకీయా లను ప్రవేశపెట్టి, దానికి నాయకత్వం వహించిన ఘనత ఆ రోజు మీ తాతనుంచి ఈరోజు మీ వరకు మీ కుటుంబానిది కాదా? కడప ఉమ్మడి జిల్లాలోని కోడూరు నియోజకవర్గం మంగంపేటలో లభించే అమూల్యమైన ఖనిజం బైరటీస్ (ముగ్గురాయి). ఈ మైన్స్ గత 40-45ఏళ్లుగా నడుస్తున్నాయి. మీ సొంత ఊరైన పులివెందులనుంచి కోడూరు నియోజకవర్గానికి వలస వచ్చిన మీ తాత.. అక్కడ వెంకట నరసయ్య అనే మైన్ ఓనర్ దగ్గర పని చేస్తూ, మైన్‌ను లీజుకు తీసుకున్నారు.తర్వాత అదే వెంకట నరసయ్యను హత మార్చి, మైన్‌ను అక్రమంగా దక్కించుకున్న చరిత్ర మీ తాతది కాదా? అక్కడనుంచే మీ కుటుంబం రాజకీ యంగా, ఆర్థికంగా ఎదగడం మొదలైంది. 1978లో 7.5 ఎకరాల మైన్‌ను మీ తల్లి పేరిట 'విజయలక్ష్మి మినరల్స్ ట్రేడింగ్ కంపెనీ'గా మార్చి మైనింగ్ ప్రారం భించారు. మీకు కేటాయించింది 7.5 ఎకరాలైతే.. చుట్టుపక్కల ఉన్న ప్రైవేట్ భూములను అక్రమంగా తవ్వేశారు. ఆ రోజు మీ తండ్రి కాంగ్రెస్ పార్టీలో ఎంపీగా ఉన్నారు. నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి హయాంలో దీనిపై తీవ్ర చర్చ జరగడంతో, నాటి ఎమ్మెల్యేలు శేషశయనారెడ్డి, బైరెడ్డి నాయకత్వం లో 13మంది సభ్యులతో 'హౌస్ కమిటీ' వేశారు. ఆ హౌస్‌కమిటీ అసెంబ్లీసాక్షిగా ఇచ్చిన నివేదికలో వైఎస్ కుటుంబం చేసిన తప్పులు బహిర్గతమయ్యాయి. విజ యలక్ష్మి మినరల్స్ పేరుతో 25వేల టన్నుల ముగ్గు రాయిని అక్రమంగా తరలించారని, దీనివల్ల ప్రభుత్వా నికి రూ.24,21,2500 నష్టం వాటిల్లిందని హౌస్ కమిటీ స్పష్టంగా తేల్చింది. ఆ నష్టాన్ని మీరే కట్టాలని నివేదిక ఇస్తే.. మీ అధికార బలంతో ఆరోజు దాన్ని ఎలా రూట్ మార్చారో పాతతరం రాజకీయ నేతలంద రికీ తెలుసు. అక్రమ మైనింగ్ ద్వారా దోచుకున్న ఆ డబ్బునంతా మీరు రాజకీయాల్లో పెట్టారు. రాజకీయా లను ఒక అడ్డాగా మార్చుకున్నారు. ఆ రోజు చిన్న మొక్కలా ప్రారంభమైన 'విజయలక్ష్మి మినరల్స్'అక్రమ సంపాదనతోనే.. ఈ రోజు సందూర్ పవర్ ప్రాజెక్ట్, భారతీ సిమెంట్స్, సాక్షి పేపర్‌వంటి సంస్థలు మహా వృక్షాలుగా మారి,మీఆర్థిక ఎదుగుదలకు తోడ్పడ్డాయి. మీ అక్రమాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవస రం లేదు. రాష్ట్రంలో హత్యా రాజకీయాలను ప్రోత్స హించాలన్నా,అక్రమ లావాదేవీలు నడపాలన్నా,అక్రమ మైనింగ్‌కు పాల్పడాలన్నా..అది మీ ఇల్లు, మీ కుటుం బం నుంచే మొదలవుతుంది. మాకు మీమీదకానీ, వైఎస్సార్సీపీ మీదకానీ ఎలాంటి వ్యక్తిగత కక్ష లేదు. రాష్ట్రంలో అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన మీ కుటుంబ చరిత్రను ప్రజల ముందు ఉంచడమే మా బాధ్యత" అని మంత్రి మండిపల్లి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

సీఎం చంద్రబాబు నేతృత్వంలోకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ వేగంగా అభివృద్ధి పథంలో పరిగెడుతోందని మంత్రి మండిపల్లి స్పష్టం చేశారు. నాలుగో పర్యాయం సీఎంగా ప్రమాణ స్వీకా రం చేసిన రోజున చంద్రబాబు ప్రజలకిచ్చిన మాట ప్రకారం..రాష్ట్రాన్ని ప్రగతివైపు నడిపిస్తూ,దేశం గర్విం చేలా సుపరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు అద్భుతమైన పనితీరును మెచ్చి ప్రధాని మోదీ అత్యంత గౌరవం ఇస్తుంటే.. కేంద్రం మద్దతు ను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయి. ప్రస్తుతం ఏపీలో పెట్టుబడుల జైత్రయాత్ర సాగుతోంది. ఇప్ప టికే రాష్ట్రంలో సుమారు రూ.20లక్షల కోట్ల పెట్టు బడులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో యువత భవి ష్యత్తును మార్చడమే లక్ష్యంగా, వారికి భారీగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చంద్రబాబు, లోకేష్ అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. మండుటెండలను లెక్కచేయకుండా.. సీఎం చంద్రబాబు నేరుగా ప్రజల్లో కెళ్లి సమస్యలు పరిష్కరిస్తున్నారు. ప్రజారోగ్యం కోసం దేశంలోనే ఎక్కడాలేనివిధంగా 'సంజీవిని' ప్రవేశపెట్టిన ఘనత చంద్రబాబుదే"నని మంత్రి మండిపల్లి పేర్కొన్నారు.

గత వైఎస్సార్సీపీ హయాంలో ఆర్థిక నేరగాళ్ల అరా చకాలు భరించలేక బడా కంపెనీలు,సంస్థలు రాష్ట్రాన్ని వదిలేశాయి. కూటమి పాలనలో రాష్ట్రాన్ని వెతుక్కుం టూ రాని పెట్టుబడిదారుడు,వ్యాపారవేత్త లేరు. చంద్ర బాబు పేరుకున్న 'బ్రాండ్ ఇమేజ్' అలాంటిది. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' కాన్సెప్ట్‌తో చంద్రబాబు పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతోంది. గతంలో హైదరా బాద్‌ను అభివృద్ధి చేసి, దానికి గ్లోబల్ బ్రాండ్ తెచ్చిన ఘనత చంద్రబాబుదే. అదే నమ్మకంతో ఈరోజు అమ రావతిలో పెట్టుబడుల వరద పారుతోంది. అమరావతి విషయంలో ప్రజలకిచ్చిన ప్రతి ఒక్క హామీనీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుంది. ఇప్పుడు -జగన్‌రెడ్డి ఒక చెల్లని రూపాయి. అతని మాటలను నమ్మే స్థితిలో ఏపీ ప్రజలు లేరు. రెండు మూడు నెలలకోసారి సంక్షేమ ప్రభుత్వంపై బురద జల్లడం జగన్‌కే నష్టం తప్ప ప్రజలకు జరిగేదేమీ లేదు. రెండేళ్లలోనే సుభిక్ష మైన పాలనను అందించిన ముఖ్యమంత్రి విమర్శించే అర్హత జగన్‌కు లేదు" అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తేల్చిచెప్పారు. "రాష్ట్రంలో ఒకపక్క చంద్రబాబు, మరోపక్క లోకేష్, ఇంకోపక్క పవన్ కళ్యాణ్.. ముగ్గురు నేతలను తట్టుకునే శక్తి జగన్‌కు లేదు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రజాధనంతో ఆడంబరాలు చేసిన జగన్.. ఇప్పుడు తాడేపల్లిలో రెండు రోజులు రివ్యూ మీటింగ్ పెట్టి మళ్లీ బెంగళూరు పారిపోతున్నారు. జగన్‌కి ఒకటే హితబోధ చేస్తున్నా. ఇప్పటికైనా చిత్తశుద్ధితో ప్రతిపక్ష పాత్ర పోషించండి. మీకున్న 11మంది సభ్యులతో అసెంబ్లీకి రండి. మైక్ ఇచ్చేందుకు మా ప్రభుత్వం సిద్ధం. అక్కడకు వచ్చి ప్రభుత్వానికి మంచి సలహాలివ్వండి. అంతేగానీ, అసెంబ్లీకి రాకుండా కేవలం 20 నిమిషాల ప్రెస్‌మీట్ పెట్టి, గతాన్నంతా తవ్వుతూ అవాకులు చవాకులు పేలితే మీకే నష్టం. ప్రతిపక్షాల హక్కులను కాలరాసే ఉద్దేశం కూటమికి లేదు" అని మంత్రి స్పష్టం చేశారు.

"గత నెలలో కడప జిల్లాలో వైఎస్సార్సీపీ కార్యకర్త దస్తగిరి హత్యకు గురయ్యాడు. నేనూ ఆ ప్రాంతానికి చెందినవాడినే. దస్తగిరి.. కమలాపురం మాజీ ఎమ్మెల్యే, జగన్‌రెడ్డి మామ రవీంద్రనాథ్ రెడ్డికి ప్రధాన అనుచరుడు. చాలా విషయాల్లో అతనికి బినామీ. హత్యకు గురవ్వడానికి ముందే దస్తగిరికి, రవీంద్రనాథ్‌రెడ్డికి మధ్య ఆస్తి లావాదేవీల వివాదాలు ఉన్నాయనేది పచ్చి నిజం. దీనిపై నేను గతంలో మాట్లాడితే.. ఒక మాజీ ఎమ్మెల్యే, ఒక మాజీ మంత్రి ద్వారా కోర్టుల చుట్టూ తిప్పుతూ లీగల్ నోటీసులు పంపారు. మీరిచ్చే లీగల్ నోటీసులకు, కోర్టులకు భయపడి మాట్లాడకుండా ఉంటామనుకుంటే అది మీ భ్రమ. మీరు ప్రతిపక్షంలో ఉంటూ ఇంకా హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారు. వాటిని ప్రజల దృష్టికి తెచ్చేందుకు ఎప్పుడూ వెనకాడం. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రాన్ని సుభిక్షంగా ముందుకు తీసుకెళ్తాం. యువగళం సారథి లోకేష్.. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకురావడానికి రథసారధిగా ముందుండి నడిపిస్తారు. జగన్ అండ్ టీమ్ ధైర్యముంటే.. ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామని మంత్రి సవాల్ విసిరారు.

జగన్‌రెడ్డీ.. మీ చిన్నాన్న (వైఎస్ వివేకానంద రెడ్డి) హత్యపై ఇప్పటికీ సీబీఐలాంటి అత్యున్నత దర్యాప్తు సంస్థ విచారణ జరుపుతోంది. అలాంటప్పుడు కనీస హుందాతనం లేకుండా, మీ తాత మరణానికి, మీ తండ్రి (వైఎస్సార్) మరణానికి, మొన్న మీ చిన్నాన్న మరణానికి మా నాయకుడు చంద్రబాబు ఎలా కారణమవుతారో మనస్సాక్షితో ఆలోచించుకోండి. నేనూ కడప ప్రాంతం నుంచి గెలిచిన ఎమ్మెల్యేనే. గతంలో మీతో కలిసి చాలా ఏళ్లు ప్రయాణం చేశాను. అందుకే చెబుతున్నాను.. చంద్రబాబులాంటి పెద్ద మనిషిపై నిందలు వేసేటప్పుడు పూర్వాపరాలు ఆలోచించి, ఇంగితంతో మాట్లాడాలి" అని హితవు పలికారు.

తెలుగుదేశం ఏటా నిర్వహించే 'మహానాడు' కేవలం పార్టీ కార్యక్రమం కాదు. యావత్ తెలుగు జాతి జరుపుకునే పెద్ద పండుగ. అలాంటి పండుగ రోజున కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యాలంటూ జగన్మోహన్ రెడ్డి కౌంటర్ మీటింగ్‌లు పెట్టాలని చూడటం హాస్యాస్పదం. 'ఊళ్లో పెళ్లికి ఎవరికో సంబరం' అన్నట్లుంది జగన్ తీరు. మహానాడులాంటి ఇంత పెద్ద పండుగకు యావత్ తెలుగు జాతి కదిలివస్తుంటే.. జగన్మోహన్ రెడ్డి అపోజిట్‌గా అరగంట ప్రెస్‌మీట్ పెట్టి ఏదో చెడగొట్టాలని చూస్తున్నారు. ఆయన ఏంచేసినా మాకు అది ఒక 'దిష్టి చుక్క' లాంటిదే తప్ప, ఎవరికీ భయపడే ప్రసక్తే లేదు. భారతదేశ చరిత్రలోనే ఏ ప్రాంతీయ పార్టీకిలేని విధంగా కోటి 20 లక్షల మంది క్రమశిక్షణ కలిగిన సభ్యులు, సైనికులు ఉన్న ఏకైక పార్టీ తెలుగుదేశం. మా సంబరాన్ని, మా పండుగను ఆపడం ఎవరి తరం కాదు. జగన్ అండ్ టీమ్ ఏం చేసినా మేము స్వాగతిస్తాం. ప్రజలే వారికి బుద్ధి చెబుతారు" అని మంత్రి మండిపల్లి స్పష్టం చేశారు.

## ఎక్సైజ్ విధానాలపై మంత్రివర్గ ఉపసంఘం సమీక్ష

**మద్యం విధానం, బీరు సరఫరాపై కీలక చర్చలు - ఎక్సైజ్ రంగ సంస్కరణలపై లోతైన చర్చ**




అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన కీలక విధానాలు, ఆదాయ వృద్ధి చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై సోమవారం మిశ్రిత విధానంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎక్సైజ్, గనుల మంత్రి కొల్లు రవీంద్ర, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, కమిషనర్ చామకూరి శ్రీధర్, ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఆరోగ్య మంత్రి సత్య కుమార్‌యాదవ్, విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దూర మాధ్యమం ద్వారా సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో అమలులో ఉన్న ఎక్సైజ్ విక్రయ విధానం, దాని అమలు తీరుపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. లైసెన్స్ రుసుముల సవరణ, మద్యం దుకాణాల పునర్విభజన, వ్యాపారుల ఆర్థిక స్థిరత్వం, పారదర్శకత పెంపు వంటి అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాల వారీగా విక్రయాలు, ఆదాయం, మార్కెట్ పరిస్థితులపై కూడా సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధ ప్రభావం కారణంగా ముడి సరుకులు, రవాణా, ప్యాకేజింగ్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో బీరు, మద్యం ధరల సవరణ అంశాన్ని సమావేశంలో పరిశీలించారు. ధరల మార్పులతో ప్రభుత్వ ఆదాయం, వ్యాపారులు, వినియోగదారులపై పడే ప్రభావంపై అధికారులు వివరించారు. రాష్ట్రంలో బీరు సరఫరా సామర్థ్యాన్ని పెంచేందుకు తయారీ సంస్థలకు ప్రోత్సాహకాలు ఇవ్వడం, ఎగుమతులకు అనుమతులు కల్పించడం, అధిక డిమాండ్ ఉన్న కాలాల్లో తాత్కాలిక చర్యలు చేపట్టడంవంటి అంశాలపైనా చర్చ జరిగింది. కొత్త పెట్టుబడులను ఆకర్షించే చర్యలపై అధికారులు వివరణ ఇచ్చారు. అదేవిధంగా విమానాశ్రయాల్లో మద్యం విక్రయ కేంద్రాల ఏర్పాటు, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ బలోపేతం, చలనం ఆధారిత గరిష్ఠ చిల్లర ధర ముద్రణ, అధిక శుద్ధి ఆల్కహాల్ తయారీకి ప్రత్యేక అనుమతి విధానంవంటి అంశాలను సమావేశంలో సమీక్షించారు. రాష్ట్రంలో పారదర్శకత పెంపు, ఆదాయవృద్ధి, ఆధునికీకరణ, పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా ఈ సంస్కరణలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.

## ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేస్తాం : ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే అదితి గజపతి



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా విజయనగరం శాసనసభ్యురాలు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, జిల్లా కలెక్టర్. రామ్ సుందర్ రెడ్డితో కలిసి సోమవారం విజయనగరం నియోజకవర్గం, విజయనగరం మండలం, కొండకరకం గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజయవాడలో నిర్వహిస్తున్న "MSME గ్రోత్ సమ్మిట్-2026" వేదికగా వర్చువల్ పద్ధతిలో కొండకరకం MSME PARK శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులతో పాటు, విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షులు సాగి రాజేష్ వర్మ, కూటమి ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి విజనరీతో స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ప్రతి ఇంటా ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే ప్రభుత్వ సంకల్పంతో ఈ మెగా ఈవెంట్ రూపుదిద్దుకుందని, రాష్ట్రవ్యాప్తంగా పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడానికి, 'ప్లగ్ అండ్ ప్లే' మౌలిక వసతులతో కూడిన 38 నూతన MSME పార్కులకు శ్రీకారం చుట్టడం హర్షనీయమని,' వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్' నినాదంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ బృహత్తర ప్రణాళికలో భాగంగా ఈ పార్కులు వస్తున్నాయని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సీఎం, మనందరి లక్ష్యం స్వర్ణాంధ్ర-2047లో భాగస్వాములు కావాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు.

## డిజిటల్ మహానాడు ఏర్పాట్లపై క్లస్టర్ ఇంచార్జులతో సమీక్ష నిర్వహించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అంకెం ఇందిరా



దెందులూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని పొదుపు చర్యల్లో భాగంగా ఈ సంవత్సరం డిజిటల్ విధానంలో నిర్వహిస్తుండగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశానుసారం దెందులూరు నియోజకవర్గ శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ సూచనలతో సోమవారం ఉదయం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, దెందులూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకరాలు అంకెం ఇందిరా ప్రియదర్శిని నియోజకవర్గ పరిధిలోని 6 క్లస్టర్లల ఇంచార్జీలతో సమావేశం నిర్వహించి ఈనెల 27, 28 తేదీల్లో వర్చువల్‌గా జరిగే మహానాడుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆరా తీసి, క్లస్టర్ ఇన్‌ఛార్జులకు తగు సూచనలు చేశారు. సమన్వయంతో పనిచేసే ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్త ఈ మహానాడు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసేలా కృషి చేయాలని కోరారు.

## నాణ్యమైన విద్య, అందరికీ వైద్యం అందితేనే దేశం శక్తివంతంగా మారుతుంది : యార్లగడ్డ

న్యూ ఢిల్లీ (చైతన్యరథం): దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్ గుల్మోహర్ హాల్‌లో నేషన్ ఫస్ట్ పాలసీ రీసెర్చ్ అండ్ చేంజ్ (ఛీఫ్రీ=జ) ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం 'వికసిత్ భారత్ ఏ2047లో భాగంగా ఆరోగ్య మరియు విద్యా సంస్కరణల పురోగతి' అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని ప్రసంగించారు. భారతీయులు తమ మేధస్సు, పారిశ్రామిక నైపుణ్యంతో ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నాణ్యమైన విద్య, అందరికీ అందుబాటులో ఉండే వైద్యం కలిసి ఉన్నప్పుడే దేశం శక్తివంతంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో 12వ తరగతి వరకు ఉచిత విద్య అందిస్తున్న విధానాలను ఉదహరిస్తూ, భారతదేశంలో కూడా ఉత్తమ అంతర్జాతీయ విధానాలను అమలు చేయాలని సూచించారు. విద్యా, ఆరోగ్య రంగాలకు బడ్జెట్ కేటాయింపులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇప్పటికీ పాత విధానాల ప్రకారమే కొనసాగుతున్నాయని, నేటి జనాభా అవసరాలకు అనుగుణంగా వాటిని పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక ఆరోగ్య కేంద్రాల్లో తగిన సిబ్బంది, మందులు, వైద్య పరికరాలు, అత్యవసర సేవలు లేకపోవడం ఆందోళనకరమన్నారు. గ్రామ స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకు సంస్కరణలు అమలు చేసినప్పుడే నిజమైన 'వికసిత్ భారత్' సాధ్యమవుతుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యేలు డా. ఉగ్ర నరసింహారెడ్డి, ఈశ్వరరావు, శిరీష దేవి, డా. విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, జాతీయ విద్యా విధానం--2020 వంటి అంశాలపై విస్తృత స్థాయిలో చర్చలు జరిగాయి.

## స్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో మంత్రి నిమ్మల శ్రమదానం

### ●లంకలకోడేరు, భగ్గేశ్వరం స్మశాన వాటికల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



పాలకొల్లు (చైతన్యరథం): పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామంలో స్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో రాష్ట్ర జలవనుర్ల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శ్రమదానం చేశారు. పాలకొల్లు మండలం భగ్గేశ్వరం, లంకలకోడేరు గ్రామాల్లో రూ.65 లక్షలతో స్మశాన వాటికల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లంకలకోడేరులో స్మశాన వాటిక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి గ్రామస్తులతో కలిసి శ్రమదాన పనుల్లో పాల్గొన్నారు. అపరిశుభ్రంగా ఉన్న స్మశాన వాటిక ప్రదేశాన్ని శుభ్రపరిచే కార్యక్రమంలో భాగంగా పిచ్చి మొక్కలు, వృక్షాలను, చెత్తాచెదారంను తొలగించారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంలో అన్ని స్మశాన వాటికలను దశలవారీగా ఆరోగ్యకర సుందరీ కరణ ప్రదేశాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో పాలకొల్లు పట్టణంలోని హిందూ స్మశాన వాటికను ఆహ్లాదకర, ఆరోగ్యకరమైన కైలాస వనంను పార్క్ తరహాలో తీర్చిదిద్దామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అయిదు నెలల క్రితం స్మశాన వాటికలను అభివృద్ధి పరచాలని, అందులో భాగంగా కొన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ప్రతి మనిషికి పుట్టుక ఎంత ముఖ్యమో చనిపోయిన తర్వాత చివరి మజిలీ కూడా అంతేనన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. స్మశాన వాటికలను పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దడం ప్రభుత్వ లక్ష్యమని, ఇదే సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా పలు సంస్థలు ఏజెన్సీల నుంచి సిఎస్‌ఆర్ నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పరుస్తున్నామన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గొడ్డలి పార్టీ భూతాన్ని భూస్థాపితం చేస్తేనే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. సేవతో ముడిపడి ఉన్న రాజకీయాల్లో కొనసాగటానికి వైకాపా గొడ్డలి పార్టీకి అర్హత లేదన్నారు. ఐదేళ్ల వైకాపా అరాచక పాలనలో.. రాష్ట్రం అధోగతి పాలు అయి ప్రగతి పాతికేళ్లు వెనక్కి పోయిందన్నారు. గత పాలనలో సంపద సృష్టి లేకపోగా ఉన్న సంపద ఆవిరి అయిపోయి రాష్ట్ర అప్పుల పాలైపోయిందన్నారు. ప్రభుత్వాస్తులు తాకట్టు పెట్టి ప్రైవేట్ ఆస్తులు లాగేసుకోవడమే గత పాలన విధానమని మంత్రి నిమ్మల తెలిపారు.

## లేబర్ అడ్డాలతో ఏపీలో నూతన ఆధ్యాయం




అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నిర్మాణంలో వెన్నెముకలా నిలిచే సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో విప్లవాత్మక అడుగులు వేసింది. కుదేలైన నిర్మాణ రంగాన్ని, కార్మిక వ్యవస్థలను ముఖ్యమంత్రి చంద్రబాబు తన దార్శనికతతో పునరుద్ధరించారు. కార్మికులకు నైపుణ్య శిక్షణ (Skill Upgrade) ఇప్పించడంతో పాటు, సమాజంలో వారి గౌరవాన్ని పెంచేలా లేబర్ అడ్డాల నిర్మాణం, వైద్య సంరక్షణ కోసం సరికొత్త ఈఎస్‌ఐ ఆసుపత్రుల ఏర్పాటు వంటి చర్యలతో కూటమి ప్రభుత్వం కార్మికులకు కొండంత అండగా నిలిచింది.

**మౌలిక వసతులతో 'లేబర్ అడ్డాల' ఏర్పాటు**

ఉపాధి కోసం కూడళ్లలో ఎండనక, వాననక నిలబడే దినసరి కూలీల కష్టాలకు పరిష్కారంగా విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు వంటి నగరాలతో పాటు ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో ఆధునిక లేబర్ అమెనిటీస్ సెంటర్స్ (లేబర్ అడ్డాల) ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ కేంద్రాల ద్వారా కార్మికులకు స్వచ్ఛమైన తాగునీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లతో పాటు ఉద్యోగ సమాచారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను అందిస్తున్నారు. పని లేని సమయాల్లో కార్మికులకు అనుభవంతో పాటు టెక్నాలజీని జోడించి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు. నిలిచిన సంక్షేమ పథకాలకు పునరుజ్జీవం

రాష్ట్రంలోని 88 లక్షల మంది అసంఘటిత కార్మికులు, అందులోని 18 లక్షల భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు ధీమా కల్పిస్తూ గతంలో నిలిచిపోయిన పథకాలను ప్రభుత్వం పునరుద్ధరించింది. ప్రస్తుతం కార్మిక కుటుంబాలకు ప్రసూతి సహాయం కింద రూ.20 వేలు, వివాహ కానుకగా రూ. 40 వేలు, సహజ లేదా ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ. 20 వేల తక్షణ సహాయంతో పాటు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.60 వేలు అందిస్తూ ఉచిత వైద్య పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు.

## జగన్ పగటి కలలు కంటున్నాడు : ధూళిపాళ్ల



పొన్నూరు (చైతన్యరథం): వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కులాల మధ్య చిచ్చుపెట్టడమే జగన్ అండ్ కో పని అని ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో బడుగువర్గాలపై దాడులు చేశారని ఆరోపించారు. సోమవారం గుంటూరు జిల్లాలో ధూళిపాళ్ల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజావ్యతిరేక చర్యలతోనే వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారని దుయ్యబట్టారు. వైసీపీ నేతల్లో మార్పు రాలేదు.. ప్రజల తీర్పు చూసిన తర్వాత కూడా వైసీపీ నేతల్లో మార్పు రాలేదని ఎమ్మెల్యే ధూళిపాళ్ల ఫైర్ అయ్యారు. వివాదాలు సృష్టించి యువతను పలు కేసుల్లో ఇరికిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ అండ్ కో మళ్లీ అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేశారని ఆరోపించారు. జడ్జిలు, వాళ్ల కుటుంబసభ్యులపైనా కూడా దుష్ప్రచారం చేశారని ఆగ్రహించారు. జగన్ అండ్ కో మాట వినలేదని అనేకమందిని హత్య చేశారని ఆరోపించారు. ప్రజలు అధికారం ఇవ్వలేదనే అక్కసుతోనే ఈ దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడికి వెళ్లినా డ్రామాలు ఆడటమే వైసీపీ నేతలు పనిగా పెట్టుకున్నారని సెటైర్లు గుప్పించారు.

**ప్రభుత్వాలపై ఆధారపడి మేము వ్యాపారం చేయట్లేదు..**

మొక్కజొన్న రైతన్నలకు న్యాయం చేయాలని అడిగితే తప్పు లేదని.. కానీ రైతుల పేరుతో దీక్ష పెట్టి తనపై, సంగం డెయిరీపై వైసీపీ నేతలు విమర్శలు చేశారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దుయ్యబట్టారు. గత 15 ఏళ్లుగా డెయిరీ అవసరాల కోసం మొక్కజొన్న కొంటున్నామని ప్రస్తావించారు. ప్రభుత్వాలపై ఆధారపడి తాము వ్యాపారం చేయటం లేదని స్పష్టం చేశారు. మొక్కజొన్న కొనాలంటే కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అన్నారు. మొక్కజొన్న త్వరగా కొనాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారని చెప్పుకొచ్చారు. జగన్ రాజకీయ లబ్ధి కోసం అన్నదాతలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. మహిళలను రోడ్లపైకి రెచ్చగొట్టి పంపించి వారిపై కేసులకు కారణం అయ్యారని అన్నారు. అంబటి మురళి తన రాజకీయ అవసరాల కోసం మహిళలను రెచ్చగొడుతున్నారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రోహిణి నక్షత్రంలోకి సూర్యుడు... రోళ్లు పగిలే ఎండలు

**● రెండు తెలుగు రాష్ట్రాల్లో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు... పెరిగిన వడగాల్పుల తీవ్రత**

తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలు మరింత పెరగనున్నాయి. ఎండాకాలంలో అత్యంత తీవ్ర వేడి ఉండే రోహిణి కార్తె సోమవారం నుంచి ప్రారంభమైంది. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం సూర్యుడు రోహిణి నక్షత్రంలోకి ప్రవేశించడంతో జూన్ 8 వరకు భరించలేని ఎండలు, ఉక్కపోత ఉండే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే ఏపీ, తెలంగాణలో పలుచోట్ల ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలు దాటగా.. రోహిణి కార్తె ప్రభావంతో మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయంటారు. ఎండాకాలంలో అత్యంత భయంకరమైన ఎండలు ఉండేది ఇప్పుడే. ఈ సమయంలోనే భరించలేని ఉక్కబోత, తట్టుకోలేని ఎండలు ఉంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఎండాకాలంలో హయ్యెస్ట్ హీట్ ఇప్పుడే ఉంటుంది. అలాంటి డేంజర్ రోహిణి కార్తె.. సోమవారం నుంచే ప్రారంభమైంది. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం.. సూర్యుడు సోమవారం రోహిణి నక్షత్రంలోకి ప్రవేశించినప్పుడు... జూన్ 8వ తేదీ వరకు అక్కడే ఉంటాడు. ఈ పక్షం రోజులు ఎండలు తీవ్రంగా ఉంటాయి. వేసవి కాలంలో వచ్చే వేడి గాలులు ఒక ఎత్తు అయితే.. రోహిణి కార్తె సమయంలో మాత్రం మరింత ఎక్కువగాఉంటాయి.. ఈ కాలంలో సూర్య భగవానుడు భగ భగ మండిపోతూ ఉంటాడని పేర్కొంటారు. ఈ పక్షం రోజుల్లో సూర్యుడి తీవ్రత తీవ్ర స్థాయికి చేరుకుని, కొద్ది కొద్దిగా తగ్గుతూ వస్తుందని పేర్కొంటున్నారు. వాస్తవానికి తెలుగు రాష్ట్రాల్లో ఎండలు అగ్నిగుండాన్ని తలపిస్తున్నాయి. ఇంటి నుంచి అడుగు బయటపెట్టాలంటేనే భయపడేలా భానుడి భగభగలు భయపెడుతున్నాయి. చాలాచోట్ల ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలు దాటేసి.. 49, 50 డిగ్రీల వైపు దూసుకెళ్తున్నాయి. మరి, ఇప్పుడు రోహిణి కార్తెతో.. ఆ రికార్డు రీచ్ అయిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. పొద్దున్నే తొమ్మిది గంటల నుంచి భాస్కరుడు తన వేడి సెగలను భూమిపైకి విసురుతున్నాడు. మధ్యాహ్నానికి ఎంత తీవ్రత మరింత పెరుగుతుంది.. ఎండ తీవ్రతతో జనం పిట్టల్లా రాలిపోతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే పదుల సంఖ్యలో జనం వడదెబ్బతో చనిపోయారు.



అయితే.. వచ్చే వారం కూడా ఎంత తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ పేర్కొంది.

ఏపీలో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చాలాచోట్ల టెంపరేచర్స్ 48 డిగ్రీలు దాటేశాయి. తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో అత్యధికంగా 48.3 డిగ్రీలు నమోదైంది. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో.. అలాగే పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 48.1 డిగ్రీలు రికార్డైంది. 17 జిల్లాల్లోని 174 మండలాల్లో 44 డిగ్రీలు దాటాయి. మరో నాలుగైదు రోజులు తీవ్రస్థాయిలో ఎండలు, వడగాలులు తెలంగాణలో అత్యధికంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దాదాపు అన్ని ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

# రాజమహేంద్రవరంలో డిజిటల్ మహానాడుకు నగరం సిద్ధం

**●12 కేంద్రాల్లో ఏర్పాట్లు.. నాయకులు... కార్యకర్తల సమన్వయంపై సమీక్ష**

రాజమహేంద్రవరం (చైతన్యరథం): తెలుగుదేశంపార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న "డిజిటల్ మహానాడు--2026" విజయవంతానికి రాజమహేంద్రవరం నగరం సిద్ధమవుతోంది. ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న డిజిటల్ మహానాడుకు సంబంధించి తిలక్ రోడ్డులోని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇన్చార్జు, పార్టీ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకట రమణ చౌదరి హాజరై మహానాడు నిర్వహణకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా పార్టీ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ నిర్వహిస్తున్న డిజిటల్ మహానాడును ప్రతి కార్యకర్తకు చేరువ చేయాలనే లక్ష్యంతో నగరంలోని 12 ప్రాంతాల్లో ప్రత్యేక డిజిటల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ప్రసారం కానున్న మహానాడు కార్యక్రమాలను కార్యకర్తలు, అభిమానులు ప్రత్యక్షంగా వీక్షించేలా భారీ ఎల్ఈడీ స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్స్, ఇంటర్నెట్ సదుపాయాలు, తాగునీరు, కుర్చునే ఏర్పాట్లు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్లస్టర్ వారీగా సమన్వయ బాధ్యతలు అప్పగించారు. అలాగే మహానాడు సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేలా సోషల్ మీడియా ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న ఈ మహానాడు పార్టీ



చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... "ప్రతి కార్యకర్త ఈ మహానాడును తన ఇంటి కార్యక్రమంగా భావించి విజయవంతం చేయాలన్నారు. జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ... "తెలుగుదేశం పార్టీ ఎప్పటికప్పుడు సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రజలకు మరింత చేరువవుతోందన్నారు. ఈ డిజిటల్ మహానాడు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందన్నారు.

# కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రాభివృద్ధికి అడుగులు : ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

విజయవాడ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే రాష్ట్రంలో అభివృద్ధికి అడుగులు పడ్డాయని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. సోమవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఎంఎస్ఎంఈ పార్క్ ఫేజ్--3లో భాగంగా నిర్మాణం చేయనున్న 'ది ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్' పనులకు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఎంఎస్ఎంఈ పార్క్ ఫేజ్--3లో నిర్మాణ పనులకు ప్రారంభించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఇక్కడ జరిగిన కార్యక్రమాలను వర్చువల్ విధానంలో వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం మొత్తం అభివృద్ధికి అడుగులు పడ్డాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల లోపే రాష్ట్రం మొత్తం ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని వెల్లడించారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు రీజియన్లను అభివృద్ధి చేస్తున్నామని, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాలను వేగవంతం చేశామని తెలిపారు. భోగాపురం విమానాశ్రయనాన్ని జులై నాటికి పూర్తి చేసేందుకు వేగంగా పనులు జరుగుతున్నాయని చెప్పారు. విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్, లక్ష కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు రాష్ట్రంలో రూపొందుతున్నాయని తెలిపారు. ఇప్పుడు ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు



ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఐఐసికి చెందిన బి.శ్రీకాంత్, సీనియర్ ప్రాజెక్టు మేనేజర్, వి.నవీన్ భాస్కర్, సీనియర్ ఆటోక్యాడ్ ఆపరేటర్, తహసీల్దారు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రలో నిలిచేలా టీడీపీ మహానాడు నిర్వహిస్తాం

**●తెలుగువారి ఆత్మగౌరవ పండుగను ప్రజలందరూ తిలకించాలి: ఎమ్మెల్యే రాము**



గుడివాడ (చైతన్యరథం): తెలుగువారి పసుపు పండగ అయిన టిడిపి మహానాడును చరిత్రలో నిలిచేలా గుడివాడలో నిర్వహిస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. నియోజకవర్గంలోని పది క్లస్టర్లలో 4వేల మంది తెలుగు తమ్ముళ్లు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 27, 28 తేదీల్లో వర్చువల్గా జరగనున్న టీడీపీ మహానాడు ఏర్పాట్లపై సోమవారం సాయంత్రం గుడివాడ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము క్లస్టర్ ఇంచార్జులతో సమీక్షించారు. హైబ్రిడ్ మోడ్లో క్లస్టర్ల వారీగా జరగనున్న మహానాడు నిర్వహణపై ఎమ్మెల్యే రాము, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, గుడివాడ మహానాడు అబ్జర్వర్ వీ.ఏ బెగ్, ఏపీ ఎఫ్డబ్ల్యూసీ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు దిశానిర్దేశం చేశారు. మహానాడులో టీడీపీ సభ్యత్వం ఉన్న వారి హాజరునే పరిగణనలోకి తీసుకుంటారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... గుడివాడ అంటే అన్న ఎన్టీఆర్ అడ్డా అని, అలాంటి మహానాయకుడు నెలకొల్పిన తెలుగువారి ఆత్మగౌరవ పండుగ మహానాడును ప్రతి తెలుగు తమ్ముడు ప్రత్యక్షంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్లస్టర్ మహానాడుగా భావించి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,ఇన్చార్జులకు కీలక సూచనలు చేశారు.

**అబ్జర్వర్ బెగ్ మాట్లాడుతూ...**

తెలుగువారి పసుపు పండగ మహానాడు రెండు రోజుల పాటు సంతోషకర, ఆనందకర వేడుకగా జరుగుతుందన్నారు. సీఎం చంద్రబాబు చంద్రబాబు, లోకేష్, పల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో అనేక కీలక తీర్మానాలు చేస్తారని, 28న జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకుంటామని తెలిపారు. గుడివాడ నియోజకవర్గంలో 10 క్లస్టర్లలో 4వేల మందితో పెద్ద ఎత్తున మహానాడు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మహానాడు కొనసాగుతుందన్నారు.మై టీడీపీ యాప్లో కార్యక్రమ వివరాలు ముందుగానే ఉంటాయని, ప్రజలు యాప్ ద్వారా ప్రత్యక్షంగా వీక్షించవచ్చనీ అన్నారు.

# మహానాడు పోస్టర్ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



కొత్తపేట (చైతన్యరథం): రావులపాలెం మండలం ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న తెలుగుదేశం పార్టీ క్లస్టర్ మహానాడును విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. మహానాడుకు సంబంధించిన పోస్టర్ సోమవారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో యువ నాయకులు బండారు సంజీవతో కలిసి ఆయన ఆవిష్కరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. క్లస్టర్ల వారీగా బలోపేతానికి ఈ మహానాడు ఉపయోగపడుతుందన్నారు.

# విశిష్ట స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దిన ఘనత లోకేష్‌దే



విజయవాడ (చైతన్యరథం): ఉండవల్లి నివాసంలో ఏపీ విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌బాబుని ఏపీ బెస్త సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బెస్త రామాంజనేయులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విశిష్ట సంపూర్ణాంధ్ర ప్రదేశ్‌గా తీర్చి దిద్దిన ఘనత నారా లోకేష్‌దే అంటూ శాలువ సత్కారాలతో సత్కరించారు. యావత్ ప్రపంచం నివ్వెరపోయేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కంపెనీలు తరలివస్తూ కోట్లాది పెట్టుబడులు పెడుతూ లక్షలాది యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రూపు రేఖలు మారుస్తున్నారని ఇంతటి ఉద్యోగ విప్లవానికి కృషి చేసిన నారా లోకేష్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రాంతీయ వ్యత్యాసం లేకుండా అన్ని ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు తెస్తూ అనేక కంపెనీలు ఏర్పాటు చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని గత వైసీపీ రాక్షస ప్రభుత్వంలో రాష్ట్రాన్ని తరిమికొట్టిన కంపెనీలు కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు చూస్తున్నాయని తద్వారా యువగళం పాదయాత్రలో సంకల్పించిన 20 లక్షల ఉద్యోగాల కల్పనకు నారా లోకేష్ అవిశ్రాంత కృషి చేస్తూ ఇచ్చిన మాట కోసం దేశ విదేశాలు తిరుగుతూ పెట్టుబడులు ఆకర్షిస్తున్నారని తద్వారా ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ప్రపంచ వ్యాప్తంగా దేదీప్య మానంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆదోని రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి ఐదు నియోజకవర్గాలకు (ఆదోని ఎమ్మిగనూరు పత్తికొండ మంత్రాలయం ఆలూరు)లో తాగు సాగునీటి సమస్యలు తొలిగిపోయేలా నీటి ప్రాజెక్టులు త్వరతరగిన పూర్తి చేస్తూ వలసలు నివారించి వ్యవసాయ ఉత్పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. నూతన పరిశ్రమల ఏర్పాటుతోనే ఈ ప్రాంతం కరువు వలసలకు దూరం అవుతాయి అని తెలిపారు. ఇందుకు లోకేష్ సానుకూలంగా స్పందించారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట) చైతన్యరథం

# నా భార్యకు ఈడి నోటీసులు అవాస్తవం

- ఒక గృహిణి పై తప్పుడు ఆరోపణలు సరికాదు
- ఆర్కిటెక్ట్ ఫీజు మాత్రమే, అంతకుమించి ఏమీ లేదు
- నోటీసులపై ఎంపీ కేశినేని శివనాథ్ వివరణ



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ ఈడీ నోటీసులపై స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన భార్యకు ఈడి నోటీసులు ఇవ్వడం అవాస్తవమని స్పష్టం చేశారు. నోటీసులు వచ్చింది కేశినేని డెవలపర్స్‌కు మాత్రమేనని స్పష్టం చేశారు ఈనెల 27న కంపెనీ ప్రతినిధులు విచారణ అధికారులు ఎదుట హాజరై పూర్తి వివరణ ఇస్తారని వెల్లడించారు. వ్యాపార లావాదేవీకి సంబంధించిన వివరణ కోరుతూనే ఈడి నోటీసులు పంపిందని చిన్ని తెలిపారు. రాజ్ కేసిరెడ్డికి చెందిన ఇశ్వాని సంస్థతో కలిసి తాము ఏర్పాటు చేశామని తెలిపారు.ఆ సంస్థ ద్వారా కేవలం 35 లక్షలు మాత్రమే లావాదేవీలు జరిగాయని అన్నారు. రాజ్ కేసిరెడ్డి సంగతి తెలిసిన వెంటనే 2022లోనే తాము సంస్థ నుంచి పూర్తిగా బయటికి వచ్చినట్లు చిన్ని వివరించారు. తాము జరిపిన ఆ లావాదేవీ కేవలం ఆర్కిటెక్ట్ ఫీజు మాత్రమేనని అంతకుమించి ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరగలేదని విషయాన్ని ఈడికి ఇచ్చే వివరణలో స్పష్టంగా చెబుతామని ఎంపీ చిన్ని పేర్కొన్నారు. మద్యం స్కామ్‌లో తన భార్యకు ఈడి నోటీసులు ఇచ్చిందంటూ జరుగుతున్న ప్రచారాన్ని మీడియా ముఖంగా ఖండించారు. గతంలో పెట్టిన ఆ కంపెనీలో తన భార్య కేవలం ఒక డైరెక్టర్గా మాత్రమే ఉన్నారని ఈడి నోటీసులు పంపింది కేవలం సదరు కంపెనీకేనని తన భార్యకు ఎలాంటి వ్యక్తిగత నోటీసులు రాలేదని ఎంపీ చిన్ని అన్నారు. వైసిపి చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు దీటుగా స్పందిస్తున్న అందుకే తనపై ఈ విధమైన ఆరోపణలు చేస్తున్నారని ఎంపీ చిన్ని అన్నారు ఒక గృహిణిపై ఈ విధమైన ఆరోపణలు చేయడం సరికాదని స్పష్టం చేశారు.

# మచిలీపట్నంలో ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్యరథం): బందరు వాసులకు ఆధార్ సేవలు సులభతరం చేయడం లక్ష్యంగా సేవా కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని యూనియన్ బ్యాంకులో ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సేవా కేంద్రం సిబ్బందితో మాట్లాడి సేవల గురించిన వివరాలు తెలుసుకున్నారు. బయోమెట్రిక్ యంత్రాలు, ఐ స్కానింగ్ యంత్రాలను పరిశీలించారు. కొత్త ఆధార్ కార్డులు, కార్డుల్లో మార్పులు చేర్పుల కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు విశాఖ, విజయవాడ, కాకినాడలో మాత్రమే అందుబాటులో ఉన్న సేవలు ఇకపై మచిలీపట్నంలో కూడా రావడం ఆనందంగా ఉంది. ప్రజలు ఆధార్ సేవ సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# అమరావతి అభివృద్ధికి రైతులు ముందుకు రావాలి : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు (చైతన్యరథం): అమరావతి మండలం లేమల్లె గ్రామంలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియపై పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ స్థానిక నాయకులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అమరావతి ప్రాంతంలోని గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ ఇప్పటికే సుమారు 50 శాతం వరకు పూర్తైందని తెలిపారు. మిగిలిన రైతులు కూడా తమ భూములను ల్యాండ్ పూలింగ్‌కు ఇవ్వడానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ ఎంత త్వరగా పూర్తవుతుందో, అంత వేగంగా అమరావతి రాజధాని అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో భాగంగా, తుళ్లూరులో నివసిస్తున్న యండ్రాయి గ్రామానికి చెందిన గుంటుపల్లి సూర్యప్రకాశ్, శేషమ్మ కుటుంబ సభ్యులు తమకు చెందిన కర్లపూడి రెవెన్యూ పరిధిలో ఉన్న 12.64 ఎకరాల భూమి పత్రాలను ఎమ్మెల్యే సమక్షంలో సీఆర్డీఏకు అప్పగించారు. ఇప్పటి వరకు ల్యాండ్ పూలింగ్‌లో భాగస్వాములైన రైతులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇంకా మిగిలిన వారు కూడా అమరావతి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక ప్రగతితోనే రాష్ట్రంలో వేగవంతమైన, సుస్థిరాభివృద్ధి

●యడ్లపాడు స్పైసెస్ పార్క్, ఎం.ఎస్.ఎం.ఈ పార్కులను వేగంగా అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు



చిలకలూరిపేట (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎం.ఎస్.ఎం.ఈ పార్కుల ఏర్పాటులో నియోజకవర్గంలోనే తొలి ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ యడ్లపాడులో అందుబాటులోకి రావడం ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు వరమని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అభిప్రాయపడ్డారు. సోమవారం ఆయన స్థానిక ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో వర్చువల్‌గా నిర్వహింపబడిన యడ్లపాడు ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. విజయవాడ డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కళా వేదికలో జరిగిన ఎం.ఎస్.ఎం.ఈ గ్రోత్ సమ్మిట్-2026లో పాల్గొన్న ముఖ్యమంత్రి అక్కడినుంచే నేరుగా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుకానున్న పలు ఎం.ఎస్.ఎం.ఈ పార్కులకు శంకుస్థాపన చేశారు. సీఎం ప్రసంగం అనంతరం ఎమ్మెల్యే, ఎంపీలు కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి ప్రసంగించారు.

**చంద్రబాబు, లోకేష్‌లే మూల స్తంభాలు..**

రాష్ట్ర అభివృద్ధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు కీలకంగా వ్యవహరిస్తున్నారని, ఏపీ పారిశ్రామిక ప్రగతికి వారిరువురూ మూలస్తంభాల్లా నిలిచారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రగతితోనే రాష్ట్రం వేగవంతమైన. సుస్థిర అభివృద్ధి సాధిస్తుందన్నారు. గత పాలకులు తమ స్వార్థ ప్రయోజనాలకోసం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిని పతనావస్థకు చేర్చారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. నూతన ఆలోచనలు..వేగవంతమైన అనుమతులు.. సరళతర పాలసీలతో పెట్టుబడిదారుల్ని విశేషంగా ఆకర్షించేలా ఏపీ ఇండస్ట్రియల్ పాలసీలను రూపొందించారన్నారు. నియోజకవర్గానికో ఎం.ఎస్.ఎం.ఈ పార్క్, ఇంటికో పారిశ్రామిక వేత్త లక్ష్యసాధనలో ముఖ్యమంత్రి నేడు తొలి విజయం సాధించారని ప్రత్తిపాటి ప్రశంసించారు.

**విద్యాభ్యాసం ఒకెత్తు అయితే.. ఉద్యోగాలు పొందడం మరో ఎత్తు : ఎంపీ లావు**

తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదివించడానికి ఎంత కష్టపడతారో... వారికి సరైన ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం.. నాయకులు అంతే కష్టపడతారని, విద్యాభ్యాసం పూర్తిచేయడం ఒకెత్తు అయితే, ఉద్యోగాలు పొందడం మరో ఎత్తని నరసరావుపేట లోక్‌సభ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు అభిప్రాయపడ్డారు. యువతకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని, అది జరగాలంటే పరిశ్రమలు రావాలని, సరైన మౌలిక వసతులు, మంచి అనుకూల వాతావరణం ఉంటేనే ఇండస్ట్రీలు వస్తాయన్నారు. యడ్లపాడు ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ లాంటివి నియోజకవర్గానికొకటి చొప్పున ఏర్పాటు కానున్నాయన్నారు.

# వైసీపీ దుష్ప్రచారాలను ప్రజలెవరూ నమ్మొద్దు : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

●జూన్ 12 నాటికే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ



వినుకొండ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న అసత్య ఆరోపణలను, సోషల్ మీడియా దుష్ప్రచారాలను ప్రజలెవరూ నమ్మవద్దని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్యార్థుల స్కూల్ కిట్ల ('సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' కిట్లు) పంపిణీ విషయంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అధికారం కోల్పోయిన నాటి నుంచి జగన్మోహన్‌రెడ్డి, ఆయన పార్టీ నాయకులు తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణానికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తుంటే... అది చూసి ఓర్వలేక వైసీపీ నేతలు స్కూల్ కిట్లపై కావాలనే కుట్రపూరిత ప్రచారం చేస్తున్నారని జీవీ ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ వాతావరణం, ముడి చమురు, గ్యాస్ కొరత కారణంగా స్కూల్ కిట్లకు సంబంధించిన ముడిసరుకుల రవాణాకు అంతరాయం ఏర్పడిందని ఆయన వివరించారు. దీనివల్ల యూనిఫాం, బూట్లు, బ్యాగుల తయారీకి అవసరమైన ఫైబర్, ఇతర మెటీరియల్స్ ధరలు పెరగడంతో పాటు సరఫరాలో కొంత అంతర్జాతీయంగా ఆలస్యం జరిగిందని, అంతేకానీ కిట్ల పంపిణీని ప్రభుత్వం ఎక్కడా రద్దు చేయలేదని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం టెండర్ల ప్రక్రియలో చేసిన అవినీతి, నాణ్యతా లోపాలను సరిదిద్ది, విద్యార్థులకు అత్యంత నాణ్యమైన వస్తువులను అందించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం అన్నింటినీ పునఃసమీక్షించిందని తెలిపారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పక్కాగా అందుతాయని, మిగిలిన యూనిఫాం, బూట్లు, బ్యాగులను కూడా వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు అధికారులు తయారీ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని వెల్లడించారు.

# గన్నవరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం : యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం (చైతన్యరథం): నియోజకవర్గాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనే ఆదర్శవంతమైన మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. నిన్న సాయంత్రం బాపులపాడు మండలంలో పర్యటించిన ఆయన రంగన్నగూడెం, మల్లవల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంబించారు. రంగన్నగూడెం గ్రామంలో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను, RDSS పథకం ద్వారా రూ.1.32 కోట్ల వ్యయంతో చేపట్టిన విద్యుత్ ఆధునీకరణ పనులను బూత్ లెవెల్ ఏజెంట్లతో కలసి ప్రారంభించారు. సింగన్నగూడెం, రంగన్నగూడెం గ్రామాలకు కలిపి మొత్తం రూ.5.66 కోట్ల నిధులను కేటాయించినట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. అనంతరం మల్లవల్లి గ్రామంలో రూ.37.50 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.67.54 లక్షలతో నిర్మించిన స్వర్ణ గ్రామం భవనం, ఆర్ఎస్‌కే భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. యువగళం పాదయాత్ర రంగన్నగూడెం గ్రామం మీదుగా వెళ్లిందనే నెపంతో 52 మంది అమాయక గ్రామస్తులపై తప్పుడు కేసులు పెట్టి వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చెరువులను అక్రమంగా తవ్వి మట్టిని దోచుకున్నారని, ఇకపై అక్రమ తవ్వకాలకు తావులేదని స్పష్టం చేశారు. చెరువుల్లోని మట్టిని ప్రార్థనా స్థలాలు, పాఠశాలలు, స్మశాన వాటికలు మరియు రైతుల ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని అధికారులను ఆదేశించారు. గతంలో కేడీసీసీ బ్యాంక్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిన విధంగానే గన్నవరాన్ని కూడా అభివృద్ధిలో ముందంజలో ఉంచుతానని ధీమా వ్యక్తం చేశారు. మల్లవల్లి ఇండస్ట్రియల్ కారిడార్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఎన్డీయే కూటమిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు ప్రజలతో మమేకమై పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం చేయగా మరికొన్ని సమస్యలను త్వరిగతిన పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు.

చైతన్యరథం



# ఎమ్మెస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన




కావలి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లా, దగదర్తి మండలం ఉలవపాళ్ల గ్రామం సమీపంలో 21 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ప్రతిష్టాత్మక ఎమ్మెస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్‌కు సోమవారం కావలి శాసనసభ్యుడు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 38 ఎమ్మెస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ పార్కులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయగా, ఉలవపాళ్లలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అధికారులు, పార్టీ నాయకులు, పారిశ్రామికవేత్తలు,వ్యాపారవేత్తలు స్థానిక ప్రజలతో కలిసి సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం అందించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయని తెలిపారు. స్థానిక యువత ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా స్వగ్రామాల్లోనే ఉపాధి పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కావలి నియోజకవర్గంలో పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, రామాయపట్నం పోర్టు, పారిశ్రామిక కారిడార్, వివిధ ఇండస్ట్రియల్ ప్రాజెక్టులు ప్రాంత రూపురేఖలను పూర్తిగా మార్చబోతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా ఎదగనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఉలవపాడు పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, నీటి సరఫరా వంటి అన్ని మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు 75 శాతం వరకు సబ్సిడీతో పాటు భూమి కొనుగోలు ఖర్చుపై గరిష్టంగా రూ.25 లక్షల వరకు రాయితీలు అందించనున్నట్లు వెల్లడించారు.ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, చిన్నతరహా తయారీ పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు సహా వివిధ రంగాలకు చెందిన సంస్థలు ఈ పార్క్‌లో ఏర్పాటుకు ముందుకు రావచ్చని ఎమ్మెల్యే తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి విద్యుత్ కనెక్షన్లు, బ్యాంకు రుణాలు, రిజిస్ట్రేషన్ ఫీజులు తదితర అంశాల్లో ప్రత్యేక రాయితీలు కల్పించనున్నట్లు చెప్పారు.యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరు అయినా వ్యాపారవేత్తగా ఎదిగితే ఆ కుటుంబంతో పాటు మరెందరికో ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని యువత ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపారవేత్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.




## సీఎం చంద్రబాబు సారథ్యంలో
# డిజిటల్ మహానాడుకు టీడీపీ శ్రీకారం

### టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు

రాయచోటి (చైతన్యరథం): ప్రధానమంత్రి నరేంద్రమోడీ సూచనలు మేరకు పొదుపు చర్యల్లో భాగంగా తెలుగుదేశం పార్టీ "డిజిటల్ మహానాడు" నిర్వహించడం దూరదృష్టితో తీసుకున్న నిర్ణయమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. సోమవారం రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం స్థాపించిన తెలుగుదేశం పార్టీ నేడు దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాంకేతికతను వినియోగించి పరిపాలనలోనే కాకుండా పార్టీ కార్యక్రమాల్లో కూడా వినూత్న మార్పులు తీసుకొస్తున్నారని ప్రశంసించారు. యువనేత, మంత్రి నారా లోకేష్ యువతను రాజకీయాల వైపు ఆకర్షిస్తూ పార్టీకి కొత్త శక్తిని తీసుకొస్తున్నారని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 1845 క్లస్టర్లలో మహానాడు కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారని, రాజంపేట పార్లమెంట్ పరిధిలోని 72 క్లస్టర్లలో ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా మహానాడు కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు వెల్లడించారు. మహానాడుకు హాజరయ్యే పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆహారం, తాగునీటి వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యకర్తలంతా భాగస్వాములై మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మాట నిలబెట్టుకున్న మంత్రి నారాయణ

### బలిజ భవన్, చర్చిలకు భారీ విరాళం ప్రజా రుణం తీర్చుకోవడమే నాన్నగారి లక్ష్యం : షరణి



నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్ర పురపాలక,పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మరోసారి తన మాట నిలబెట్టుకున్నారు. హామీ ఇచ్చిన రోజుల వ్యవధిలోనే 14 వ డివిజన్ లోని బలిజభవన్ కి 25 లక్షలు,50 వ డివిజన్ బుజ్జమ్మ రేవులోని జెమ్స్ ఆఫ్ జీసెస్ చర్చి కి 2 లక్షలు సొంత నిధి నుంచి కేటాయించారు.అందుకు సంబంధించిన చెక్కులను మెడికల్ కాలేజ్ లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కుమార్తె షరణి బలిజభవన్ కమిటీ సభ్యులు, చర్చి పాస్టర్‌లకు సోమవారం అందచేసారు. అనంతరం షరణి మీడియాతో మాట్లాడారు.సిటీ నియోజకవర్గం ప్రజలు తన తండ్రిని అత్యధిక మెజారిటీతో గెలిపించారని, నగర అభివృద్ధే ధ్యేయంగా ప్రజా రుణం తీర్చుకునేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తూ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారన్నారు. నెల్లూరు సిటీ ప్రజలకు ఎల్లప్పుడూ తమ కుటుంబం అండగా ఉంటుందన్నారు.ఇచ్చిన మాట ప్రకారం నాన్నగారి ఆదేశాలతో నారాయణ విద్యాసంస్థల తరపున బలిజ భవన్‌కు 25 లక్షలు, జెమ్స్ ఆఫ్ జీసెస్ చర్చి అభివృద్ధికి 2 లక్షల విరాళాల చెక్కులను అందచేసినట్టు తెలిపారు.గతంలో కూడా కాపు భవన్‌కు 2 కోట్లు, బలిజ భవన్‌కు 30 లక్షలు, బీసీ భవన్‌కు 1 కోటి,కోటమిట్ట షాదీ మంజిల్ కి 1 కోటి,54 వ డివిజన్ లో షాదీ మంజిల్‌కు 50 లక్షలు ఆర్థిక సహాయం అందించామని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు తమ కుటుంబ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, అందరూ సంతోషంగా ఉండాలన్నదే తమ అభిమతమని షరణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ భవన్ కమిటీ సభ్యులు డివీఎస్ గిరి, పసుపులేటి రామ్మూర్తి, గుణుకుల మల్లయ్య, రావి హనుమంతరావు, లక్ష్మణరావు, జెమ్స్ ఆఫ్ జీసెస్ చర్చి పాస్టర్ జెరోమ్, 50వ డివిజన్ ప్రెసిడెంట్ సిద్ధయ్య టీడీపీ నేతలు పాల్గొన్నారు.

### డిజిటల్ మహానాడు విజయవంతం చేయడానికిఅన్నసముద్రం మెట్ట దగ్గర ఏర్పాటు చేయనున్న మహానాడు వేదికను పరిశీలించిన టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు





ఈ నెల 27, 28 తేదీలలో జరగనున్న డిజిటల్ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి త్రిపురాంతకం మండలం క్లస్టర్-06 పరిధిలోని పాత అన్నసముద్రం మెట్ట దగ్గర ఏర్పాటు చేయనున్న మహానాడు వేదికను పరిశీలించిన యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్సన్ బాబు. ఈ సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్యక్రమ నిర్వహణ, సౌకర్యాలు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

# అన్నదాత సజీవ దహనం దారుణం

### తీవ్ర దిగ్భ్రాంతికి గురైన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి (చైతన్యరథం): ముండ్లమూరు మండలం, పోలవరం గ్రామంలో రైతు సజీవ దహనం అవ్వటం బాధాకరం. ఆ గ్రామంలోని బీసీ కాలనీకిచెందిన వల్లేపు వెంకటేశ్వర్లు, కోటమ్మ దంపతులు. గత మూడు రోజుల క్రితం మొక్కజొన్నను మిషన్‌తో కోత కోయించాడు. సోమవారం మొక్కజొన్న వ్యర్థాలను తగల తగలపెట్టడానికి భార్యాభర్తలు వెళ్లారు. వ్యర్థాలకు నిప్పు పెట్టాడు.ఆ మంటలు బోరు వైరు కాలిపోతుందని ఆత్రుతతో బోరు వద్దకు వెళ్లే క్రమంలో మొక్కజొన్న దుంప తట్టుకొని పడిపోయాడు. వెంకటేశ్వర్లు లేచి క్రమంలోనే మంటలు అతను చుట్టుకొని సజీవ దహనమయ్యాడు. ఈ సంఘటనపై దర్శి టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుని వల్లేపు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. పంట వ్యర్థాల విషయంలో రైతులు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, ఇటువంటి సంఘటనల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేసారు. మృతి చెందిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని అన్నారు. దీంతోపాటు పక్కనే గల వల్లెపు నాగేశ్వరావు కు చెందిన మూడు ఎకరాల మిరప తోట పూర్తిగా దగ్ధమవ్వటం బాధాకరం. ఈ సంఘటనపై సంబంధిత అధికారులతో మాట్లాడి పంట నష్టానికి పరిహారం అదేవిధంగా కృషి చేస్తానని తెలియజేసారు.








# తొలిసారి వర్చువల్ మహానాడును విజయవంతం చేద్దాం

## శింగనమల ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు పిలుపు

అనంతపురం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారి వర్చువల్ విధానంలో జరుగుతున్న మహానాడును విజయవంతం చేద్దామని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, సింగనమల నియోజవర్గ పరిశీలకులు, ఏపీ స్టేట్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఎడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, సింగనమల నియోజకవర్గ కన్వీనర్లు, క్లస్టర్లు, నాయకులతో పూల నాగరాజు సమావేశం నిర్వహించారు. మహానాడు ఎలా నిర్వహించాలన్న దానిపై పార్టీ శ్రేణులకు ఆయన కొన్ని సూచనలు చేశారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి మహానాడు కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఈ సందర్భంగా పూల నాగరాజు పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోడీ ఇచ్చిన పిలుపుమేరకు పొదుపు చర్యల్లో భాగంగా మొదటిసారి వర్చువల్ విధానంలో మహానాడు నిర్వహించనున్నట్లు పూల నాగరాజు వివరించారు. ఈనెల 27, 28 తేదీల్లో జరగబోయే మహానాడుకు ప్రతి క్లస్టర్ నుంచి వర్చువల్ విధానంలో పాల్గొనేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి నాయకుల సందేశాన్ని.. క్లస్టర్ పరిధిలో ఉన్న అందరూ వీక్షించేలా ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 10 చోట్ల నుంచి మహానాడులో పాల్గొంటారన్నారు. ఆయా క్లస్టర్ పరిధిలోని మండల పార్టీ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్చార్జిలు, యూనిట్ ఇంచార్జ్ లు, కేఎస్ఎస్, బూత్ స్థాయి, అనుబంధ కమిటీల సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని వివరించారు. ప్రతి క్లస్టర్ పరిధిలో చేసిన తీర్మానాలను నియోజకవర్గ స్థాయిలో పరిశీలించి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించాలని సూచించారు. ఈ పసుపు పండుగలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



# ఆగళిలో వైసీపీకి బిగ్ షాక్..

## టీడీపీలోకి కీలక నేతలు

మడకశిర (చైతన్యరథం): వైసీపీకి గట్టి దెబ్బతగిలింది. మడకశిర నియోజకవర్గం అగలి మండల స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసీపీ పార్టీని వీడి దాదాపు 40 కుటుంబాలు సోమవారం పట్టణంలోని బాలాజీ నగర్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో తెలుగుదేశం పార్టీ లో చేరారు. తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ తిప్పేస్వామి, మాజీ సర్పంచ్ రామిరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కెంచు యాదవ్, హనుమంత రాయప్పల ఆధ్వర్యంలో అగలి మండలం మధుడి గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన మాజీ సింగల్ విండో అధ్యక్షుడు వీరభద్రప్ప, రాజన్న, ఈరలక్కప్ప, చిన్న వీరభద్రప్ప, హనుమంత రాయప్ప, భీమన్న, తదితరులను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వైసీపీ వీడి వచ్చినవారికి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైసీపీ పార్టీని టిడిపి లోకి చేరిన నాయకులు మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి చేరామన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమలు రానున్నాయని మడకశిర రూపు రేఖలు త్వరలో మారబోతున్నాయని అన్నారు, వైసీపీ పార్టీలో నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది ప్రజా ప్రతినిధులు వారి స్వలాభం చూసుకున్నారే తప్ప కార్యకర్తలను పట్టించుకునె నాయకుడు కరువయ్యారని అన్నారు. వచ్చే స్థానిక ఎన్నికలు తెలుగుదేశం పార్టీ గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలం కందుకూర్లపల్లి గ్రామ ప్రజలు హిందూపురం వెళ్లే సమయంలో దారి మధ్యలో బస్టాండ్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో, ప్రయాణికుల సౌకర్యార్థం ఈశ్వర రబ్బర్ ఫ్యాక్టరీ సీఎస్సార్ నిధులతో నిర్మించిన నూతన బస్టాండ్‌ను బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత ప్రారంభించారు.

# ఎమ్మెల్యే అమిలినేని ఆధ్వర్యంలో మహానాడు సన్నాహక సమావేశం

## అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించి, వారికి అండగా నిలుస్తానని హామీ



కళ్యాణదుర్గం (చైతన్యరథం): పసుపు సైనికుల పండుగ(మహానాడు)ను వర్చువల్ విధానంలో జరుపుకుంటున్న సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, యూనిట్ ఇంచార్జులు, క్లస్టర్ ఇంచార్జులు, గ్రామ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలతో క్లస్టర్ల పరిధిలో నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించేందుకు సమావేశాన్ని ప్రజావేదికలో నిర్వహించగ కంబదూరు మండల సమావేశానికి పార్టీ పరిశీలకులు రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ గారు ముఖ్యఅతిథిగా విచ్చేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ దేశ ప్రధాని పిలుపుతో ఇందన పొదుపు చేయడం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నిర్ణయంతో మహానాడను క్లస్టర్ వైస్‌గా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు.. పంచాయతీలకు కూడా రాబోయే రోజుల్లో అధికంగా నిధులు రాబోతున్నాయి..తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి కంచుకోటల నిలిపారని, రెండు రోజుల పాటు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ అందుబాటులో ఉంచుతామని, ప్రతి గ్రామంలో కూడా ఎన్టీఆర్ విగ్రహాలు, పార్టీ జెండా ఎగురవేసి, ప్రతి ఇంట్లో ఎన్టీఆర్ గారి చిత్రపటాలకు ఘనమైన నివాళి అర్పించాలని, మన దేశంలో అత్యంత ఎదుగుతున్న నాయకుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కష్టపడే కార్యకర్తలను గుర్తించి నేడు క్లస్టర్ ఇంచార్జులకు ప్రాధాన్యత ఇచ్చి వారికి తగిన గౌరవం కల్పిస్తున్నారని తెలిపారు..నియోజకవర్గంలోని 11 క్లస్టర్ల పరిధిలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే మహానాడు కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున పసుపు సైనికులు, మహిళలు కూడా పసుపు దుస్తులు ధరించి పెద్ద ఎత్తున హాజరై దిగ్విజయం చేయాలని సూచించారు. నాలుగు రోజుల క్రితం కంబదూరు మండలంలో అకాల గాలి వాన భీభత్సానికి అరటి, బొప్పాయి తోటలు ధ్వంశం అయి రైతులు పంట పూర్తిగా నష్టపోయారని మహానాడు తరువాత గ్రామాలకు వెళ్లి రైతులను పరామర్శించి, వారికి ప్రభుత్వం నుంచి పంట నష్ట పరిహారం అందేలా చూస్తామని తెలిపారు..



# తప్పొప్పులు సరిచేసుకుందాం.. భవిష్యత్తును నిర్ణయించుకుందాం!

## పార్టీ శ్రేణులకు ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపు, మహానాడు ఏర్పాట్లపై రూరల్ మండల నాయకులతో సమావేశం, ధర్మవరంలోని క్లస్టర్ల పరిధిలో వేదికలను పరిశీలన

ధర్మవరం (చైతన్యరథం): ఏడాది కాలంలో సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటూ, తప్పొప్పులను సరిచేసుకుని, భవిష్యత్ ప్రణాళికను నిర్ణయించుకుందామని ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. ఈనెల 27, 28తేదీల్లో జరగనున్న మహానాడుకి సంబంధించిన ఏర్పాట్లపై ధర్మవరం రూరల్ మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ధర్మవరం టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో శ్రీరామ్ శ్రేణులకు దిశా నిర్దేశ్యం చేశారు. తెలుగుదేశం పార్టీ ఏడాది కాలంలో ఎన్ని సమావేశాలు నిర్వహించుకున్నా.. మహానాడుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఇక్కడ ఏడాది కాలంలో జరిగిన సంఘటనలను చర్చించుకుంటూ ఏమైనా మనం చేయలేని పనులు ఉన్నాయా అన్నదికూడా విశ్లేషించుకుంటామన్నారు. అదే విధంగా భవిష్యత్ లో చేపట్టబోయే వాటి గురించి కూడా తీర్మాణాలు చేసుకుంటామన్నారు. ఈసారి పొదుపు చర్యల్లో భాగంగా వర్చువల్ విధానంలో మహానాడు నిర్వహించుకుంటున్నామని.. అన్ని క్లస్టర్ల పరిధిలో వేదికలు ఉంటాయన్నారు. గతంలో మహానాడు కార్యక్రమం రాష్ట్రంలో ఎక్కడ జరిగినా అనేక వ్యయప్రయాసల కోర్చి వేళ్లే వారమని.. ఈసారి మన ప్రాంతం నుంచి మనం నేరుగా పాల్గొనే అవకాశం వచ్చిందన్నారు. ఈ సమావేశంలో మనం స్థానికంగా ఉన్న అంశాల గురించి చర్చించుకునే అవకాశం ఉంటుందన్నారు. అందుకే సభ్యత్వం ఉన్న ప్రతి కార్యకర్త ఐడెంటిటీ కార్డుతో పాటు హాజరు కావాలన్నారు. గత ఏడాది కాలంలో క్లస్టర్ పరిధిలో ఎవరైనా చనిపోయి ఉంటే వారిని స్మరించుకుంటూ.. సీనియర్లను సన్మానించుకుంటూ కార్యక్రమం ఉంటుందన్నారు. భవిష్యత్ లో మనం చేపట్టబోయే కార్యక్రమాలు కూడా ఇక్కడే నిర్ణయించబడుతాయన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ధర్మవరం పట్టణంలోని ఐదు క్లస్టర్ల పరిధిలో నిర్వహించబోయే మహానాడు వేదికలను పరిశీలించారు. ఎర్రగుంట సర్కిల్ తెలుగుదేశంపార్టీ క్యాంప్ కార్యాలయం, పి.ఆర్.టి స్ట్రీట్ షాది మహల్, కేపిటి స్ట్రీట్ కొత్త ఆర్యవైశ్య సత్రం, శాంతినగర్ శ్రీరాముని కళ్యాణమండపం, కొత్తపేట శ్రీ సీతారామాంజనేయ కళ్యాణ మండపాల్ని శ్రీరామ్ ప్రత్యక్షంగా చూశారు. అక్కడ ఎలాంటి ఏర్పాట్లు చేయాలి, ఎల్.ఈ.డీ స్క్రీన్లు, వేదిక తదితర వాటికి సంబంధించి శ్రీరామ్ నాయకులకు పలు సూచనలు చేశారు. రెండు రోజుల పాటు ఎలాంటి ఆటంకాలు లేకుండా కార్యక్రమం జరిగేలా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీరామ్ నాయకులకు సూచించారు.

## నెదర్లాండ్స్‌లో కన్నుల పండువగా

# అన్నమాచార్య ఆరాధనోత్సవాలు

**❑170 మంది కళాకారులతో కళానీరాజనం ❑పరవశింపజేసిన సాంస్కృతిక ప్రదర్శనలు**

ఐండ్‌హోవెన్ (నెదర్లాండ్స్): అన్నమాచార్యుల 618 జయంత్యుత్సవాల మహోత్సవం సందర్భంగా స్టిచింగ్ వసుదైక కుటుంబం (ఎస్‌వీకే) ఐరోపా వ్యాప్తంగా 170 మంది కళాకారులను ఏకం చేసింది. స్టిచింగ్ వసుదైక కుటుంబం అనేది నెదర్లాండ్స్‌కు చెందిన ఒక లాభాపేక్షలేని సంస్థ. ఇది కళ, విద్య, సామాజిక కార్యక్ర మాల ద్వారా సమాజ సమైక్యతను పెంపొందించడానికి, సాంస్కృతిక వారసత్వాన్ని పరిర క్షించడానికి, విశ్వ విలువలను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉంది. సాంస్కృతిక సామరస్యానికి అంకిత మైన ఒక ప్రముఖ లాభాపేక్షలేని సంస్థ అయిన స్టిచింగ్ వసుదైక కుటుంబం అన్నమాచార్యుల జీవితం, కాలాతీత వారసత్వం, సంగీత ప్రతిభను స్మరించుకోవడంలో అపారమైన ఖ్యాతి పొందింది. మే 23న ఆ సంగీత విద్వాంసుని 618వ జయంతి సందర్భంగా ఎస్‌వీకే ఐండ్ హోవెన్‌లో ఒక మహత్త రమైన అన్నమాచార్య ఆరాధనను నిర్వహించడం సాంస్కృతిక మైలురాయి. పశ్చిమ ఐరోపా నలుమూలల నుంచి ఎన్నో ప్రఖ్యాత సంగీత, నృత్య పాఠశాలలను ఒకచోట చేర్చి అన్నమాచార్యులుకు కళ, సంగీతం, ప్రగాఢ భక్తితో కూడిన సామూహిక నివాళి అర్పించేలా చేసింది.

### ప్రత్యేక అతిథులుగా ప్రముఖులు

గురువులు, ఉపాధ్యాయుల అచంచలమైన అంకిత భావం ఈ కార్యక్రమ వాతావరణాన్ని ప్రకాశింప జేసింది. పవిత్రమైన గురు-శిష్య సంప్రదాయాన్ని (గురువు నుంచి శిష్యునికి సంక్రమించే పరంపర) సజీవంగా ఉంచుతూ ఈ ఉపాధ్యాయులు ఐదేళ్ల చిన్న వయసున్న విద్యార్థులకు కూడా ఎంతో శ్రమతో శిక్షణ ఇచ్చారు. 75 ఏళ్ల వయసు వరకు అనుభవజ్ఞులైన కళాకారులతో పాటు చిన్న పిల్లలు కూడా అన్నమా చార్యుల వారి క్లిష్టమైన ఆధ్యాత్మిక కార్యకలాపాలను, సంకీర్తనలను అలవోకగా పఠించడం, ప్రదర్శించడం ప్రాచీన సంప్రదాయ పరిరక్షణకు ఒక నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. హాజరైన ప్రముఖులలో ఐండ్‌హోవెన్ నగర కౌన్సిలర్లు మిరియం ఫ్రోసీ, చైతాలి సేన్‌గుప్తా ఉన్నారు. వారితో పాటు సంస్కృతి /సంస్కార్ సంస్థ అధిపతి వల్లభ్ పాండే, హెచ్‌ఎస్‌ఎస్ ఐండ్‌హోవెన్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక, విద్యా విలువలను వారు ప్రశంసించారు.





### యువ కళాకారులకు ప్రశంసాపత్రాలు

అతిథులందరూ కలిసి యువ కళాకారులను ఆశీర్వదించి శాస్త్రీయ కళలపై వారి అంకితభావాన్ని గౌరవిస్తూ ప్రశంసాపత్రాలు అందజేశారు. శ్రీ వెంకటే శ్వర స్వామికి పరమభక్తుడిగా, సంగీతకారుడిగా అన్నమాచార్యుల చారిత్రక పాత్రకు తగిన నివాళిగా సుందరంగా అలంకరించబడిన వెంకటేశ్వర స్వామి, అమ్మవార్ల విగ్రహాల సమక్షంలో ఈ ప్రదర్శనలు జరిగాయి. శాస్త్రీయ కర్ణాటక గాత్ర గీతాలు, వాద్య సంగీతం, సాంప్రదాయ నృత్య రూపాల అద్భుత మేళవింపుతో అన్నమాచార్యుల వారి కృతులకు జీవం పోసి కళాభి మానులను మంత్రముగ్ధులను చేశాయి. ఇలాంటి కార్యక్రమాలు భౌగోళిక సరిహద్దులను, తరాలను అధిగమిస్తాయని స్టిచింగ్ వసుదైక కుటుం బం ప్రతినిధి పేర్కొన్నారు. ఈ సాంస్కృతిక వేడుకను అద్భుతమైన విజయంగా మలచిన బాలాజీ ఆలయ యాజమాన్యానికి, విశిష్ట అతిథులకు, పాల్గొన్న పాఠశాలలకు, అంకితభావం గల గురువులకు, సామాజిక స్వచ్ఛంద కార్యకర్తలకు ఎస్‌వీకే హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.

# న్యూజెర్సీ తెలుగు కళాసమితి రికార్డ్

**రెండేళ్లలో 33 వైవిధ్యభరిత కార్యక్రమాలు విజయవంతం**

న్యూజెర్సీ: అమెరికాలోని 'తెలుగు కళా సమితి' ‿ TFAS - తెలుగు ఫైన్ ఆర్ట్స్ సొసైటీ, న్యూజెర్సీ) ప్రస్తుత బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ హయాంలో సరికొత్త రికార్డులను సృష్టించింది. 2024-2026 మేనేజింగ్ కమిటీ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు అత్యంత విజయవంతంగా 33 విభిన్న కార్యక్రమాలను నిర్వహించి స్థానిక తెలుగు కమ్యూనిటీలో సరికొత్త ఉత్తేజాన్ని నింపింది. లాభాపేక్ష లేని సాంస్కృతిక సంస్థగా కొనసాగుతున్న టీఎఫ్ఏఎస్ కేవలం సాంస్కృతిక వేడుకలకే పరిమితం కాకుండా సామాజిక, వైద్య, క్రీడా, విద్యారంగాలకు సంబంధించిన ఎన్నో వైవిధ్య భరితమైన ఈవెంట్లను నిర్వహించింది.

### విజయవంతంగా సాగిన కార్యక్రమాలు

వైద్యం/అవగాహన సదస్సులు: ఎడిసన్ నగరంలో ఉచిత మెడికల్ క్యాంప్, డాక్టర్ ఉన్నతి ఆధ్వర్యంలో పెయిన్ ఫ్రీ లైఫ్ సెమినార్, డాక్టర్ బైరి శ్రీనివాసరావు నేతృత్వంలో నేచురోపతి ద్వారా నివారణ ఆరోగ్య సంరక్షణపై వెబినార్లు నిర్వహించారు. కొండవీటి జ్యోతి ర్మయి సంగీత విభావరి, సంక్రాంతి సంబరాలు (పెళ్లి సందడి, పొట్టిల్లు, కవితల పోటీలు), ఉగాది వేడుకలు, త్రిమూర్తి ఆరాధనోత్సవాలు, మే 30న జరగనున్న 'అన్నమయ్యకు ఆరాధన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమా లు ఇందులో ఉన్నాయి. క్రీడా స్ఫూర్తిని నింపేలా వాలీబాల్, టెన్నిస్, క్రికెట్, బాడ్మిం టన్, బౌలింగ్, పికిల్ బాల్ టోర్నమెంట్లను సంస్థ విజయవంతంగా పూర్తి చేసింది. ఎన్నారైల కోసం లీగల్ సెమినార్, ఇమ్మిగ్రేషన్ వెబినార్, యూఎక్స్-యూఐ ఆన్‌లైన్ వెబినార్, స్వచ్ఛంద సేవకులను గౌరవిస్తూ 'వాలంటీర్ అప్రిషియేషన్ డిన్నర్' వంటి కార్యక్రమాలను కూడా సమితి నిర్వహించింది.

### తెలుగు వారిని ఏకతాటిపైకి తెచ్చేలా కమిటీ

న్యూజెర్సీలో తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ ప్రవాస తెలుగు వారిని ఏకతాటిపైకి తెచ్చేందుకు కమిటీ నిరంతరం కృషి చేస్తోందని, రాబో యే రోజుల్లో మరిన్ని అద్భుతమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతామని టీఎఫ్ఏఎస్ ప్రతినిధులు వెల్లడించారు. సంస్థకు సంబంధించిన పూర్తి వివరాల కోసం www. tfasnj.org వెబ్‌సైట్‌ను సందర్శిం చవచ్చని కోరారు. ఈ కమిటీలో ప్రెసిడెంట్: మధు అన్న- (201)674-5447, వైస్ ప్రెసిడెంట్: ప్రసాద్ వూటుకూరు- (732)789-0272, సెక్రటరీ: వెంకట సత్యటాటా- (973)985-3409, ట్రెజరర్: సత్యవాణి కునిశెట్టి- (732)666-2115, యాన్యువల్ కల్చరల్ ఈవెంట్స్: శేషగిరిరావు కంభంమెట్టు-(732)910-3966, కమ్యూనిటీ సర్వీసెస్: వరలక్ష్మి రాధాకృష్ణ-(774) 288-9365, మెంబర్‌షిప్ సర్వీసెస్: శ్రీమతి అరుంధతి శాకెల్లి-(732) 735-3786, ఐటీ సర్వీసెస్/వెబ్: లోకేందర్ గిరకాల- (718)709-6639, యూత్ కమిటీ: లతా మాదిశెట్టి- (973)964-4249 ఉన్నారు.




### 30న అన్నమాచార్య ఆరాధనోత్సవం

అమెరికాలోని ప్రవాస తెలుగువారి పురాతన సాంస్కృతిక సంస్థ 'తెలుగు కళా సమితి', సాయి దత్త పీఠం న్యూజెర్సీ సంయుక్త ఆధ్వర్యంలో పదకవిత పితామహ తాళ్లపాక అన్నమాచార్యులను స్మరించుకుంటూ "అన్నమయ్యకు ఆరాధన" గ్రాండ్ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అన్నమాచార్యుల వారి 618వ జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుక మే 30న శనివారం న్యూజెర్సీలో సాయిదత్త పీఠం, ఓక్ ట్రీ రోడ్, ఎడిసన్, 08820, అమెరికాలో భక్తిశ్రద్ధలతో జరగనుంది. వచ్చే భక్తులు, సందర్శకులకు రాత్రి భోజ నవసతి కల్పిస్తారు.

### ప్రధాన సాంస్కృతిక కార్యక్రమాలు

అన్నమయ్య చరిత్ర (కూచిపూడి నృత్య రూపకం): సిద్ధేంద్ర కూచిపూడి ఆర్ట్ అకాడమీ విద్యార్థులతో అన్నమయ్య జీవిత చరిత్రపై అద్భుతమైన నృత్య రూపకం. (గురువు: స్వాతి అట్లూరి). ఈ ప్రదర్శన ఎడిసన్, బ్రిడ్జ్‌వాటర్, ప్లైన్స్ బోరో, ప్రిన్స్‌టన్, మార్ల్‌బోరో మన్రో పరిసర ప్రాంతాల విద్యార్థులతో రూపుదిద్దుకుంది.

- అన్నమయ్య సంగీత విభావరి: మూడు ప్రముఖ సంగీత అకాడమీల విద్యార్థులు కలిసి ఈ మధురమైన గానలహరిని అందించనున్నారు:
- మహతి మ్యూజిక్ అకాడమీ, ఎడిసన్ (గురువు: రేఖ బ్రహ్మసముద్రం)
- కృష్ణవేణి స్కూల్ ఆఫ్ కర్నాటిక్ మ్యూజిక్, ఎడిసన్ (గురువు: విజయలలిత వేమూరి)
- స్వరరాగ సుధా కళా అకాడమీ, బ్రాంచ్‌బర్గ్ (గురువు: ఉష అకెళ్ల)

### ప్రత్యేక కార్యక్రమం

(తెలుగులో రామాయణాలు-విశిష్టత): వాల్మీకి, మొల్ల, రంగనాథ విశ్వనాథ సత్యనారాయణ రచించిన రామాయణ కావ్యాల నుంచి ప్రముఖులతో పద్య పఠనం. ఈ ఆధ్యాత్మిక సంబరాలను సాయిదత్త పీఠం-శివవిష్ణు టెంపుల్ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ రఘు శర్మ శంకరమంచి, ఛారిటీ ప్రోగ్రామ్స్ ఇన్‌ఛార్జ్ సుభద్ర పతిబండ్ల టీఫాస్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (2024-2026) ప్రతినిధులు మధు అన్న, వెంకటసత్య తాత, వాణి కునిశెట్టి, లోకేందర్ గిరకల, శేషగిరిరావు కంభంమెట్టు, లతాదేవి మడిశెట్టి, అరుంధతి శాకెల్లి, వరలక్ష్మి రాధాకృష్ణ ప్రసాద్ వూటుకూరులు పర్యవేక్షిస్తున్నారు.

## సింగపూర్‌లో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లకు ఘనస్వాగతం



సింగపూర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సింగపూర్ వచ్చిన సందర్భంగా తెలుగుదేశం ఫోరం సింగపూర్ ప్రతినిధులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సింగపూర్‌లోని సరిగమా గ్రాండ్ వేదికగా తేనీటి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా రవాణా సేవల మెరుగుదల, ప్రవాస తెలుగు వారి పాత్ర తదితర అంశాలపై స్నేహపూర్వకంగా చర్చించారు. ఈ సమావేశం పరస్పర ఆత్మీయతను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రవాస తెలుగు సమాజం, రాష్ట్ర నాయకత్వం మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించింది. తెలుగు దేశం ఫోరం సింగపూర్ సభ్యులు నారాయణరావుకి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# సహకార పంట రుణాల మాఫీ



## తమిళనాడు సీఎం విజయ్ కీలక నిర్ణయం

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రైతులకు ఉపశమనం కలిగించే కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు కోఆపరేటివ్ బ్యాంక్ నుంచి తీసుకున్న పంట రుణాలను మాఫీ చేస్తున్నట్టు సోమవారం ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన రుణ మాఫీ ప్రకారం రూ.50,000 వర పంట రుణాలు తీసుకున్న సన్నకారు రైతులకు పూర్తిగా రుణ మాఫీ చేస్తారు. రూ.50 వేలకు పైబడి తీసుకున్న రుణాలకు 50 శాతం మాఫీని ప్రకటించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలో సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమీపంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారం 2025 మే 1 నుండి 2026 ఫిబ్రవరి 28 మధ్యకాలంలో సహకార బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు మాత్రమే తాజా రుణమాఫీ వర్తిస్తుంది. ప్రభుత్వ నిర్ణయంతో 14.22 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని, రాష్ట్ర ఖజానాపై రూ.2,044 కోట్ల భారం పడుతుందని విజయ్ తెలిపారు.

**మేకేదాటు ప్రాజెక్టుపై సమీక్ష**

కావేరీ నదిపై కర్ణాటక ప్రతిపాదిత మేకేదాటు ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వ ఏవిధంగా స్పందించాలనే దానిపై కూడా ముఖ్యమంత్రి విజయ్ ఉన్నత స్థాయి సమావేశంలో చర్చించారు. కర్ణాటక ప్రతిపాదనను తమిళనాడు వ్యతిరేకిస్తూ వస్తోంది. ప్రాజెక్టు నిర్మాణంతో రాష్ట్రాలకు రావాల్సిన జలాలపై ప్రభావం పడుతుందని, రైతులకు నష్టం జరుగుతుందని తమిళనాడు ప్రభుత్వ వాదనగా ఉంది. కర్ణాటకలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇటీవల భూమిపూజ జరగడం, ఈ వివాదంపై లీగల్ స్టాటస్‌ను విజయ్ సమావేశంలో అధికారులు సమీక్షించారు. కోర్టు అభిప్రాయాలను పరిగణనలోకి తీసుని సమగ్ర సంప్రదింపుల అనంతరం తీసుకోవాల్సిన లీగల్ చర్యలను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మంత్రి ఎన్.ఆనంద్, ఆధవ్ అర్జున, ఆర్.నిర్మల్‌కుమార్, అడ్వకేట్ జనరల్ విజయ్ నారాయణ్ తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఘనంగా పద్మ అవార్డుల ప్రదానోత్సవం




## పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీలను అందించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. దేశంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు భారత ప్రభుత్వం.. దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీలను ప్రదానం చేసింది. ఈ ఏడాది మొత్తం 131 మందికి ఈ పురస్కారం దక్కగా.. వారిలో ఐదుగురు పద్మవిభూషణ్, 13 మంది పద్మభూషణ్, 113 మంది పద్మశ్రీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఈ పురస్కారాల్ని అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తోంది. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ వైద్యుడు జి.వెంకట్రావుకు, క్యాన్సర్ వైద్య సేవల్లో విశేష కృషి చేసిన డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి పద్మ గౌరవం లభించింది. అలాగే కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మ అవార్డు దక్కింది. అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి అభినందిస్తూ.. దేశాభివృద్ధికి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

# ఎబోలా వైరస్ ముప్పుపై కేంద్రం అప్రమత్తం




## ఉన్నతస్థాయి సమావేశంలో ఆరోగ్యమంత్రి నడ్డా సమీక్ష

ఎబోలా వైరస్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. పరిస్థితిని సమీక్షించేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తాజాగా ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఇక ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి భారత్‌కు వచ్చే ప్రయాణికులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు సూచనలు చేసింది. జ్వరం, వాంతులు, అకారణ రక్తస్రావం, తలనొప్పి, వంటి సమస్యలు తలెత్తిన వెంటనే ఎయిర్‌పోర్టు హెల్త్ ఆఫీసర్‌కు ఇమిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే వెల్లడించాలని స్పష్టం చేసింది. ఎబోలా కేసులు అధికంగా ఉన్న డీఆర్‌సీ, ఉగాండా, దక్షిణ సుడాన్‌కు వెళ్లవద్దని కేంద్రం ఇప్పటికే భారతీయులకు సూచించింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టుల్లో నిఘాను కట్టుదిట్టం చేశారు. లెబొరేటరీలు, క్వారంటైన్ వసతులను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు, ఆఫ్రికాలో ఇప్పటివరకూ 900లకు పైగా ఎబోలా అనుమానిత కేసులు వెలుగు చూశాయని డబ్ల్యూహెచ్‌ఓ తాజాగా వెల్లడించింది. 101 కేసుల్లో ఇప్పటికే వ్యాధి నిర్ధారణ అయ్యిందని వెల్లడించింది. ఇక యూఎస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ ప్రకారం, ఎబోలా వ్యాప్తి ఎక్కువగా ఉన్న డీఆర్‌సీ దేశంలో 904 అనుమానిత కేసులు వెలుగులోకి రాగా 101 మంది రోగుల్లో ఎబోలా వ్యాధి నిర్ధారణ అయ్యింది. ఇప్పటికే 119 మంది ఎబోలా వల్లే మరణించినట్టు అనుమానాలు ఉన్నాయి. మరో 10 కేసుల్లో ఎబోలా వల్లే మరణాలు సంభించినదని కూడా పరీక్షల్లో తేలింది. మే 24 వరకూ ఉన్న వివరాల ప్రకారం, ఉగాండాలో 5 నిర్ధారిత కేసులు, ఒక ఎబోలా మరణం వెలుగులోకి వచ్చింది. ఆఫ్రికా దేశాల్లో జాతీయ స్థాయిలో ఎబోలా వ్యాప్తి చెందే రిస్క్ ఎక్కువగా ఉందని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంది. ప్రపంచస్థాయి వ్యాప్తి ముప్పు కొంత తక్కువగా ఉందని పేర్కొంది.

# ఎంపీ అభిషేక్ బెనర్జీ నివాసానికి పోలీసులు

తృణమూల్ కాంగ్రెస్‌లో నెంబర్ 2గా ఉన్న ఆ పార్టీ డైమండ్ హార్బర్ ఎంపీ అభిషేక్ బెనర్జీ నివాసానికి సోమవారం నాడు పెద్దఎత్తున కోల్‌కతా పోలీసులు చేరుకున్నారు. అభిషేక్ బెనర్జీ ఆస్తులకు సంబంధించి టీఎంసీ నిర్వహణలోని కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ ఇటీవల నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో 188ఏ హర్ష ముఖర్జీ రోడ్డులోని శాంతినికేతన్ వద్దనున్న అభిషేక్ బెనర్జీ అధికారిక నివాసానికి పోలీసులు రావడం ఆసక్తికరంగా మారింది. అయితే కొద్ది సేపటికే అధికారులు ఎలాంటి ప్రకటన చేయకుండా అక్కడి నుంచి నిష్క్రమించారు. అభిషేక్ బెనర్జీకి చెందిన పలు ఆస్తుల విషయంలో కేఎంసీ ఇటీవల నోటీసులు జారీ చేసింది. బిల్డింగ్ ప్లాన్ ఆమోదానికి సంబంధించిన డాక్యుమెంట్లు చూపించాలని కోరింది. అభిషేక్‌కు చెందిన, ఆయనకు సంబంధం ఉన్నట్టుగా భావిస్తున్న 17 నుంచి 21 ప్రాపర్టీలకు సంబంధించి కేఎంసీ చట్టం-1980లోని సెక్షన్ 400(1) కింద ఈ నోటీసులు పంపింది. కాగా, కేఎంసీ చట్టంకింద తాము విధాన నిర్ణేతలమని, నోటీసుల విషయం తనకు తెలియదని టీఎంసీ ఎమ్మెల్యేగా కూడా ఉన్న కోల్‌కతా మేర్ ఫిర్హద్ హాకీం తెలిపారు. అభిషేక్ బెనర్జీకి నోటీసుల వ్యవహారంపై బీజేపీ స్పందించింది. ఆయనేమీ చట్టానికి అతీతుడేమీ కాదని, పదిహేనుళ్లుగా చట్టానికి అతీతంగా వ్యవహరించినప్పటికే అది ఎంతోకాలం సాగదని రాష్ట్ర మంత్రి అగ్నిమిత్ర పాల్ తెలిపారు. అభిషేక్ బెనర్జీ బిల్డింగ్‌లోని కొంతభాగం ఎలాంటి అనుమతి లేకుండా నిర్మించినట్టు తెలుస్తోందని, దీనిపై అందరిలాగా ఆయన కూడా కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. సరైన పేపర్లు, డాక్యుమెంట్లు ఉంటే ఎలాంటి చర్యలు ఉండవని, లేకుండా అది వారి తప్పదమే అవుతుందని అన్నారు. మరోవైపు, అభిషేక్ బెనర్జీకి నోటీసులపై బీజేపీని టీఎంసీ తప్పుపట్టింది. అవన్నీ కట్టుకథలేనని, వాటికి విశ్వసనీయత లేదని పేర్కొంది. నోటీసుల పేరుతో బీజేపీ అనధికారంగా లీకులు ఇస్తోందని విమర్శించింది.



# తమిళనాడులో భారీ అగ్ని ప్రమాదం

## ప్రైవేట్ ఆయిల్ గోదాంలో ఒక్కసారిగా చెలరేగిన మంటలు



తమిళనాడు రాజధాని చెన్నై పరిధిలోని మనాలి ప్రాంతంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. లక్ష్మీనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆయిల్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గోదాంలో భారీగా నిల్వ ఉంచిన ఆయిల్ బ్యారెళ్లు వరుసగా పేలిపోయాయి. ఈ ప్రమాదంలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గోదాంలో దాదాపు లక్ష లీటర్ల ముడి చమురు (క్రూడ్ ఆయిల్) నిల్వ ఉన్నట్లు సమాచారం. మంటల తీవ్రతకు ఆయిల్ బ్యారెళ్లు పెద్ద శబ్దాలతో పేలుతూ, దాదాపు 60 అడుగుల ఎత్తు వరకు పైకి ఎగిరిపడ్డాయి. ప్రమాద స్థలం నుంచి దట్టమైన నల్లటి పొగ మైళ్ల దూరం వరకు వ్యాపించడంతో మనాలి, దాని పరిసర ప్రాంతాలు దట్టమైన పొగతో నిండిపోయాయి. స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న వెంటనే మనాలి, ఎన్నూర్, మాధవరం ప్రాంతాల నుంచి భారీగా ఫైర్ ఇంజిన్లు రంగంలోకి దిగాయి. అయితే, ఆయిల్ బ్యారెళ్లు నిరంతరాయంగా పేలుతుండటంతో అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఆరు గంటలుగా సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. సాధారణ నీటితో ఆయిల్ మంటలు అదుపు కాకపోవడంతో, రసాయన నురుగు కలిపిన నీటిని ఉపయోగించి మంటలను అణచివేసేందుకు రెస్క్యూ టీమ్స్ రంగంలోకి దిగాయి. ఈ ప్రమాదంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస భద్రతా ప్రమాణాలు, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోకుండానే నివాస ప్రాంతాలకు సమీపంలో ఇలాంటి ప్రమాదకరమైన ఆయిల్ గోదాములను నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతానికి ప్రమాద స్థలంలో ఉద్రిక్త పరిస్థితి కొనసాగుతుండగా, పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస భద్రతా ప్రమాణాలు, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోకుండానే నివాస ప్రాంతాలకు సమీపంలో ఇలాంటి ప్రమాదకరమైన ఆయిల్ గోదాంలను విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

# అయితే గొప్పగా.. లేదంటే లేదు

## ఇరాన్‌తో ఒప్పందంపై ట్రంప్ వ్యాఖ్య



యుద్ధం ముగింపుపై అమెరికా -ఇరాన్‌మధ్య శాంతి చర్చలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కుదిరే ఏ ఒప్పందమైనా చాలా గొప్పగా ఉంటుందని.. లేదంటే అసలు ఉండదని పేర్కొన్నారు. తాము చర్చల స్థాయిలోనే ఉన్నామని.. ఒప్పందం ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేశారు. తమ నేతలు ఇరాన్ ముందు ఉంచిన ప్రతిపాదనలకు ఆ దేశం అంగీకరిస్తేనే ఈ విషయంలో ముందడుగు వేస్తామన్నారు. ప్రస్తుతం చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని.. ఈ విషయంపై గల్ఫ్ దేశాల అధినేతలతోనూ సంప్రదింపులు జరుపుతున్నానని తెలిపారు. టెహ్రాన్‌తో తాము కుదుర్చుకోబోయే ఒప్పందంపై ఎటువంటి అవగాహన లేని డెమోక్రాట్లు తమ యంత్రాంగాన్ని విమర్శిస్తుండడం నవ్వు తెప్పిస్తోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. తాను సాధించే ప్రతి విజయాన్ని విమర్శించడమే వారి పని అని అసహనం వ్యక్తం చేశారు. అటువంటి వ్యక్తులు దేశంలో విభజనను, ప్రజలకు నష్టాన్ని కలిగించడం తప్ప మరేమీ చేయరన్నారు. గతంలో ఒబామా, ఆయన యంత్రాంగంలోని అనుభవం లేని అధికారులు ఇరాన్ అణు ఒప్పందాన్ని ప్రతిపాదించి, అమలులోకి తెచ్చారని విమర్శించారు. వారు చేసుకున్న ఒప్పందానికి.. తాము జరుపుతున్న చర్చలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఇరాన్‌కు 'అణు'శక్తిని అందించే ఒప్పందాలను అంగీకరించబోనని స్పష్టం చేశారు.

### రహస్య ప్రదేశంలో మొజ్తబా?

అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై సుదీర్ఘంగా చర్చలు జరుగుతున్నా.. అవి ఇంకా ఓ కొలిక్కిరాలేదు. దీనికి కారణం ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ అందుబాటులో లేకపోవడమేనని తెలుస్తోంది. మొత్తాబా ప్రస్తుతం రహస్య ప్రాంతంలో ఉన్నాడని అగ్రరాజ్య ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. కేవలం దూతల సాయంతోనే అధికారులు, నాయకులకు ఖమేనీ సందేశాలు పంపిస్తున్నాడట. "అమెరికా-ఇరాన్ ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్ వర్క్‌ను మొజ్తాబా ఖమేనీ చూసినట్టు మాకు సమాచారం అందింది. అయితే, దానిపై ఆయననుంచి ఇంకా ఎటువంటి సమాధానం రాలేదు. ఇరాన్‌కు చెందిన సీనియర్ అధికారులు కూడా ఖమేనీని నేరుగా సంప్రదించలేకపోతున్నారు. అందుకే చర్చలు ఆలస్యమవుతున్నాయి" అని అమెరికా నిఘా వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. ఖమేనీతో పాటు టెహ్రాన్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులు కూడా వారాలతరబడి బంకర్లలోనే ఉంటున్నట్టు తెలుస్తోంది. వీరంతా నేరుగా మాట్లాడుకోవడం లేదని సమాచారం. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించిన తొలిరోజే సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీని అంతమొందించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అలీ ఖమేనీ కుమారుడు మొజ్తాబాను సుప్రీం నేతగా ఎన్నుకొన్నారు. అయితే, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మొజాబా కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి పలుమార్లు వార్తలు రాగా.. వాటిని ఇరాన్ తోసిపుచ్చింది. ఆయన ఆరోగ్యంగానే ఉన్నాడని తెలిపింది. అయితే, ఇప్పటివరకు మొజాబా బహిరంగంగా కన్పించలేదు. మాట్లాడలేదు. దీంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఖమేనీ హోదాలో ఎవరున్నా వారు తమ టార్గెట్‌లోనే ఉంటారని ఇజ్రాయెల్ పదేపదే హెచ్చరికలు పంపుతోంది. ఈ పరిణామాల వేళ మొత్తాబా రహస్య ప్రాంతంలో ఉన్నట్టు వార్తలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### అప్పటి వరకూ హర్మూజ్ దిగ్బంధనమే..

ఇరాన్‌తో ఒప్పందం కోసం తామేమీ తొందరపడటం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ట్రూత్ సోషల్ పోస్టు చేశారు. అమెరికా అధికారులు చర్చల కోసం తగినంత సమయం తీసుకోవాలని సూచించారు. ఇక హర్మూజ్ జలసంధిలో ఇరాన్



నౌకల దిగ్బంధం డీల్ ఓ కొలిక్కి వచ్చేవరకు కొనసాగుతోందని వెల్లడించారు.

### వీడని సస్పెన్స్..!

వాస్తవానికి ఇరాన్-అమెరికా ఒక ఒప్పందం దిశగా ముందడుగు వేసినట్టు వార్తలు. వస్తున్నా.. అవి కుదిరేసరికి ఎన్నాళ్ల సమయం పడుతుందో చెప్పలేమని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే పర్షియన్ గల్ఫ్ యుద్ధం నాటినుంచి 1,500-2,000 నౌకలు చిక్కుకుపోయి ఉన్నాయి. తక్షణమే హర్మూజ్‌ను తెరిచినా.. పలు కారణాలతో షిప్పింగ్ సాధారణ స్థాయికి రావడానికి చాలా సమయం పడుతుందన్న అంచనాలున్నాయి. నౌకాయాన సంస్థలు సదరు ఒప్పందం స్థిరంగా ఉంటుందని తొలుత నమ్మాల్సి ఉంటుంది. ఇక జలసంధిలో అమర్చిన సీమైన్స్‌ను తొలగించడానికి ఎంతకాలం పడుతుందనేది కూడా తెలియాల్సిఉంది. అమెరికా, ఇతర దేశాల నౌకాదళాలు మైన్ స్వీపింగ్ నౌకలను ఈ ప్రాంతంలో మోహరించేందుకే చాలా సమయం పట్టొచ్చని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ అంచనా వేసింది. చమురు ఎగుమతి ఆపరేషన్లు స్థిరపడటానికి కనీసం రెండునుంచి మూడు నెలల సమయం పట్టొచ్చు.





# పైలెట్‌కు గుండెపోటు!

### విమానం 30వేల అడుగుల ఎత్తులో ఉన్న సమయంలో..

విమానం గాల్లో 30వేల అడుగుల ఎత్తులో ఉండగా పైలట్‌కు గుండెపోటు వచ్చిన ఘటన స్పెయిన్‌లోని టెనెరెట్ నుంచి బర్మింగ్‌హామ్‌కు వెళ్తున్న జెట్ విమానంలో చోటుచేసుకుంది. దీంతో విమానాన్ని పోర్చుగల్‌లోని ఫ్రాన్సిస్కో సా కార్నీరో ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు. వెంటనే పైలట్‌కు వైద్యసాయం అందించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున జెట్ విమానం స్పెయిన్‌లోని టెనెరెట్‌నుంచి బర్మింగ్‌హామ్‌కు బయల్దేరింది. విమానం 30,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా.. పైలెట్‌కు గుండెపోటు వచ్చినట్టు కో పైలట్ గుర్తించారు. వెంటనే దగ్గరలో ఉన్న ఫ్రాన్సిస్కో సా కార్నీరో ఎయిర్‌పోర్టు అధికారులను అప్రమత్తం చేశారు. విమానం ఎయిర్‌పోర్టుకు చేరుకునే సమయానికి అధికారులు అత్యవసర వైద్య ఏర్పాట్లు చేసి పైలట్‌కు వెంటనే వైద్యసాయం అందించినట్టు అధికారులు పేర్కొన్నారు. ఘటన సమయంలో విమానంలో 220మంది ప్రయాణికులున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన నేపథ్యంలో గంటకుపైగా విమానంలోనే వేచి ఉండాల్సి వచ్చిందని ప్రయాణికులు పేర్కొన్నారు. ఎయిర్‌లైన్స్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేవరకు దాదాపు 13 గంటలపాటు టెర్మినల్లోనే ఉన్నామని.. అయినా అధికారులు తమకు ఎటువంటి వసతి ఏర్పాట్లు చేయలేదని వాపోయారు. శనివారం మరో విమానం ఏర్పాటు చేయడంతో బర్మింగ్‌హామ్‌కు చేరుకున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి జెట్2 క్షమాపణలు చెప్పింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రత విషయంలో తమ ఎయిర్‌లైన్స్ ఎప్పుడూ రాజీ పడబోదని వెల్లడించింది.

# 2నెలల ముందే ఎబోలా వ్యాప్తి

## నివ్వెరపరుస్తున్న కాంగో తీరు

ఆఫ్రికా దేశాల్లో వేగంగా వ్యాపిస్తోన్న ఎబోలా యావత్ ప్రపంచానికి గుబులు పుట్టిస్తోంది. ఇప్పటికే భారత్ సహా పలు దేశాలు అప్రమత్తమై వైరస్ వ్యాప్తి కట్టడికి చర్యలు చేపట్టాయి. కానీ, ఈ సంక్షోభం పుట్టుకొచ్చిన కాంగోలో మాత్రం ఎబోలా నియంత్రణపై అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ వైరస్ వ్యాప్తి మొదలైంది కూడా రెండు నెలల కిందటే అయినా.. దాన్ని గుర్తించడంలో వారు చాలా ఆలస్యం చేసినట్టు తెలుస్తోంది.

### ఐసోలేషన్ లేదు.. శానిటైజర్ దొరకదు..

ఈశాన్య కాంగోలోని బునియా నగరంలో మే 15న ఎబోలా తొలి కేసు నమోదైంది. కానీ, అంతకంటే దాదాపు రెండు నెలలముందే అక్కడ ఈ వైరస్ వ్యాప్తి మొదలైనట్టు అంతర్జాతీయ సంస్థల విచారణలో తేలింది. దీన్నిబట్టి చూస్తే ఊహించిన దానికంటే తీవ్రస్థాయిలో ఇప్పటికే వైరస్ వ్యాప్తి చెంది ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక, బునియాలో కేసు బయటపడిన తర్వాత కూడా కట్టడి చర్యలు తూతూమంత్రంగా ఉన్నాయట. ఎబోలా లక్షణాలున్న వారిని ఐసోలేషన్‌లో ఉంచడం, వైద్యులు పీపీఈ కిట్లు ధరించడం వంటివి మచ్చుకైనా అక్కడ కన్పించట్లేదు. ఇక, శానిటైజర్లు, టెస్ట్ కిట్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి. జనరేటర్లకు సరిపడా ఇంధనం లేక.. రోజుకు 20నుంచి 40మందికి మాత్రమే టెస్టులు చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.

### నిధుల కొరత..

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగోకు గతేడాది భారీగా నిధుల కోత విధించారు. దీంతో ఈ దేశం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. మరోవైపు, అంతర్జాతీయ సహాయ సంస్థలకు కూడా నిధుల కొరత ఏర్పడింది. దీంతో వైరస్ నియంత్రణకు అవసరమైన వైద్య సౌకర్యాలు కల్పించే అవకాశం లేకుండా పోయిందని అధికారులు చెబుతున్నారు. 1976లో తొలిసారి ఎబోలా వైరస్ బయటపడిన తర్వాత.. కాంగోలో ఈ వైరస్ వ్యాప్తి చెందడం ఇది 17వ సారి. అయితే, గతంతో పోలిస్తే ఈసారి బయటపడిన బుండిబుగ్యో వైరస్ రకం చాలా ప్రమాదకరంగా కన్పిస్తోంది. ఇప్పటివరకు 900 కేసులు నమోదవగా.. మరణాల రేటు 40 శాతంగా ఉన్నట్టు కాంగో అధికారులు వెల్లడించారు. అయితే, మరణాల సంఖ్య అధికారిక ధ్రువీకరణేదీ లేదు.

### మృతదేహాల కోసం దాడులు..

ఇదిలాఉండగా.. ఎబోలా రోగులకు చికిత్స అందిస్తోన్న ఓ ఆసుపత్రిపై ఆదివారం రాత్రి కొందరు యువకులు దాడి చేశారు. ఈ వైరస్‌తో ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు వ్యక్తుల మృతదేహాలను తీసుకెళ్లిపోయారు. వ్యాధి విస్తరణ భయంతో ఎబోలా పీడితుల శవాలకు అధికారులే అంత్యక్రియలు జరుపుతున్నారు. దీనిపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత ఎక్కువవుతోంది.

సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు జరగట్లేదంటూ కొందరు బాధ్యతారహితంగా వ్యవహరించి ఎబోలా సోకినవారి మృతదేహాలను తీసుకెళ్తున్నారు. దీనివల్ల వైరస్ మరింత వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



### ఫ్రెంచ్ ఓపెన్‌లో ప్రవాసాంధ్రుడి సంచలనం

# తొలిరౌండ్‌లో ఘన విజయం

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీలో భారతీయ మూలాలున్న నిశేష్ బసవరెడ్డి సంచలన విజయం సాధించాడు. పారిస్ వేదికగా జరిగిన తొలి రౌండ్‌లో ఏడో సీడ్ ఆటగాడు టేలర్ ఫ్రిట్జ్‌పై ఘన విజయం సాధించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు.



అమెరికా తరఫున 21 ఏళ్ల నిశేష్ వైల్డ్ కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగాడు. టేలర్‌పై 7-6 (5), 7-6 (5), 6-7 (9), 6-1 తేడాతో నిశేష్ విజయం సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. దీంతో నిశేష్ బసవరెడ్డి ఒక్కసారిగా వార్తల్లో నిలిచాడు.

**ఎవరీ నిశేష్ బసవరెడ్డి**

నిశేష్‌రెడ్డి 2005 మే 5న కాలిఫోర్నియా లోని న్యూపోర్ట్ బీచ్‌లో జన్మించాడు. సాయి ప్రసన్న, మురళీకృష్ణ అతడి తల్లిదండ్రులు. అయితే ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు వారి స్వస్థలం. కాగా 1999లో అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. నిశేష్ చిన్న వయసులోనే తన తండ్రి టెన్నిస్ పరిచయం చేశాడు. కోచ్ బ్రయాన్ స్మిత్ వద్ద శిక్షణ పొందాడు. మాజీ ప్రపంచ నంబర్ 1 డబుల్స్ ప్లేయర్ రాజీవ్ రామ్ మార్గదర్శకత్వం కూడా నిశేష్‌కు లభించింది. 2022లో జరిగిన యూఎస్ ఓపెన్‌లో నిశేష్.. ఓజాన్ బారిస్‌తో కలిసి.. బాయ్స్ డబుల్స్ టైటిల్ గెలుచుకున్నాడు. ఇలా జూనియర్ సర్క్యూట్‌లో తొలిసారిగా అందరి దృష్టినీ ఆకర్షించాడు. 2023లో ఐటీఎఫ్ జూనియర్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్-3 స్థానానికి చేరుకు న్నాడు. అలాగే ఏటీపీ ఛాలెంజర్ టూర్ 2024 సీజన్‌లో నూ అద్భుతమైన ప్రదర్శన కనబర్చాడు. రెండు ఏటీపీ ఛాలెంజర్ టైటిళ్లు గెలిచి టెన్నిస్ ప్రపంచంలో తన ముద్ర వేశాడు. 2025లో ఆస్ట్రేలియన్ ఓపెన్ ద్వారా గ్రాండ్ స్లామ్ అరంగేట్రం చేసిన నిషేశ్.. తొలి మ్యాచ్‌లోనే దిగ్గజ ఆటగాడు జకోవిచ్‌పై తొలి సెట్ గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఇప్పుడు ఫ్రెంచ్ ఓపెన్‌లో టేల ర్ ఫ్రిట్జ్‌ను ఓడించడం ద్వారా మరోసారి తన సత్తా చాటాడు.

# నార్వే చెస్ బరిలో హంపి



ఓస్లో (నార్వే): ప్రఖ్యాత నార్వే చెస్ పోటీల్లో కోనేరు హంపితో పాటు గుకేష్, ప్రజ్ఞానంద బరిలోకి దిగుతున్నారు. సోమవారం ప్రారంభమయ్యే ఈ టోర్నీ జూన్ ఐదో తేదీ వరకు జరగనుంది. పురుషుల కేటగిరీలో గుకేష్,ప్రజ్ఞానందతో పాటు మాగ్నస్ కార్లసన్ (నార్వే), అలీరెజా (ఫ్రాన్స్), కీమెర్ (జర్మనీ) వెస్లీ సో (అమెరికా) పోటీ పడనున్నారు.మహిళల విభాగంలో హంపి,దివ్యా దేశ్‌ముఖ్‌తో పాటు జు వెన్‌జున్ (చైనా), డిఫెండింగ్ నార్వే చాంపియన్ అన్నా ముజిచుక్ (ఉక్రెయిన్), వరల్డ్ బ్లిట్జ్ చాంపియన్ అసౌబయేవా (కిజికిస్థాన్), జు జిన్నెర్(చైనా) టైటిల్ కోసం బరిలో ఉన్నారు.

# మైదానంలోనే గుండెపోటుతో మృతి


బెంగళూరు: కర్ణాటక మాజీ ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ అక్షయ్ మైదానంలో గుండెపోటుతో మరణించాడు. ఆదివారం జరిగిన డివిజన్ 3 మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా మొదట తీవ్ర అసౌక ర్యానికి గురయ్యాడు. అనంతరం 4 ఓవర్లు బౌలింగ్ చేశాక మైదానం వీడి విశ్రాంతి తీసుకున్నాడు. తిరిగి మైదానంలోకి అడుగుపెట్టిన అక్షయ్ ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది.



# పాపం పంజాబ్.. కలగానే 'తొలి కప్పు'!



పంజాబ్: తొలి 7 మ్యాచుల్లో ఓటమే లేదు.. టేబుల్ టాపర్. భీకరమైన బ్యాటింగ్ ఆర్డర్.. విజృంభిస్తున్న బౌలర్లు. ఇంకేముం ది.. ప్లే ఆఫ్స్ బెర్తు ఖాయం చేసుకునే తొలి టీమ్‌గా మారుతుందని భావించారంతా! కానీ సీన్ రివర్స్ అయింది. ఆ తర్వాత గెలుపే కరవైంది. టోర్నీ సెకండాఫ్‌లో వరుసగా ఆరు ఓటములు ఎదుర య్యాయి. వాహ్వా పంజాబ్ అని ప్రశంసించిన నోళ్లే.. 'పాపం.. పంజాబ్' అనేలా తయారైంది జట్టు పరిస్థితి. తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో గెలిచినా.. దురదృష్టం వెంటాడింది. చివరికి ప్లే ఆఫ్స్ రేసు నుంచి వైదొలిగింది. 'తొలి కప్పు' కల.. కలలాగే మిగిలి పోయింది. గతేడాది ఫైనలిస్ట్ పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ 2026 సీజన్‌ను ఘనంగా ప్రారంభించింది. ప్రత్యర్థులు వణికిపోయేలా విజయాలు నమోదు చేసింది. కేకేఆర్‌తో మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా.. వరుసగా ఆరు మ్యాచుల్లో గెలిచి 'తొలి కప్పు' కలను నెరవేర్చుకునేలా కనిపించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్.. దూకుడు గా ఆడటమే కాకుండా జట్టును నడిపించిన తీరు ఆకట్టుకుంది. కానీ రెండో స్టేజ్ మొదలైన తర్వాత పంజాబ్ కింగ్స్‌కు అసలైన సవాల్ ఎదురైంది. తొలుత విజయాలు వరించినా.. ఆ తర్వాత గెలుపు కనీసం పలకరించేందుకు కూడా అవకాశం లేకపోయింది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో విజ యం సాధించింది. కానీ.. ముంబైపై రాజస్థాన్ రాయల్స్ గెలుపొం దడంతో పంజాబ్ టోర్నీ నుంచి ఎలిమినేట్ అయింది.




**ఆ ఒక్క పోస్ట్ చేయకుండా ఉండాల్సింది..**

ఈ సీజన్‌లో అత్యధికంగా 200ప్లస్ స్కోర్లు ఇచ్చిన జట్టు పం జాబ్ కింగ్సే. అలాగే ఐపీఎల్ చరిత్రలో భారీ స్కోరును ఛేదించిన జట్టూ పంజాబే. ఢిల్లీపై ఏకంగా 265 పరుగుల టార్గెట్‌ను ఛేదిం చి విజయం సాధించింది. వరుసగా రెండు మ్యాచుల్లోనూ 250 ప్లస్ స్కోర్లు చేసిన టీమ్‌గానూ అవతరించింది. కానీ, ఎప్పుడైతే రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఓటమి ఎదురైందో.. ఇక కోలుకోలేదు. వరుస పరాభవాలతో కుదేలైంది. మరో హోం గ్రౌండ్ ధర్మశాలలో ఆడిన ప్రతి మ్యాచ్ ఓడిపోయింది. రాజస్థాన్‌తో మ్యాచ్ సమ యంలో పంజాబ్ పెట్టిన ఓ పోస్ట్ తీవ్ర చర్చనీయాంశమైంది. ఆర్సీబీ ఆల్‌టైమ్ అన్‌వాంటెడ్ రికార్డు 49 ఆలౌట్‌ను ట్రోల్ చేస్తూ ఎక్స్ ఖాతాలో పంజాబ్ పోస్ట్ పెట్టింది. ఆర్సీబీని ట్రోల్ చేయడం వల్లే పంజాబ్‌కు ఈ దుస్థితి అంటూ సోషల్ మీడియాలో పోస్ట్‌లు వైరల్ అయ్యాయి. ఒక్క పోస్ట్ చేయకుండా ఉండాల్సిందంటూ నెటిజ న్లు కామెంట్లు పెడుతున్నారు.

**చెత్త ఫీల్డింగ్..**

చాహల్, అర్ష్‌దీప్ సింగ్, యాన్సెన్.. వంటి అద్భుతమైన బౌలర్లు పంజాబ్ సొంతం. ఫస్టాఫ్‌లో ఉన్న ప్లేయర్లే సెకండాఫ్‌లోనూ ఉన్నారు. కానీ ఫీల్డింగ్, బౌలింగ్‌లో పంజాబ్ గతి తప్పింది. అర్ష్‌దీప్, ఫెర్గుసన్, యాన్సెన్ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. మరీ ముఖ్యంగా ఈ సీజన్‌లో పంజాబ్ ఏకంగా 20కి పైగా క్యాచ్‌లు జారవిడిచింది. పంజాబ్ ఓడిపోవడంలో ఇవే అత్యంత కీలక పాత్ర పోషించాయి. కీలక సమయంలో విధ్వంస కర బ్యాటర్లు ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఫామ్ కోల్పోయారు. ఇది కూడా జట్టుపై ప్రభావం చూపింది. ఆఖరి మ్యాచ్‌లో శ్రేయస్.. ఐపీఎల్‌లోనే తొలి సెంచరీని నమోదు చేసి జట్టును విజయతీరాలకు చేర్చినా.. అదృష్టం కలిసి రాలేదు. 15 పాయింట్లతో లీగ్ స్టేజ్‌లోనే టోర్నీ నుంచి ఎలిమినేట్ అయింది. పంజాబ్ కింగ్స్ జట్టు.. 16 సీజన్లలో లీగ్ దశలోనే ఇంటి బాట పట్టగా.. 2008లో సెమీస్, 2014, 2025లో రన్నరప్‌గా నిలిచింది.

# ఫైనల్‌కు తొలి అడుగు ఎవరిదో?

### నేడు ఆర్సీబీ, గుజరాత్ క్వాలిఫయర్ 1 మ్యాచ్

ధర్మశాల: ఐపీఎల్ 2026 తుది అంకానికి చేరుకుంది. మంగళవారం (మే 26) నుంచి ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లు మొదలుకానున్నాయి. ధర్మశాల వేదికగా మంగళవారం తొలి క్వాలిఫయర్‌లో ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ తలపడనున్నాయి. ఇందులో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు దూసుకెళ్తుంది. ఓడిన జట్టు ఎలిమినేటర్ మ్యాచ్ విజేతతో క్వాలిఫయర్-2 ఆడుతుంది. క్వాలిఫయర్-1తోనే ఫైనల్లో అడుగుపెట్టాలని ఆర్సీబీ, గుజరాత్ పెద్ద ప్లానింగ్‌తోనే వస్తున్నాయి. దీంతో మ్యాచ్ హోరాహోరీగా సాగడం ఖాయం! ఈ సీజన్లో బెంగళూరు 14 మ్యాచ్‌లో 3 విజయాలతో టాప్‌లో నిలిచింది. గుజరాత్ కూడా ఏ మ్యాచ్ గెలిచి 18 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ప్రస్తుత సీజన్‌లో లీగ్ దశలో ఆర్సీబీ, గుజరాత్ జట్లు రెండుసార్లు తలపడ్డాయి. తమ హోం గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో గెలిచాయి. ఓవరాల్‌గా చూస్తే ఐపీఎల్‌లో ఇరుజట్ల మధ్య ఎనిమిది మ్యాచ్‌లు జరిగాయి. చెరో నాలుగు మ్యాచ్‌లలో విజయం సాధించాయి. క్వాలిఫయర్-1 జరగనున్న ధర్మశాల మైదానం ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లకు ఆతిథ్య మిచ్చింది. ధర్మశా లలో మొదటి ఇన్నింగ్స్ సగటు స్కోరు 211. రెండు సార్లు ఛేజింగ్ చేసిన జట్టు గెలిచింది. టాస్ గెలిచిన జట్టు ఛేజింగ్ వైపు మొగ్గ చూపొచ్చు.



# ప్రపంచ రికార్డు బద్దలు కొట్టిన సూర్యవంశీ

రాజస్థాన్: రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకు న్నాడు. ముంబై ఇండియన్స్‌తో జరిగిన కీలక పోరులో తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరినా.. ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. 15 ఏళ్ల వైభవ్.. టీ20 టోర్నీ లేదా సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. ముంబైతో మ్యాచ్‌కు ముందు 579 పరుగులతో ఉన్న అతడు.. ఈ మ్యాచ్ లో 6 బంతుల్లో 4 పరుగులు చేశాడు. దీంతో ఈ సీజన్‌లో తన పరుగుల సంఖ్యను 583కు పెంచుకున్నాడు. ఈ క్రమంలో దేవదత్ పడిక్కల్ రికార్డును బ్రేక్ చేశాడు. 2019-2020 దేశవాళీ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో కర్ణాటక తరఫున పడిక్కల్ 580 పరుగులు చేశాడు. తాజాగా వైభవ్ సూర్యవంశీ ఆ రికార్డును బ్రేక్ చేశాడు. ఇదిలా ఉంటే ఐపీఎల్ 2026 టోర్నీ ఆరంభంలో వరుస విజయాలతో ఫామ్ కనబర్చిన రాజస్థాన్.. మధ్యలో గాడి తప్పి ప్లే ఆఫ్స్ ఆశలను సంక్లిష్టం చేసుకుంది. ముంబై ఇండియన్స్‌పై తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో 30 పరుగు ల తేడాతో విజయం సాధించి ప్లే ఆఫ్స్ బెర్తు ఖాయం చేసుకుం ది. బ్యాటర్లు కాస్త తడబడినప్పటికీ.. బౌలర్లు మాత్రం చెలరేగి ఆడారు. జోఫ్రా ఆర్చర్ 3 వికెట్లతో ముంబై పతనాన్ని శాసించా డు. బర్గర్ 2, బ్రిజేశ్ శర్మ 2, యశ్‌రాజ్ 2 వికెట్లు పడగొట్టి ఆర్ఆర్‌ను విజయతీరాలకు చేర్చారు. రాజస్థాన్ విజయంతో పంజాబ్ కింగ్స్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. మే 27న ముల్లాన్‌పూర్ వేదికగా జరిగే ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్ హైదరా బాద్‌తో రాజస్థాన్ తలపడనుంది.



చైతన్య రథం
సినిమా
మంగళవారం 26 మే 2026 X

# నా జన్మ ధన్యమైందన్న చరణ్



బెంగళూరులో 'పెద్ది' టీమ్ సందడి చేసింది. జూన్ 4న సినిమా విడుదల కానున్న సందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో హీరో రామ్‌చరణ్, జాన్వీకపూర్, శివరాజ్‌కుమార్, నిర్మాత సతీశ్ కిలారు తదితరులు పాల్గొన్నారు. చరణ్ మాట్లాడుతూ.. "నాకు నచ్చిన పని చేస్తూ మీ అందరి ప్రేమ పొందుతున్నందుకు భగవంతుడికి, మీకు ధన్యవాదాలు. రెండున్నరేళ్ల విరామం తర్వాత 'పెద్ది'తో మళ్లీ తెరపైకి వస్తున్నా. ప్రాణం పెట్టి మరీ ఈ చిత్రంలో నటించా. రాసిపెట్టుకోండి.. ఈ సినిమా ది బెస్ట్ అవుతుంది. శివన్న (శివ రాజ్‌కుమార్) తండ్రిలాంటి వారు. ఇండియన్ సినిమా లెజెండ్ ఆయన. కన్నడ చిత్ర పరిశ్రమ చక్రవర్తి. ఆయనతో కలిసి పని చేయడంతో నా జన్మధన్యమైంది. మా కాంబినేషన్ (జాన్వీకపూర్‌ని ఉద్దేశించి)ను ఎంతోమంది అభిమానులు కోరుకున్నారు. జాన్వీతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. అంకితభావంతో పని చేశారు. దర్శకుడు బుచ్చిబాబు లేనిదే ఈ సినిమా లేదు. ఈ చిత్రం విషయంలో మరో కీలక వ్యక్తి డైరెక్టర్ సుకుమార్. స్ఫూర్తినింపే చిత్రమిది" అని పేర్కొన్నారు. ఈ సినిమా సమర్పకుల్లో సుకుమార్ ఒకరు.

**పవన్-చరణ్ అనుబంధం హత్తుకుంది: శివరాజ్‌కుమార్**

"నిజాయతీ, కష్టపడేతత్వం రామ్‌చరణ్‌ను ఈ స్థాయికి చేర్చాయి. చిరంజీవి, పవన్ కల్యాణ్ ఆశీస్సులు చరణ్ వెంటే ఉంటాయి. ఓ సినిమా ఈవెంట్‌లో చరణ్-ఆయన బాబాయ్ పవన్ మధ్య అనుబంధం నా హృదయాన్ని హత్తుకుంది. ఆ దృశ్యాలు చూడగానే పునీత్ రాజ్‌కుమార్‌తో నాకున్న అనుబంధం గుర్తొచ్చింది. 'పెద్ది' టీమ్ ప్రేమను మర్చిపోలేను. ఈ సినిమాలో స్పోర్ట్స్ మాత్రమే కాదు ఎమోషన్ కూడా ఉంది" అని శివ రాజ్‌కుమార్ అన్నారు.

## కొత్త సినిమాలన్నీ.. ఐదు షోలు!



సినీ నటుడు, తమిళనాడు కొత్త ముఖ్యమంత్రి విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో విడుదలయ్యే ప్రతి తమిళ సినిమా మొదటివారం ఐదు షోలను ప్రదర్శించుకునేలా అనుమతి ఇచ్చారు. సోమవారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో సీఎం విజయ్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా కూడా అడుగులు వేశారు. ఇప్పటివరకూ కొత్తగా ఏ సినిమా విడుదలైనా అదనపు షోలు ప్రదర్శించుకోవాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. అందుకు చిత్ర బృందాలు ముందుగానే ప్రభుత్వం, అధికారులకు అర్జీ పెట్టుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఎలాంటి అనుమతులు అక్కర్లేకుండానే, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, థియేటర్ యజమానుల నిర్ణయం మేరకు అదనపు షోలను ప్రదర్శించుకోవచ్చు.

## 'ధురంధర్' హీరోపై బ్యాన్





ప్రస్తుతం బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా నిలిచిన చిత్రం 'డాన్'. రణ్‌వీర్‌సింగ్ కథానాయకుడిగా ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో ఈ మూవీ పట్టాలెక్కాల్సి ఉంది. అయితే, అనివార్య కారణాలతో ఈ మూవీనుంచి రణ్‌వీర్ తప్పుకొన్నట్టు గత కొంతకాలంగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. అధికారికంగా మాత్రం ఎక్కడా ప్రకటించలేదు. ఈ క్రమంలో "డాన్" నుంచి తప్పుకొన్నందుకుగానూ రణ్‌వీర్ సింగ్‌పై నిషేధం విధించినట్టు ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ ప్రకటించింది. చివరి నిమిషంలో ఆ సినిమానుంచి తప్పుకోవడంతో నిర్మాతకు రూ.40 కోట్ల నష్టం వాటిల్లిందని ఫర్హాన్ అక్తర్ గతంలో తెలిపారు. రణవీర్ సింగ్ ఆ సినిమా స్క్రిప్ట్‌పై అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ క్రమంలో సోమవారం తాజాగా ఆయనపై నిషేధం విధిస్తున్నామని, ఏ సినిమాల్లోకి తీసుకోవద్దని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ ప్రకటించింది. బాలీవుడ్ అగ్ర హీరోలు అమితాబ్ బచ్చన్, షారుకఖాన్లకు 'డాన్' సిరీస్ సినిమాలు అద్భుతమైన విజయాలను అందించాయి. ఈ కోవలో వస్తున్న సినిమా కావడంతో దీనిపై అంచనాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో రణ్‌వీర్ వైదొలిగిన తర్వాత ఆయన స్థానంలో హృతిక్ నటించనున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే ఆ నటుడి టీమ్ వాటిని ఖండించింది. ఈ ప్రాజెక్ట్ కోసం తనను ఎవరూ సంప్రదించలేదని హృతిక్ ఇటీవల స్పష్టంచేశారు. ఇప్పుడు రణ్‌వీర్‌పై ఎఫ్‌డబ్ల్యూఐసీఈ నిషేధం విధించడంతో 'డాన్-3'లో ఎవరు నటిస్తారనే దానిపై సందిగ్ధత నెలకొంది.

## విమర్శకులకు కంగన కౌంటర్



కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఎప్పటిలాగే ఈ ఏడాదీ బాలీవుడ్ నటి ఐశ్వర్యారాయ్ తన ఫ్యాషన్ లుక్‌తో కనిపించారు. పైగా తన కుమార్తె ఆరాధ్యతో కలిసి ఆమె రెడ్ కార్పెట్‌పై హొయలొలికించారు. అయితే, ఐశ్వర్య లుక్‌పై నెట్టింట కొన్ని నెగిటివ్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ కామెంట్స్‌పై కంగనా రనౌత్ విరుచుకు పడ్డారు. 'ఫ్యాషన్, స్టయిల్ అనేది ఎవరికి నచ్చినట్టు వారు ఎంపిక చేసుకునేవి. ఈ విషయంలో ఏ మహిళ కూడా ఎవరికీ ఎటువంటి వివరణ ఇవ్వక్కర్లేదు. కేన్స్‌లో ఐశ్వర్య అద్భుతంగా ఉన్నారు' అని కంగనా తెలిపింది. కంగనా ఇంకా మాట్లాడుతూ.. 'ఐశ్వర్యను మరేదైనా స్టయిల్లో చూడాలనుకునే వారు, మొదట మీ దగ్గర ఏముందో ప్రపంచానికి చూపించండి. అప్పుడు మీకు అర్థమవుతుంది?, 'ఫ్యాషన్, స్టయిల్ అనేది ఎంత కష్టమో. అయినా.. రెడ్‌కార్పెట్‌పై ఎప్పుడూ యువ నటీమణులే ఉండరు. ఇలా 50 ఏళ్లల్లో ఉన్నవారు కూడా ఉంటారు. ఒకవేళ వారిని చూడడం మీకు అలవాటు లేకపోతే, ఇకనైనా అలవాటు చేసుకోండి' అని తన పోస్ట్‌లో కంగనా రాసుకొచ్చారు.

## ఓటీటీ టెస్ట్‌లోనైనా గెలిచేనా?



కమెడియన్ సత్య హీరోగా నటించిన తొలి చిత్రం 'జెట్ లీ'. తెలుగు సినీ పరిశ్రమలో తన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సత్య,హీరోగా ఎంట్రీ ఇస్తుండటంతో సినిమాపై మంచి ఆసక్తి నెలకొంది. అంతేకాకుండా సత్యకు కెరీర్‌లో కీలక బ్రేక్ ఇచ్చిన దర్శకుడు రితేష్ రానా ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో అంచనాలు మరింత పెరిగాయి. కానీ విడుదల తర్వాత సినిమా ఆశించిన ఫలితాన్ని అందు కోలేకపోయింది. కథ, కథనం విష యంలో కొత్తదనం ఉంటుందని భావించిన ప్రేక్షకులకు సినిమా పూర్తిస్థాయిలో కనెక్ట్ కాలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీంతో బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఆశించిన వసూళ్లను రాబట్టలేకపోయింది. హీరోగా సత్య నటనకు ప్రశంసలు వచ్చిన ప్పటికీ,సినిమా మొత్తం పరంగా ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన లభించింది. ఇప్పుడు ఈ చిత్రం తన అదృష్టాన్ని ఓటీటీ వేదికపై పరీక్షించుకోడానికి సిద్ధమైంది. ప్రముఖ డిజిటల్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ జియో హాట్‌స్టార్ ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంది. మొదట ఈసినిమాను ఒకే భాషలో విడుదల చేస్తా రని వార్తలు వచ్చినా, తాజాగా తెలుగు ప్రేక్షకులతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ఇప్పుడు 'జెట్ లీ'కి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో కొత్తజీవితం దొరు కుతుందా? ప్రేక్షకుల నుంచి మంచి స్పం దన వస్తుందా? అన్న ఆసక్తి నెలకొంది.

## శర్వాతో జోడీ కట్టనున్న ఆషికా..?



దర్శకుడు శ్రీను వైట్ల -హీరో శర్వానంద్ కాంబినేషన్‌లో సినిమా రాబోతుంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఆషికా రంగనాథ్‌ను ఫిక్స్ చేసినట్టు తెలుస్తోంది. భర్త మహాశయులకు విజ్ఞప్తిలో రవితేజ సరసన నటించి ఆకట్టుకుంది ఆషికా రంగనాథ్. మరోవైపు శర్వానంద్ ఇప్పటికే ఈ సినిమా కోసం తన లుక్‌పై కసరత్తులు చేస్తోందని తెలుస్తోంది. కాగా గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ కామెడీ 'విశ్వం' ఏవరేజ్ గా నిలిచింది. దీంతో, ఎలాగైనా మళ్ళీ టాలీవుడ్‌లో తన తర్వాత సినిమాతో బిజీ అయ్యేందుకు శ్రీనువైట్ల తెగ కష్ట పడుతున్నాడట. ఈ క్రమంలోనే శర్వాకి కథ చెప్పాడు. కాగా తెలియని వయసులో ఆవేశంలో చేసిన ఓ పని కారణంగా హీరో లైఫ్‌లో జరిగే డ్రామా చాలా బాగుంటుందట. అలాగే, హీరో జీవితంలో చోటు చేసుకునే సంఘటనలు కూడా చాలా కామెడీగా సాగుతాయిట.. సినిమాలో లవ్ ట్రాక్ కూడా ఫుల్ ఎంటర్‌టైన్‌గా ఉంటుందని తెలుస్తోంది. ఈ ఏడాది చివర్లో వీరిద్దరి కలయికలో సినిమా మొదలు అవుతుందట. ఈ సినిమాలో మరో సీనియర్ హీరో కూడా కనిపిస్తాడని తెలుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది.

## 'స్పిరిట్' స్పెషల్ సాంగ్‌కి సన్నాహాలు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్టార్ లైనప్‌లో భారీ అంచనాలున్న సినిమా 'స్పిరిట్'. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా ఓ పవర్ ఫుల్ కాప్ స్టోరీగా రాబోతుంది. వచ్చే నెల మొదటవారంలో ప్రభాస్ -త్రుప్తి దిమ్రిని కాంబినేషన్‌లో ఓ స్పెషల్ సాంగ్ చిత్రీకరణకు మూవీ యూనిట్ ప్లాన్ చేసిందట. ఈ సాంగ్ కోసం ఓ భారీ సెట్ వేస్తున్నట్టు తెలుస్తోంది. భారీస్థాయిలో, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సాంగ్‌లో విజువల్స్ అద్భుతంగా ఉంటాయట. కాగా ఈ సినిమాలో ప్రభాస్ లుక్ కూడా పక్కా వైల్డ్ అండ్ మాస్ అవతార్‌లో ఉంది. కాగా మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రామేశ్వర్‌తో సందీప్ రెడ్డి మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా పూర్తి చేశాడు. చిత్రాన్ని టి-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ భారీస్థాయిలో నిర్మించనున్నాయి. అన్నట్టు 'స్పిరిట్' మెయిన్ కథాంశమే చాలా కొత్తగా ఉంటుందని.. సందీప్ రెడ్డి వంగా నుంచి మరో వినూత్న సినిమా రాబోతుందన్న అంచనాలు భారీగానే ఉన్నాయి.